ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥ 140/- పేజీలు: 154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 245 | మంగళవారం | 04-08-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

07

**బంగ్లా, నేపాల్‌వైపు చూడాల్సిన అవసరం లేదు**

- మనకు మహాత్మాగాంధీ స్ఫూర్తి • పిటిఐ ఇంటర్వ్యూలో సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే






### ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులపై

# ప్రత్యేక దృష్టి

- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, డిండి,గౌరవెల్లికి పర్యావరణ అనుమతుల సాధనకు చర్యలు
- ప్రతి ప్రాజెక్టుకు నోడల్ అధికారుల నియామకం
- ఏడురోజుల్లో అన్ని రికార్డులను సమీకరించాలి
- అధికారులకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలమూరు–రంగారెడ్డి, సీతారామ, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతుల సాధనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపి బలరాం నాయక్‌లతో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూపర్యావరణ అనుమతుల అంశంపై ప్రభుత్వం చేసిన న్యాయపోరాటం ఫలితంగా ఇచ్చిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో రాష్ట్ర ప్రాజెక్టులకు స్పష్టత వచ్చిందన్నారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను ప్రాధాన్యత జాబితాలో చేర్చి 6 నెలల్లో అవసరమైన అనుమతుల ప్రక్రియ పూర్తి చేయాసేలా అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. చట్టపరంగా అర్హత ఉన్న అన్ని దరఖాస్తులను కేంద్ర పర్యావరణ, అటవీ శాఖతో పాటు సంబంధిత సంస్థల వద్దకు వేగంగా ముందుకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ప్రతి ప్రాజెక్టుకు తరువాయి 8లో



### బంకీపూర్‌లో బిజెపి

# కంచుకోట బద్దలు

- జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ గెలుపు
- బిజెపి జాతీయ అధ్యక్షుడు నితీన్ నబిన్ సొంత సీట్‌లో షాక్
- ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో బిజెపి, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం

**న్యూఢిల్లీ:** బిహార్‌లో బిజెపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ రాజీనామా చేసిన బంకీపూర్ శాసన సభ నియోజక వర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో జన్ సూరాజ్ పార్టీ అధినేత రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సంచలన విజయం సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా నితిన్ నబీన్, ఆయన తండ్రికి కంచుకోటగా నిలిచిన ఈ నియోజక వర్గంలో బిజెపి ఓటమి ఆ పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈనెల 30న మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. బిహార్‌లోని బంకిపూర్, గుజరాత్‌లోని మంజల్‌పూర్ స్థానం, మధ్యప్రదేశ్‌లోని దతియా నియోజకవర్గాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి. నీట్ పేపర్‌లీక్‌పై కాక్రోజ్ జనతా పార్టీ నేతృత్వంలో నిరసనలు, 'పార్లమెంట్ మార్చ్', విద్యార్థులు, యువతపై పోలీసుల అమానుష చర్య, విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి ఘటనలు బంకీపూర్ ఉప ఎన్నికల్లో తీవ్ర ప్రభావాన్ని చూపినట్లు భావిస్తున్నారు. బిజెపి అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై ప్రశాంత్ కిషోర్ 19 వేలకుపైగా ఓట్లతో ఘన విజయం తరువాయి 12లో



# రుణం తీర్చుకోండి

- పుట్టిన గడ్డకు పెట్టుబడులతో కదలిరండి
- సాధించిన విజ్ఞానం మేదస్సును రాష్ట్ర, గ్రామాభివృద్ధిలో వినియోగించండి
- 'ఆట' జాతీయ మహాసభల వేదికగా డిప్యూటీ సిఎం ప్రవాస భారతీయులకు పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

పెట్టుబడులతో కదలిరండి.... పుట్టిన గడ్డ రుణం తీర్చుకోండి అంటూ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవాస భారతీయులకు పిలుపు నిచ్చారు. ప్రపంచ దేశాలతో పోటీపడేలా తెలంగాణ అభివృద్ధి జరుగుతోందని అనేక కష్టనష్టాలకోర్చి ఖండాంతరాలు దాటి ఉన్నత శిఖరాలకు చేరుకుని సాధించిన విజ్ఞానాన్ని, మేధస్సును సొంత రాష్ట్రం, పుట్టిన గ్రామాల అభివృద్ధికి వినియోగించడంలో భాగస్వామ్యం కావాలని కోరారు. అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం, బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్లో అట్టహాసంగా జరిగిన 19వ 'ఆట' (అమెరికన్ తెలుగు అసోసియేషన్) జాతీయ మహాసభలకు డిప్యూటి సిఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాకుండా, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో దీటుగా తెలంగాణ రాష్ట్రాన్ని పోటీపడే స్థాయికి తీసుకెళ్తున్నామని, ఈ క్రమంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రవాసులు ముందుకు రావాలని ఆయన కోరారు. సింగిల్ విండో విధానం ద్వారా అన్ని అనుమతులు వెంటనే ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని. పారిశ్రామికంగా, సామాజికంగా చేపట్టే ప్రతి కార్యక్రమంలో వెన్నంటి ఉంటామని హామీ ఇచ్చారు. ప్రవాస భారతీయులను ప్రత్యేకంగా ఆహ్వానించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను ఇక్కడికి పంపించారని తెలిపారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మలచాలనే స్పష్టమైన ప్రణాళికతో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని డిప్యూటి సిఎం వివరించారు. ఆనాడు సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణలో నేడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తరువాయి 8లో

# ఉరుములు.. మెరుపులు..

- గంటకు 30–40 కి.మీ వేగంతో ఈదురుగాలులు
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు
- వారం పాటు వర్షాలు
- వాతావరణ శాఖ హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. క్యుములో నింబస్ మేఘాల ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపు లు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురి సే అవకాశముందని హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం మంగళవారం ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, తరువాయి 8లో






### పార్లమెంట్‌కు అమిత్ షా

# ఎందుకు రారు?

- సభ ఆవరణలో ఇండియా కూటమి ఎంపిల నిరసన ప్రదర్శన
- కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శనల పరంపర కొనసాగుతోంది. రోజుకో రీతిలా వినూత్నంగా ఇండియా కూటమి, ఇతర విపక్ష ఎంపిలు తమ నిరసనను కొనసాగిస్తున్నాయి. తాజాగా సోమవారం అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీ, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలకు నిరసనగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో సహా ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ భవన ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. 'చందా చోర్, గద్దీ ఛోడ్', 'అమిత్ షా... సదన్‌కు రండి' వంటి నినాదాలు చేస్తూ ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం ముందు నిరసన తెలిపారు. రామ మందిరంలో విరాళాల చోరీకి ప్రతీకగా ఎంపిలు ఆ ప్రదేశంలో విరాళాల పెట్టెలను ఉంచి, వాటి చుట్టూ చేరి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అందిన విరాళాలకు, ఆ తర్వాత జరిగిన చోరీకి ప్రతీకగా కొందరు ఎంపిలు ఆపెట్టెలో నగదు కూడా వేశారు. ప్రియాంక గాంధీతో పాటు, ఎస్‌పికి చెందిన డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, టిఎంసికి చెందిన మహువా మొయిత్రా, జెఎంఎంకు చెందిన మహువా మాజీ, ఆర్ఎస్‌పికి చెందిన ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. 'అమిత్ షా పార్లమెంటుకు ఎందుకు గైర్హాజరు' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్ వెనుక నిరసన చేస్తున్న ఎంపిలు బారులు తీరారు. ఇటీవల నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో విద్యార్థి నిరసనకారులపై బలప్రయోగం చేయమని భద్రతా సిబ్బందికి ఇచ్చిన ఆదేశాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడు తూ 'ఈ పార్లమెంటు తరువాయి 8లో

# చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలి
- ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి
- డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్

**రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ వద్ద ధర్నాలు**




ప్రజాపక్షం/ఖైరతాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రచారంతో ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోకపోవడం అత్యంత విచారకరమని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో దళితుల అభ్యున్నతి, సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారత పేరుతో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి చాలా కాలం గడిచినా వాటి అమలులో ఎలాంటి చిత్తశుద్ధి కనిపించడం లేదని విమర్శించారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం, దళిత కుటుంబాల ఆర్థికాభివృద్ధి, విద్య, ఉపాధి, భూమి పంపిణీ, గృహ హక్కులు వంటి అంశాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని తరువాయి 8లో



### స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు నిరసిస్తూ

# 10న జైల్ భరో

- 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో శాంతియుతంగా కార్యక్రమం
- ఏడు ప్రధాన డిమాండ్ల సాధననే లక్ష్యం
- వాల్ పోస్టర్ ఆవిష్కరణలో ఎస్‌కెఎం నేతలు వెల్లడి

ప్రజాపక్షం/ హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం అమెరికాతో సహా ఇతర దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను (ఎఫ్‌టిఎలు) తక్షణమే ఉపసంహరించుకోవడంతో పాటు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం సి2+50 విధానం ప్రకారం అన్ని పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధరను ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు తరువాయి 8లో

**నీట్ ఆందోళనకారులపై ఎఫ్‌ఐఆర్‌లు**

# రాష్ట్రాలు ఉపసంహరించుకోవచ్చు

### వాటికి ఆ స్వేచ్ఛ ఉంది : సుప్రీంకోర్టు స్పష్టీకరణ





**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లపై సోమవారం సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లు ఉపసంహరించుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉందని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారణ చేసింది. 'నేర చరిత్ర' అనే పదం కేవలం తీవ్రమైన, హేయమైన నేరాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అందువల్ల నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులకు గతంలో తీవ్రమైన, హేయమైన నేర చరిత్ర లేనట్లయితే, వారిపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను ఢిల్లీ సహా ఇతర రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వాలు మూసివేయవచ్చని, లేదా ఉపసంహరించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విచారణ ప్రారంభంలో సొలిసిటర్ తరువాయి 12లో

### 'సర్' ప్రక్రియలో

# కచ్చితత్వమే ప్రామాణికం

- ఓటరు జాబితాలో లోపాలు సరిదిద్దాలి
- ఏ ఒక్క అర్హుడి ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి
- అధికారులకు సిఇఒ సి. సుదర్శన్ రెడ్డి ఆదేశం




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌లో ఫొటోలు లేకపోవడం, పుట్టిన తేదీల్లో వ్యత్యాసాలు, లింగవి వరాలు, సంతకాలలో లోపాలు వంటి పొరపాట్లను వెంటనే సరిచేయాలని సూచించారు. ఎస్ఐఆర్ పురోగతిపై సోమవారం అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ తరువాయి 12లో

02

ప్రజాపక్షం
Telugu National Daily

కరీంనగర్
మంగళవారం
04-08-2026
www.prajapaksham.in

ఎడిట్
PEOPLE'S VIEWS

# కామన్వెల్త్ గేమ్స్‌లో నారీశక్తికి అభినందనలు

స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో ఆదివారం రాత్రి ఉత్సవంతో ముగిసిన కామన్వెల్ గేమ్స్ 23వ ఎడిషన్‌లో భారత్ అథ్లెట్లు ప్రశంసనీయ ప్రదర్శనతో పతకాల పట్టికలో భారత్ నాలుగవ స్థానంలో నిలవటం గర్వించదగిన ఘట్టం. కుస్తీ, షూటింగ్ వంటి క్రీడలు కూడా పోటీల్లో ఉన్నట్లయితే భారత్ పతకాల సంఖ్య మరింత మెరుగ్గా ఉండేదని ఘంటాపథంగా చెప్పవచ్చు. భారత్ అథ్లెట్లు సాధించిన 39 పథకాల్లో 13 బంగారం, 17 వెండి, 9 కాంస్యం. 13 బంగారు పతకాలలో 8 మహిళా అథ్లెట్లు సాధించడం ప్రత్యేక ప్రశంసలకే కాదు, వరాల జల్లుకు పాత్రులు. 2014 నుంచీ ఒక భారత అథ్లెట్ రెగ్యులర్‌గా పోడియం ఎక్కుతున్నారు. ఆమె ఎవరో కాదు ప్రసిద్ధ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను. గ్లాస్గోలో ఆమె వరుసగా మూడవసారి స్వర్ణ పతకం సాధించారు. అటువంటి అద్భుతం సాధించిన తొలి మహిళా అథ్లెట్ చానునే. ఆమెతో పాటు పారా అథ్లెట్ షర్మిలా థంకర్ (మహిళల షాట్‌పుట్), జుడోకా అస్మిత డే (ఈ పోటీలో భారత్‌కు తొలి స్వర్ణం సాధించి ఆమె చరిత్ర సృష్టించారు), బాక్సర్ సాక్షి చౌదరి (గ్లాస్గో వెళ్లకముందే భారత్‌లో నిఖత్ జరీన్‌ను ఓడించి ఆధిక్యతలోకి వచ్చారు. గ్లాస్గోలో నాలుగు బౌట్లలో ప్రత్యర్థులను సునాయసంగా ఓడించి త్రివర్ణ పతాకం రెపరెపలాడించారు.

భారత బాక్సింగ్‌కు శనివారం అరుణాక్షరాలతో లిఖించదగిన రోజు అన్నారు బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బిఎఫ్‌ఐ) అధ్యక్షుడు అజయ్ సింగ్. బాక్సర్స్ 7 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు గెలుచుకోవడం ఆయన అవధులు లేని ఆనందానికి హేతువు.

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం అంతరించిన తదుపరి దాని అవశేషంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు—తమ పూర్వపు వలస దేశాలతో ఏర్పాటు చేసిన అలంకారప్రాయమైన వ్యవస్థ. పేరు కామన్వెల్త్. వలస దేశాల నుంచి సంపదను దోచుకుపోయిన బ్రిటిష్ సామ్రాజ్యం ఉమ్మడి సంపదగా మిగిల్చిందేమీ లేదు. నయా వలసవాదంతో ఆ తదుపరి కూడా నవ స్వతంత్ర దేశాలను ఆర్థికంగా దోచుకుంది. దాని ఆర్భాట ప్రదర్శనలో భాగంగా పురుడు పోసుకున్నవి కామన్వెల్త్ క్రీడలు. 1934లో ఈ క్రీడల్లో తొలిసారి పాల్గొన్న భారత్ దాని అన్ని ఎడిషన్స్‌లోను—నాలుగు తప్ప (1930, 1950, 1962, 1986) పాల్గొంది. భారత్ అనేక క్రీడల్లో పాల్గొంటున్నా దానికి పతకాల పంట పండించింది మాత్రం షూటింగ్, కుస్తీ. షూటింగ్‌లో 63 స్వర్ణాలు సహా 135 పతకాలు, కుస్తీలో 49 స్వర్ణాలుసహా 115 పతకాలు లభించాయి. ఆ వరుసలో వెయిట్ లిఫ్టింగ్‌ది మూడవ స్థానం. గ్లాస్గో గేమ్స్ కుదించబడిన క్రీడా పోటీలతో జరిపారు. గ్లాస్గోలో కామన్వెల్ క్రీడల పతాకం, బాటన్ తదుపరి క్రీడల ఆతిథ్య దేశమైన భారత్‌కు స్కాట్లాండ్ అందించింది. 2030 కామన్వెల్త్ క్రీడలకు అమ్దా వాద్ (అహ్మదాబాద్) వేదిక కానుంది. భారత్ ఆతిథ్యం అంటేనే ఆర్భాటం.

2036 ఒలంపిక్ క్రీడల నిర్వహణకు ఆతిథ్య అవకాశం కోసం పోటీపడే ఆలోచన భారత ప్రభుత్వంలో ఉన్నందున 2030 అమ్దాబాద్ కామన్వెల్త్ గేమ్స్‌ను ఘనంగా నిర్వహించేందుకు సకల ప్రయత్నాలూ జరుగుతున్నాయి. ఈ 24వ ఎడిషన్‌కు 70 దేశాలు, భూభాగాల నుంచి రానున్న వేలాది మంది అథ్లెట్లు, సిబ్బందికి పదికాలాలపాటు గుర్తుండే ఆతిథ్యమివ్వనుంది. గతంలో 2010లో కామన్వెల్త్ గేమ్స్ ఢిల్లీలో జరిగాయి. ఆ ఎడిషన్ నిర్వహణ రాజకీయ వైరాల మధ్య అవినీతి ఆరోపణలకు గురైనప్పటికీ, భారత క్రీడాకారులు పతకాల పట్టికలో రెండవ స్థానంలో నిలిచారు. షూటింగ్, కుస్తీ పోటీలు పునఃప్రవేశం చేయనున్నందున అమ్దావాద్‌లో భారత్ ఆ స్థానాన్ని తిరిగి పొందవచ్చు, ఒక అడుగుపైకి ఎగబాకనూవచ్చు.

జపాన్‌లో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే ఆసియా క్రీడల పోటీలు, భారత క్రీడాకారుల ప్రతిభకు, పోటీతత్వానికి పరీక్ష కానున్నాయి. చైనా, జపాన్, ఉభయ కొరియాల నుంచి గట్టి పోటీ ఎదురవుతుంది. ఏమైనా నిరంతర శ్రమ, తర్ఫీదు, క్రమశిక్షణ—అన్నిటికీ మించి భారత ప్రభుత్వ ప్రోత్సాహం క్రీడారంగంలో రాణించేందుకు అవసరం. అథ్లెట్ల తయారీకి క్రీడాకారుల అభిరుచి, ఆసక్తితోపాటు తల్లిదండ్రుల త్యాగం ఎన్నడూ విస్మరించకూడనిది. ●



## పేపర్ లీక్‌పై ఆర్ఎస్ఎస్ వైఖరేమిటి?

**పేపర్ లీక్ దేశద్రోహ నేరం అని సిపిఐ భావిస్తోంది. ఇది యువత, విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ప్రశ్నాపత్రం లీకేజీని దేశ ద్రోహ నేరంగా ఆర్ఎస్ఎస్ భావిస్తుందా లేకపోతే కొద్దిమంది చేసిన దేశభక్త, జాతీయవాద పని అని మద్దతిస్తోందా? లీకేజీపై ఆర్ఎస్ఎస్ వైఖరి ఏమిటి, దీనిపై ఎబివిపి వైఖరేమిటి. వామపక్ష విద్యార్థి సంఘాలైన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎ పేపర్ లీక్‌పై పోరాటాలు చేశాయి. సిజెపి పిలుపు మేరకు వామపక్ష విద్యార్థులు ఐక్య నిరసన ద్వారా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేలా, పార్లమెంటులో చట్టం తీసుకువచ్చేలా మోదీపై ఒత్తిడి తీసుకువచ్చాయి. పేపర్ లీక్‌పై ఆర్ఎస్ఎస్ ఏమి సమాధానం ఏమిటి?**

– డి.రాజా, సిపిఐ ప్రధాన కార్యదర్శి ●

# ఒంటరి మహిళ సమాజానికి స్ఫూర్తి

సమాజం మారుతోంది. కుటుంబ వ్యవస్థలు మారుతున్నాయి. జీవన విధానాలు కొత్త రూపం దాల్చుతున్నాయి. ఈ మార్పుల మధ్య తమ జీవితాన్ని తాము నిర్మించుకుంటూ, కుటుంబ బాధ్యతలను ఒంటరిగా భుజాన వేసుకుని, ఉద్యోగ రంగంలో రాణిస్తున్న మహిళల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అలాంటి మహిళల ఆత్మస్థైర్యాన్ని, శ్రమను, స్వావలంబనను గుర్తించి గౌరవించాల్సిన అవసరాన్ని గుర్తు చేసే సందర్భమే సింగిల్ వర్కింగ్ ఉమెన్స్ డేను ప్రతి సంవత్సరం ఆగస్టు 4న జరుపుకుంటారు. ఒంటరిగా జీవిస్తూ ఉద్యోగం చేసే మహిళలను సమాజం ఇప్పటికీ ఒకే కోణంలో చూడడం లేదు. వివాహం కాని మహిళ, విడాకులు తీసుకున్న మహిళ, భర్తను కోల్పోయిన మహిళ లేదా కుటుంబానికి ఏకైక ఆధారంగా నిలిచిన మహిళ— ఇవన్నీ వేర్వేరు పరిస్థితులే అయినప్పటికీ, సమాజం వారిని అనేక సందర్భాల్లో అనవసరమైన ప్రశ్నలు, అనుమానాలు, వివక్షతో ఎదుర్కొంటోంది. ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉంది.ఉద్యోగ జీవితంలో సింగిల్ వర్కింగ్ మహిళలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కార్యాలయ వేధింపులు, రాత్రి వేళల్లో ప్రయాణ భద్రత, అద్దె ఇళ్లు పొందడంలో వివక్ష, సమాజం నుంచి వచ్చే అనవసర వ్యాఖ్యలు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు వారి దైనందిన జీవితంలో భాగమయ్యాయి. అయినప్పటికీ వారు వెనుకడుగు వేయకుండా తమ లక్ష్యాల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. మహిళా సాధికారత అంటే కేవలం ఉద్యోగ అవకాశాలు కల్పించడం మాత్రమే కాదు. భద్రత, సమాన వేతనం, పదోన్నతుల్లో సమాన అవకాశాలు, కార్యాలయాల్లో గౌరవప్రదమైన వాతావరణం, ఆరోగ్య భద్రత, సామాజిక రక్షణ కల్పించినప్పుడే అది నిజమైన సాధికారత అవుతుంది. మహిళ స్వేచ్ఛగా జీవించే హక్కును గౌరవించడం నాగరిక సమాజ లక్షణం. ప్రభుత్వాలు సింగిల్ వర్కింగ్ మహిళల కోసం ప్రత్యేక సంక్షేమ విధానాలను రూపొందించాలి. సురక్షిత హాస్టళ్లు, చవకైన నివాస సదుపాయాలు, రాత్రి వేళల్లో సురక్షిత రవాణా, కఠినమైన కార్యాలయ వేధింపుల నిరోధక వ్యవస్థ, మానసిక ఆరోగ్య సేవలు, సామాజిక భద్రతా పథకాలు మరింత బలోపేతం కావాలి. ప్రైవేట్ సంస్థలు కూడా మహిళా ఉద్యోగుల సంక్షేమాన్ని తమ సామాజిక బాధ్యతగా భావించాలి. అదే సమయంలో సమాజం కూడా తన దృక్పథాన్ని మార్చుకోవాలి. ఒంటరిగా జీవిస్తున్న మహిళలను జాలి చూపాల్సిన వ్యక్తులుగా కాకుండా, తమ జీవితాన్ని తాము నిర్మించుకున్న ఆత్మగౌరవం కలిగిన వ్యక్తులుగా చూడాలి. మహిళలు భద్రంగా, స్వేచ్ఛగా, గౌరవప్రదంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజం. అలాంటి సమాజ నిర్మాణంలో ప్రభుత్వం, సంస్థలు, కుటుంబాలు, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే సింగిల్ వర్కింగ్ ఉమెన్స్ డే సార్థకమవుతుంది.

**(ఆగస్టు 4న సింగిల్ వర్కింగ్ ఉమెన్స్ డే సందర్భంగా)**

**– ఆళవందార్ వేణు మాధవ్**
**8686051752, హైదరాబాద్**

# విద్యావ్యవస్థలో సమూల సంస్కరణలు అవసరం



కృష్ణ ఝూ

కాలేజీలలో అడ్మిషన్‌లు, ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పరీక్షలతో సహా భారతదేశ విద్యా వ్యవస్థపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న క్రమబద్ధమైన దాడుల కారణంగా యువతలో అసంతృప్తి నెలకొంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ ఇటీవల జరిగిన ఉద్యమం దీనికి ఒక ఉదాహరణ. ఆ సమయంలో విద్యార్థుల డిమాండ్‌ను అంగీకరించక తప్పని పరిస్థితిలో ప్రభుత్వం ఆ మంత్రిని పదవి నుంచి తొలగించింది. మరోవైపు విద్యా వ్యవస్థ మొత్తంగా నాశనమైంది, ఉపాధి సమస్యకు కూడా పరిష్కారం లభించలేదు.

ఉదాహరణకు మన దేశంలో అండర్ గ్రాడ్యుయేషన్ (డిగ్రీ)లో చేరే విద్యార్థులు సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇది వారిని తీవ్రంగా నష్టపోయే స్థితి వైపు నడిపించేలా ఉంది. నమోదైన, నమోదు కాని విద్యార్థులను బడ్జెట్ కోతల పర్యవసానాలు దిగ్భ్రాంతికి గురిచేస్తూ, వినాశకరమైన ప్రభావాన్ని చూపాయి. అన్ని ఆశలు కోల్పోయిన వారు శారీరక లేదా మానసిక శ్రమ తో కూడిన ఇతర వృత్తుల వైపు మళ్లుతున్నారు. ఇది వారి సున్నితమైన కౌమారదశకు ప్రమాదకరం. ప్రభుత్వం విద్య నుండి ఉద్దేశపూర్వకంగా వెనక్కి తగ్గడంతో వారు క్రూరమైన అజ్ఞాన ప్రపంచంలోకి నెట్టివేయబడుతున్నారు. పాఠశాలల విద్యా బడ్జెట్ మొత్తంలో 50 శాతం కోత విధించారు.

ఉన్నత విద్య విషయంలో కోత 33 శాతానికి మాత్రమే పరిమితం కావడం కొంత ఊరటనిచ్చే విషయం. కానీ కోతలు ఇంతటితో ఆగలేదు, ఇంకా చాలానే ఉన్నాయి. పాఠశాలలు మూసివేశారు. వాటి స్థానంలో 43 వేల ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభించారు. డబ్బు గుంజడం, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ భావజాలంతో కూడిన శిక్షణ పొందిన ఒక వర్గాన్ని తయారు చేయడం వీటి ప్రధాన ఉద్దేశ్యం. పిల్లలు తీవ్రమైన నిరాశావాదంతో బాధపడుతున్నారు. వారు తమ భవిష్యత్తును ఊహించుకోలేకపోతున్నారు, తద్వారా ఆశావాదాన్ని పూర్తిగా కోల్పోయారు. విద్యా వ్యవస్థను దెబ్బతీయడానికి ఒక ఉద్దేశపూర్వక ప్రయత్నం జరిగింది, ఇది యువతకు ఉపాధి అవకాశాలను మరింత బలహీనపరిచింది.

అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం, మొత్తం నమోదులలో 75 శాతానికి పైగా వాటా కలిగిన అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరిన విద్యార్థుల సంఖ్య, 2022–23, 2023–24 మధ్య రెండేళ్ల కాలంలో 93,000 (0.27 శాతం) తగ్గింది. దేశంలో అర్హత కలిగిన వయస్సులోని గల యువత జనాభా పెరుగుతున్నప్పటికీ ఈ పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఉన్నత విద్యాసంస్థల (హెచ్ఇఐల) సంఖ్య కూడా 2022–23లో 59,533 నుండి 2023–24లో 56,180కి తగ్గింది. ప్రధానంగా ఆర్ట్స్, సైన్స్, కామర్స్ కోర్సులలో ఈ తగ్గుదల ఉంది. అయితే, ప్రభుత్వం ఈ తగ్గుదలపై దృష్టి సారించకుండా, 'స్థూల నమోదు నిష్పత్తి'లో నమోదైన స్వల్ప పెరుగుదలను మాత్రమే ఎక్కువ చేసి చూపిస్తోంది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, పిహెచ్‌డి, ఇతర సర్టిఫికేట్ కోర్సులతో కూడిన ఉన్నత విద్యలో మొత్తం నమోదులో పెద్దగా మార్పు లేదు. 2022–23 నుండి 2023–24 మధ్య ఇది కేవలం 3.7 లక్షలు లేదా 0.08 శాతం మాత్రమే పెరిగింది. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ తగ్గుదల అత్యధికంగా ఉంది. అలాగే ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ వంటి కేంద్రపాలిత ప్రాంతాలలో కూడా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల నమోదులో భారీ తగ్గుదల నమోదైంది.

ఆ నివేదిక ప్రకారం, దేశ రాజధాని, ఉన్నత విద్యకు ప్రధాన కేంద్రమైన ఢిల్లీలో, 2023–24లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరిన విద్యార్థుల సంఖ్య ఆరు శాతం తగ్గింది. తమిళనాడు, బిహార్, కర్నాటక, ఒడిశా రాష్ట్రాల్లో మాత్రమే నమోదు సంఖ్య పెరిగింది. ఈ పెరుగుదల దేశం మొత్తం పనితీరు మెరుగుపడటానికి దోహదపడింది. ముఖ్యంగా తమిళనాడులో 1.6 లక్షల నమోదులు పెరిగాయి. ఇది ఉత్తరప్రదేశ్‌లో నమోదైన 1.53 లక్షల భారీ తగ్గుదలను భర్తీ చేసింది.

వాస్తవానికి, రాష్ట్రాలకు అక్కడి ప్రజల అవసరాలకు అనుగుణంగా అడ్డంకులను స్వయంగా పరిష్కరించుకునే స్వేచ్ఛ ఇప్పుడు లేదు. మన ప్రజాస్వామ్య డిమాండ్లకు అనుగుణంగా రూపొందించిన మన విద్యా వ్యవస్థ ఉద్దేశ్యాన్ని నాశనం చేయడానికి స్పష్టమైన ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటివరకు పనిచేస్తున్న వ్యవస్థ స్వరూపాన్ని, లక్ష్యాలను మార్చే పద్ధతి నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ ప్రయత్నాలన్నింటి ఫలితమే గత పన్నెండేళ్లలో దేశంలో 152 పేపర్ లీకులు.

ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం వల్ల ఏర్పడిన ఉపాధి కొరత అత్యంత భయంకరమైన అడ్డంకి. ఇటీవల కాలంలో ఇది 40 శాతంగా ఉంది. విద్యార్థులు ఇతర ఉద్యోగాల కోసం సరైన విద్య, శిక్షణ పొందలేకపోతున్నారు. తద్వారా నిరుద్యోగంలోకి నెట్టివేయబడుతున్నారు. ఈ విద్యార్థులకు వ్యవస్థే అందుబాటులో లేకుండా పోయింది. పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. కేంద్రం తీసుకుంటున్న చర్యలలో ఏమాత్రం ఆశాకిరణం కనిపించడం లేదు.





కానీ ప్రభుత్వ వైఖరి నిరంకుశంగానే ఉంది. ఇటీవల ఢిల్లీలో విద్యార్థి నిరసనల సమయంలో, విద్యార్థుల సమస్యలను వినడానికి బదులుగా ప్రభుత్వం అత్యంత క్రూరంగా ప్రవర్తించింది. భద్రతా దళాలు నిరసన చేస్తున్న విద్యార్థులపై మెటల్ పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపాయి. ఫలితంగా వారి కళ్లకు, మృదు కణజాలాలకు తీవ్ర గాయాలయ్యాయి . విద్యుత్ షాక్ ఇచ్చే పరికరాలతో పాటు మేకులు దింపిన లాఠీలను కూడా ఉపయోగించాయి. నిరసన చేస్తున్న విద్యార్థులు దాదాపు అందరూ ఢిల్లీలో వీధుల్లోకి వచ్చినప్పటికీ, నిరసనలు జరిగిన రోజుల్లో దాదాపు 17 మెట్రో స్టేషన్లు మూసివేయబడ్డాయి. అంతేకాకుండా, నిరసనలు ఉచ్ఛస్థితిలో ఉన్న రోజుల్లో కనీసం 17 మెట్రో స్టేషన్లలో రెండు ప్రాథమిక అవసరాలైన ఆహారం, నీరు అందుబాటులో ఉంచడానికి సరైన ఏర్పాట్లు లేవు.

పేపర్లను లీక్ చేసినట్లు రుజువైన వారికి శిక్షను పెంచే బిల్లును తీసుకురావడం వంటి పైపై చర్యలను ప్రభుత్వం ఇప్పుడు ఎంచుకుంది. పేపర్ లీక్ అనేది ఒక లక్షణం మాత్రమే. ఈ అసలైన సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఎలాంటి గంభీరమైన చర్యలు తీసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి ఇప్పటికీ లేదు.

నిజానికి, విద్యావ్యవస్థలో మౌలికంగానే లోపాలు ఉన్నాయి. వాటిని తొలగించి, సంపూర్ణ మార్పు తీసుకురావడానికి ఒక చొరవ తీసుకోవడం అత్యవసరం. అలాగే, ఇలాంటి అక్రమ పద్ధతులను ఎదుర్కోవడానికి కఠినమైన చట్టం ఉండాలి. సంక్షోభాన్ని సమగ్రంగా పరిష్కరించకపోతే, ప్రజలకు విశ్వాసం ఉండదు. విద్య ఉపాధి ఆధారితంగా ఉండాలి. పాఠశాల విద్యలో అడుగుపెట్టినప్పటి నుంచే పిల్లలు ఒక కొత్త మార్గాన్ని నిర్దేశించుకుంటూ ఎదగాలి, అలాగే ఈ ప్రక్రియకు పాలక యంత్రాంగం తగిన సహకారాన్ని అందించాలి.

# ధర్మం, సంయమనం, రాజకీయాల మధ్య నిలిచిన స్వరం



అయోధ్య రామ మందిర నిర్మాణంలో కలిసి పోయిన ఒక అభాగ్యుడు **బాబా లాల్ దాస్**: అయోధ్యలో వినిపించని స్వరం – మతం, రాజకీయాలు, మనిషి మధ్య నిలిచిన ఒక సన్యాసి. మతం మనుషులందరిని కలిపే ఒక మహత్తర శక్తిగా భావించిన మహామనీషి. అందుకే మతాన్ని రాజకీయాలుగా, అధికారానికి సోపానాలుగా మార్చుకొన్న వారి ఆగ్రహానికి బలి అయ్యాడు. అయోధ్య రామాలయంలో భక్తులు ధన, వస్తు రూపంలో ఇచ్చిన దానాలు అక్రమదారులలో తరలిపోయాయనే ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. కానీ ఇలాంటి ఆరోపణలు కొత్తవి కావని, అయోధ్య రామాలయ ఉద్యమ ప్రారంభకాలం నుండే భక్తుల విరాళాల దుర్వినియోగం, వ్యకిగత అవసరాలకు ఆయా సంస్థలు వినియోగించాయనే ఆరోపణలు ఉన్నాయి.

అయోధ్య వివాదం భారతదేశ రాజకీయ, సామాజిక చరిత్రలో అత్యంత ప్రభావం చూపిన ఉద్యమం. అందులో ఒక భిన్నమైన స్వరం కూడా వినిపించింది. అది బాబా లాల్ దాస్ స్వరం. రామ జన్మభూమి–బాబ్రీ మసీదు ప్రాంగణంలో పూజారిగా సేవలందించిన ఆయన, తరువాత కాలంలో ఉద్యమానికి సంబంధించిన ప్రధాన రాజకీయ కథనాలకు భిన్నమైన ఆయన జీవితం అంతా, మతం, రాజకీయాలు, సామాజిక బాధ్యతల మధ్య ఏర్పడిన సంఘర్షణకు ప్రతిబింబంగా కనిపిస్తుంది.

1949లో బాబ్రీ మసీదు లోపల రామలల్లా విగ్రహాలు ప్రత్యక్షమైన తరువాత ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని నియంత్రణలోకి తీసుకుంది. పరిమిత పూజా కార్యక్రమాలు కొనసాగించేందుకు కొందరు పూజారులను నియమించింది. ఆ బాధ్యత నిర్వహించిన వారిలో బాబా లాల్ దాస్ మొదటివారు. కోర్టు ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించింది. ఈ కారణంగా ఆయన అయోధ్యలో జరిగిన పరిణామాలను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. 1980ల చివరలో రామ జన్మభూమి ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించిన సమయంలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకత్వం ఉద్యమాన్ని తీవ్రవతరం చేస్తుండగా, బాబా లాల్ దాస్ మాత్రం ఉద్యమ రాజకీయాకరణపై తన ఆందోళనను వ్యక్తం చేశారు. మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం హిందూ ధర్మం అసలు ఆత్మకు విరుద్ధమని ఆయన పలుమార్లు పేర్కొన్నారు.

**రాజకీయ ఉద్యమానికి భిన్నమైన ఆధ్యాత్మిక దృక్పథం**

1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేత భారత చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలిచింది. దేశంలో మత ఘర్షణలు చెలరేగగా, భారత రాజకీయాల్లో శాశ్వత మార్పులకు ఈ సంఘటన కారణమైంది. ఈ నేపథ్యంలో బాబా లాల్ దాస్ స్పందన ప్రత్యేకమైనది. రాముడి పేరుతో హింసను సమర్థించలేమని, మతం మనుషులను కలపడానికి ఉద్దేశించబడిందని ఆయన స్పష్టం గా అభిప్రాయపడ్డారు. రాముడు న్యాయం, కరుణ, ధర్మానికి ప్రతీక అని, ద్వేషానికి లేదా రాజకీయ ఆధిపత్యానికి ప్రతీక కాదని ఆయన పేర్కొన్నారు.

1993లో ఆయన చంపబడడానికి మూడునెలల ముందు ''మానుషి'' అనే పత్రిక సంపాదకురాలు మధు కుశవర్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ విస్తృత చర్చకు దారితీసింది. అందులో అయోధ్య వివాదాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించారని, ప్రజల మత విశ్వాసాలను ఎన్నికల రాజకీయాలకు అనుసంధానం చేయడం ప్రమాదకరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు అప్పటి ఉద్యమ ప్రధాన కథనానికి భిన్నంగా ఉండటంతో ఆయన వివాదాస్పద వ్యక్తిగా మారారు. కొందరు ఆయనను శాంతి, సామరస్యానికి ప్రతినిధిగా కొనియాడగా, మరికొందరు తీవ్రంగా విమర్శించారు. అయినప్పటికీ ఆయన తన అభిప్రాయాలను మార్చుకోలేదు.

**బాబా లాల్ దాస్ వారసత్వం**

బాబా లాల్ దాస్ పేరు అయోధ్య ఉద్యమం ప్రధాన నాయకుల జాబితాలో కనిపించకపోవచ్చు. కానీ ఆ ఉద్యమం నడిచిన కాలంలో ఆయన నిలబడ్డ స్థానం, చెప్పిన మాటలు, చూపిన సంయమనం మాత్రం చరిత్రలో ప్రత్యేకంగా గుర్తుంచుకోవాల్సినవి. ఆయన రామలల్లా పూజారి మాత్రమే కాదు; రామభక్తిని రాజకీయ ప్రయోజనాల నుంచి వేరు చేసి చూడాలని హెచ్చరించిన అరుదైన స్వరం కూడా. అయోధ్య వివాదం క్రమంగా దేశవ్యాప్తంగా భావోద్వేగ, రాజకీయ, మతపరమైన అంశంగా మారినప్పుడు, బాబా లాల్ దాస్ మాత్రం ఆలయంలోనే ఉండి తన నిత్యకర్మలను కొనసాగించారు. ఆయనకు రాముడు అంటే కేవలం ఒక దేవతా ప్రతిమ కాదు; ధర్మం, న్యాయం, కరుణ, సహనం వంటి విలువల ప్రతీక. అందుకే రాముడి పేరుతో ద్వేషాన్ని, విభజనను, ఎన్నికల లాభాలను సమర్థించడం ఆయనకు అంగీకారయోగ్యం కాలేదు.

**ఆయన మాటల్లో ఒక ముఖ్యమైన సందేశం ఉంది: భక్తి అనేది సమాజాన్ని కలిపే శక్తి కావాలి, విడదీసే ఆయుధం కాకూడదు. ఈ ఆలోచన అప్పట్లో ఎంత ప్రాసంగికమో, నేటికీ అంతే ప్రాసంగికం. మతం పేరుతో ప్రజలను ధ్రువీకరించే ధోరణి పెరుగుతున్న కాలంలో, బాబా లాల్ దాస్ వంటి వ్యక్తుల మాటలు మరింత విలువైనవిగా మారుతున్నాయి.**

అయోధ్య ఉద్యమం చివరికి ఒక చారిత్రక మలుపు తీసుకున్నప్పటికీ, దాని దీర్ఘకాల ప్రభావం కేవలం ఆలయ నిర్మాణంతో ముగిసిపోలేదు. అది భారత రాజకీయాల్లో మతం పాత్రను, ప్రజాభావోద్వేగాల వినియోగాన్ని, మెజారిటీ – మైనారిటీ సంబంధాలపై పడిన ప్రభావాన్ని కూడా లోతుగా మార్చింది. ఈ పరిణామాల మధ్య బాబా లాల్ దాస్ హెచ్చరికలు ఒక నైతిక గుర్తుగా నిలిచాయి.

ఆయనను గుర్తు చేసుకోవడం అంటే కేవలం ఒక పూజారిని స్మరించుకోవడం కాదు; భక్తి, బాధ్యత, సహజీవనం, సంయమనం వంటి విలువలను తిరిగి ఆలోచించుకోవడం. అయోధ్య చరిత్రను ఒకే కోణంలో కాకుండా, అక్కడ జీవించిన ప్రజల అనుభవాలు, భిన్న స్వరాలు, అంతర్లీన సంక్లిష్టతలతో చూడాల్సిన అవసరాన్ని ఆయన జీవితం మనకు గుర్తు చేస్తుంది. ఈ నేపథ్యంలో బాబా లాల్ దాస్ వారసత్వం ఒక ప్రశ్నగా మిగులుతుంది: రాముని పేరు మనకు ఏం నేర్పాలి? విభజననా, సమన్వయమా? రాజకీయ లాభమా, ధర్మబోధనా? ఆయన జీవితం ఇచ్చే సమాధానం స్పష్టం – **రాముడు ప్రజలను కలిపే ఆదర్శం కావాలి, విడదీసే నినాదం కాదు.**

అందుకే అయోధ్య ఉద్యమ చరిత్రలో బాబా లాల్ దాస్ ఒక ఉపపాత్ర కాదు; ఆ ఉద్యమం వెనుక ఉన్న నైతిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన కీలక స్వరం. ఆయన మాటలు, ఆందోళనలు, నిలకడ – ఇవన్నీ కలిసి ఒక ముఖ్యమైన పాఠాన్ని చెబుతాయి: **విశ్వాసం ఉన్న చోటే వివేకం కూడా ఉండాలి.** అదే ఆయన నిజమైన వారసత్వం.

**హత్య, అనుమానాలు**

1993 నవంబరు 16న బాబా లాల్ దాస్ గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో హత్యకు గురయ్యారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. హత్య వెనుక ఉన్న కారణాలపై అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. అంతకు ముందు ఎన్నోసార్లు ఆయనపై హత్య ప్రయత్నాలు జరిగాయి. అప్పటి కళ్యాణ్ సింగ్ ప్రభుత్వం ఆయనకు రక్షణ కల్పించడానికి నిరాకరించింది. కొందరు దీనిని అయోధ్య వివాదంలో ఆయన తీసుకున్న వైఖరితో ముడిపెట్టగా, మరికొందరు ఇతర కారణాలను ప్రస్తావించారు. అయితే ఆయన హత్యకు సంబంధించిన పూర్తి సత్యం అధికారికంగా నిర్ధారణ కాలేదు. ఈ కారణంగా బాబా లాల్ దాస్ మరణం ఇప్పటికీ అనేక ప్రశ్నలను మిగిల్చిన సంఘటనగానే చరిత్రలో నిలిచింది.

**చరిత్ర చెప్పే పాఠం**

బాబా లాల్ దాస్ జీవితాన్ని ఒక కోణంలో చూస్తే అది వ్యక్తిగత ధైర్యానికి నిదర్శనం; మరో కోణంలో చూస్తే భారత ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలకు ఉన్న స్థానం గురించి మనల్ని ఆలోచింపజేసే అధ్యాయం. ఆయన అభిప్రాయాలతో ప్రతి ఒక్కరూ ఏకీభవించాల్సిన అవసరం లేదు. కానీ మతం పేరుతో హింసకు బదులుగా సంభాషణ, సహనం, సామరస్యాన్ని ప్రతిపాదించిన ఆయన స్వరం భారత సామాజిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. నేటి భారతదేశంలో మతం, రాజకీయాలు, జాతీయత వంటి అంశాలపై తీవ్రమైన చర్చలు కొనసాగుతున్న సందర్భంలో బాబా లాల్ దాస్ జీవితం ఒక ముఖ్యమైన ప్రశ్నను మన ముందుంచుతుంది. **మతం ప్రజలను విభజించే ఆయుధమా? లేక సమాజాన్ని ఏకం చేసే నైతిక శక్తియా?** ఆయన జీవితమంతా ఇచ్చిన సందేశం రెండో దానికే మద్దతుగా కనిపిస్తుంది. అదే కారణంగా బాబా లాల్ దాస్ పేరు కేవలం అయోధ్య చరిత్రలోనే కాదు, భారత ప్రజాస్వామ్యంలో భిన్న స్వరాలకు ప్రతీకగా కూడా గుర్తుండిపోతుంది.

**– సిహెచ్‌వి ప్రభాకర్ రావు**
**9391533339**

## జీవ వైవిధ్య పరిరక్షణకు గుడ్లగూబలను కాపాడుకుందాం



గుడ్లగూబ పెద్ద పెద్ద కనుగుడ్లతో అందవికారంగా, భయానకంగా కనిపిస్తాయి. దీన్ని అపశకున పక్షిగా భావించకుండా లక్ష్మీ దేవి వాహనంగా చెప్పబడుతున్నది. నిశ్శబ్దంగా ఎగిరే స్వభావం కలిగిన ప్రత్యేక పక్షులైన గుడ్లగూబల లేదా ఔల్స్ రెక్కల ఈకలు రేపు పళ్ళ వలె ఉంటాయి. చిమ్మ చీకట్లో కూడా ఎగిరే గుడ్లగూబలు తమ తలను 270 డిగ్రీలు తిప్పగలవు. అంటార్కిటికా మినహా అన్ని ఖండాల అడవులు, ఎడారుల్లో కనిపిస్తున్నాయి. గుడ్లగూబల సమూహాన్ని పార్లమెంట్ అని పిలుస్తారు. ఒక జత గుడ్లగూబలు తమ గూడు కట్టే సమయంలో దాదాపు 3,000 వరకు ఎలుకలను తిని రైతులకు మేలు చేస్తాయి. లోతైన మంచులో కూరుకుపోయిన ఎరను సహితం శబ్దం ద్వారా గుర్తించి పట్టుకోగలవు. గుడ్లగూబల ఈకలు, మచ్చలు చెట్ల బొర్డు రంగులో కలిసిపోయి విశ్రాంతి సమయం లేదా వేటాడే సమయాల్లో సురక్షను పొందుతాయి. నానాటికీ గుడ్లగూబల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా తగ్గిపోవడం ఓ ప్రమాద జీవ వైవిధ్య విఘాత హెచ్చరికగా భావించాలి. ఆవాసాల నష్టాలు, కాలుష్య సమస్యలు, పురుగు మందుల వాడకం, విషాహారాలు, విచక్షణారహిత వేటలతో గుడ్లగూబల జనాభా మూడింట ఒక వంతు క్రమంగా పడిపోయింది. జీవ వైవిధ్య పరిరక్షణలో గుడ్లగూబల ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏటా 04 ఆగస్టు రోజు అంతర్జాతీయ గుడ్లగూబల అవగాహన దినోత్సవం (ఇంటర్నేషనల్ ఔల్ అవేర్‌నెస్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. విషపూరిత ఎలుకల మందుల వాడకాన్ని తగ్గించడం, వాటి ఆవాసానికా వీలుగా చెట్లను రక్షించడం, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కలిపించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలి. ప్రపంచవ్యాప్తంగా 200లకు పైగా గుడ్లగూబల జాతులు ఉన్నాయి. రాత్రిపూట మాత్రమే సంచరించే నిశాచర పక్షులు గుడ్లగూబలు. కొన్ని రకాల గుడ్లగూబలు పగటి పూట కూడా వేటాడగలవు. మాంసాహార పక్షులుగా వేటలో నేర్పరితనం కలిగిన గుడ్లగూబలు చిన్న కీటకాలు, బల్లులు, ఎలుకలు, పీతలు, పురుగులు లాంటి ఆహారాన్ని తింటాయి. గుడ్లగూబలు ఇంటిలోకి వస్తే అదృష్టం, ఐశ్వర్యం కలుగుతాయని నమ్ముతారు. కొన్ని ప్రాంతాల ప్రజలు వీటిని కీడు సంకేతంగా కూడా భావిస్తారు.

**(ఆగస్టు 4 అంతర్జాతీయ గుడ్లగూబల అవగాహన దినోత్సవం)**

# నిమ్స్‌కు మరో ఘనత.. వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

## వైద్య బృందాన్ని అభినందించిన సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిమ్స్ ఆసుపత్రిలో కేవలం రెండున్నరేళ్ల వ్యవధిలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి కావడం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ అరుదైన ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవ రాజ్‌తో పాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందాన్ని సిఎం అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిమ్స్ విజయాలు నిదర్శనమని సిఎం పేర్కొన్నారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయిని అధిగమించిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలను పూర్తి చేసి మరో రికార్డు సృష్టించిందని సిఎం అన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని విజయాలు సాధిస్తూ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డిని బతికున్నప్పుడు నిర్లక్ష్యం చేసి... చనిపోయాక రాజకీయం

## ఉద్యమ నేతలకు పదవులివ్వకుండా అవమానించిన బిఆర్ఎస్

## శవ రాజకీయాలకు దిగజారడం దారుణం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదేండ్లు అధికారంలో ఉండి కూడా తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి కనీస పదవి ఇవ్వకుండా అవమానించిన బిఆర్ఎస్, ఆయన మరణం తర్వాత శవ రాజకీయాలకు దిగజారిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో సంతోష్‌రావు, దామోదర్ రావు వంటి వారికి రాజ్యసభ పదవులు ఇచ్చారని, కానీ పెద్ది సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయనకు రాజ్యసభ కానీ, ఎమ్మెల్సీ పదవి కానీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అస్వస్థతకు గురైన సమయంలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రభుత్వం గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని మంత్రి గుర్తుచేశారు. అంతేకాకుండా ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ నేతకు తగిన గౌరవాన్ని అందించిందన్నారు. ఉద్యమకారులను ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం, అధికారం, కీలక పదవులన్నింటినీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం వారికి వెన్నతో పెట్టిన విద్య అని పొంగులేటి విమర్శించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగిస్తూ నీచానికి దిగజారిన బిఆర్ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మరోసారి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

# యువతపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదు

## నిరుద్యోగుల ఆత్మహత్యలను సైతం హేళన చేసిన నాయకుడు కెటిఆర్ : చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు (కెటిఆర్) యువత విషయంలో మాట్లాడడం విడ్డూరంగా ఉందని, ఆయన 'యూత్ ఫోబియా'తో బాధపడుతున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ పేర్కొన్నారు. నిరుద్యోగుల ఆత్మహత్యలను సైతం హేళన చేసిన నాయకుడు కెటిఆర్ అని విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో యువత, విద్యార్థులు, నిరుద్యోగుల కోసం కెటిఆర్ చేసిన ఒక్క మంచి పని అయినా చెప్పాలని సవాల్ విసిరారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో ప్రజల ముందు చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ కాలంలో నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా, వారి ఆందోళనలను కూడా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గ్రూప్1 అభ్యర్థుల తల్లిదండ్రులు గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకోవాలని, యువత సమస్యలపై మాట్లాడే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని కెటిఆర్‌కు సూచించారు. రిటైర్డ్ ఉద్యోగులతో పాలన సాగించిన బిఆర్ఎస్‌కు భిన్నంగా, కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రజాపాలనకు నిదర్శనంగా నిలిచిందన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## శాఖల వారిగా అధికారులకు సిఎస్ ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిచాలని ఇందుకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతోఉన్నతస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా ఏర్పాట్లపై సిఎస్ సమీక్షించారు. అనంతరం సిఎస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య స్ఫూర్తికి తగిన విధంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ముందుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని సైనిక్ స్మారక్ వద్ద అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తారని, అనంతరం హైదరాబాద్ గోల్కొండ కోటలోని రాణి మహల్ లాన్స్‌లో నిర్వహించే ఈ వేడుకలకు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని సిఎస్ తెలిపారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేదిక ఏర్పాటు, సిట్టింగ్ ఇతర సౌకర్యాలు, అత్యవసర సేవలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. రోడ్లు, భవనాల శాఖ వేదిక నిర్మాణం, స్టేజ్, సిట్టింగ్ ఏర్పాట్లు, బ్యారికేడింగ్, రహదారుల మరమ్మతులు, తదితర మౌలిక సదుపాయాల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టడంతో పాటు విఐపిలు, పాల్గొనేవారి రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిహెచ్‌ఎంసి అధికారులు వేదిక పరిసరాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సుందరీకరణ పనులను పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ తగిన సంఖ్యలో వైద్య బృందాలు, అంబులెన్సులు, ప్రాథమిక చికిత్స కేంద్రాలను వ్యూహాత్మక ప్రాంతాల్లో అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఫైర్ టెండర్లు, అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, వాణి ప్రసాద్, జిఎడి (పొలిటికల్) ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, హోంశాఖ ప్రధాన కార్యదర్శి శిఖా గోయెల్, డిజిపి (శాంతిభద్రతలు) ఎం.మహేష్ భగవత్, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి.ముకుంద రెడ్డి, హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్, అగ్నిమాపక శాఖ డిజి విక్రమ్ సింగ్ మాన్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, తదితరులు పాల్గొన్నారు.

# యువతను కాంగ్రెస్, బిజెపి రెండూ మోసం చేశాయి

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువతను కాంగ్రెస్, బిజెపి రెండూ మోసం చేశాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో యువత నిర్వేదంలో ఉన్నదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఖమ్మం యువకుడు రాసిన సూసైడ్ నోట్ కాంగ్రెస్ ప్రభుత్వానికి చార్జ్ షీట్ లాంటిదన్నారు. ఈ సూసైడ్ నోట్‌లో ఉద్యోగాల భర్తీని, యువకులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, అలాగే గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1 పరీక్ష పేపర్ లీక్ అంశాన్ని కూడా ప్రస్తావించారని కెటిఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు జి.జగదీష్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి కెటిఆర్ మాట్లాడుతూ నిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడవద్దని కెటిఆర్ విజ్ఞప్తి చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒకటి,రెండు తప్పులు జరిగాయని, వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఈసారి యుపిపిఎస్‌సి తరహాలో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కార్యాచరణను తీసుకుంటామని హామీనిచ్చారు. రాష్ట్రంలో నిరుద్యోగులు నిర్వేదంలో ఉన్నారని, డిప్యూటీ సీఎం ఇలాకాలో ఒక యువకుడు లేఖ రాసి ఆత్మహత్యయత్నానికి పాల్పడితే కూడా భట్టి విక్రమార్క స్పందించలేదని, నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని సిఎం కూడా చెప్పకపోవడం అన్యాయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో యువత ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు రాహుల్‌గాంధీ రావడం లేదని, ఇతర రాష్ట్రాలకు వెళ్లి యువత, విద్యార్థుల సమస్యలను ప్రస్తావిస్తున్నారన్నారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలోయువత, విద్యార్థుల సమస్యలు, ఆత్మహత్యలకు పాల్పడుతుంటే రాహుల్‌కు పట్టదా లేదా అని ప్రశ్నించారు. ఇంజనీర్లు క్రిమినల్ వేస్ట్ అని సిఎం రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నప్పటికీ దీనిపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నకల్ కొట్టి పాసైన బాపతేనని, **ఆయన తన ఎన్నికల ఫామ్‌ను నింపుగలుగుతారా? అని ప్రశ్నించారు.**
శాసనసభ సమావేశాలు 15 రోజులు నిర్వహించాలని, నిరుద్యోగుల తరపున అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. చట్ట సభలో పోటీ చేసే వయోపరిమితిని తగ్గించే అంశపైన శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి చేసే తీర్మానం ఒక చిత్తు కాగితంలాంటిదని, దీనివల్ల ఎటువంటి ఉపయోగం ఉండబోదన్నారు. ఈ విషయంలో పార్లమెంట్‌లో తీర్మానం చేస్తేనే ఉపయోగమన్నారు. ముందుగా సిఎం తన చేతిలో ఉన్న అంశాలను అమలు చేయాలని, బిసి శాఖకు నిధులను పెంచాలని, నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోనియాగాంధీ తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టాన్ని సిఎం రేవంత్ రెడ్డి తుంగలో తొక్కుతారాఅని ప్రశ్నించారు. మెట్రోకు చెందిన రూ.200 కోట్లను కొట్టేయడానికి సిఎం రేవంత్, ఆయన సోదరులు స్కెచ్ వేశారని ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులను ప్రభుత్వం వేధింపులకుగురిచేస్తోందని ఆరోపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డిని కూడా వేధించారన్నారు.

# ఇంజినీరింగ్ విద్యార్థులపై సిఎం వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు

## ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ విద్యార్థుల విషయంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను బిఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ విమర్శించారు. ముఖ్యమంత్రి విద్యార్థులను విమర్శించలేదని, ప్రస్తుతం అమలులో ఉన్న ఇంజనీరింగ్ విద్యా విధానంలోని లోపాలను ప్రస్తావిస్తూ విద్యార్థులు నైపుణ్యాలను (స్కిల్స్) పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని మాత్రమే వివరించారని అన్నారు. ముఖ్యమంత్రి చేసిన పూర్తి ప్రసంగాన్ని వినకుండా కెటిఆర్ వ్యాఖ్యలు చేయడం అవివేకమన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక అర్హత కెటిఆర్‌కు లేదని విమర్శించారు. బాధ్యతగల ముఖ్యమంత్రిగా విద్యా వ్యవస్థలో మార్పులు అవసరమని, విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా నైపుణ్యాలను పెంచుకోవాలని సిఎం సూచించారని చెప్పారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు పూర్తిగా విద్యార్థుల శ్రేయస్సు కోసమేనని, వాటిలో ఎక్కడా విద్యార్థులను విమర్శించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. మంచి ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలను కూడా రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటని బల్మూర్ వెంకట్ అన్నారు. రాజకీయ అంశాలపై రాజకీయాలు చేయడం సహజమేనని, అయితే ప్రతి అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం తగదని డాక్టర్ బాల్మూర్ వెంకట్ వ్యాఖ్యానించారు.

# కార్మికుల ఐక్య పోరాట ఫలితమే...

## మణుగూరు పికె బ్లాక్ సింగరేణికి దక్కడం హర్షణీయం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



(ఫైల్ ఫోటో)

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మణుగూరు పికె ఓసి డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించడం ప్రభుత్వంపై తాను చేసి ఒత్తిడి కార్మికుల ఐక్యపోరాటాల ఫలితమే అని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పికెఓసి డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు అప్పగిస్తూ నిర్ణయం జరగడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి పరిరక్షణ సంస్థ మనుగడ కోసం చేపట్టిన వరుస ఆందోళనల వల్లే కేంద్రప్రభుత్వం దిగొచ్చిందని పేర్కొన్నారు. సింగరేణికి దక్కేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలతో పలుమార్లు చర్చలు జరిపినట్లు కూనంనేని వెల్లడించారు. అదేవిధంగా సిపిఐ ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించిన దశలవారీ ఉద్యమాలు, ఆందోళనలు ఈ విజయానికి కీలకపాత్ర పోషించాయని చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునేందుకు కార్మిక లోకం ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి ఆస్తులు, గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు జరిగిన కుట్రలను ఉద్యమ స్ఫూర్తితో తిప్పికొట్టినట్లు స్పష్టం చేశారు. లాభాల బాటలో ఉన్న సింగరేణిని దెబ్బతీసే యత్నాలను ఏ మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఈ విజయాన్ని కొందరు తమ గొప్పగా ప్రచారం చేసుకోవడం తీవ్ర హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు దక్కేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని, సంస్థ ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తామని కూనంనేని పునరుద్ఘాటించారు.

# మేడిగడ్డను కూల్చి... గోదావరిపై రాజకీయాలా ?

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడిగడ్డను కూల్చిన బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు గోదావరిపై రాజకీయాలు చేస్తున్నారని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను శిథిలం చేసిన వారికి ఇప్పుడు సాగునీటిపై ప్రేమ పుట్టినట్లు నటిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. గోదావరి వరదలపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్న బిఆర్ఎస్ నేతలు ముందుగా తమ వైఫల్యాలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గోదావరిలో వరదలు వస్తే ప్రజల కష్టాలపై స్పందించాల్సింది పోయి రాజకీయ లబ్ధి కోసం అబద్ధాల ప్రచారం చేయడం బిఆర్ఎస్ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బిఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మేడిగడ్డ నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయాలని బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలను వక్రీకరించడమేనని, సాగునీటి వ్యవస్థపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారనే విషయాన్ని మరోసారి నిరూపించుకున్నారని విమర్శించారు. గోదావరిలో వరద ప్రవాహం ఉందని చెప్పడం ఒకటి... ఆ నీటినంతా వెంటనే ఎత్తిపోసే అవకాశం ఉందని చెప్పడం మరోటి. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ అనేది రాజకీయ సభల్లో చేసే ప్రకటనలతో కాదు... నీటి మట్టాలు, పంపింగ్ సామర్థ్యం, కాలువల మోయగల సామర్థ్యం, దిగువ జలాశయాల నిల్వలు, విద్యుత్ లభ్యత, ఇంజినీర్ల సాంకేతిక అనుమతులు, భద్రతా ప్రమాణాల ఆధారంగా జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా, శాస్త్రీయంగా సాగునీటి నిర్వహణ కొనసాగిస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

# మోదీ,షాలకు ఇక ఇంటి దారే

## బంకిపూర్ ఉప ఎన్నిక తీర్పు బిజెపి అహంకారానికి గట్టి దెబ్బ

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ''బిహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ఫలితం కేవలం ఒక నియోజకవర్గానికి పరిమితం కాదు. ఇది దేశ రాజకీయాల్లో ఒక కీలక మార్పునకు సంకేతం. కేంద్రంలోనూ, బిహార్‌లోనూ అధికారంలో ఉన్న బిజెపి నియంతృత్వ విధానాలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు'' అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బంకిపూర్ సాధారణ శాసనసభ స్థానం కాదని, బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లడంతో రాజీనామా చేసిన నియోజకవర్గమని, దాదాపు మూడు దశాబ్దాలుగా బిజెపికి కంచుకోటగా ఉన్న ఈ స్థానం ప్రజల తీర్పుతో చేజారడం అధికార అహంకారానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. బంకిపూర్ ఉప ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ అధికార దుర్వినియోగం, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల ఇబ్బందులు, సామాజిక విభజన రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని ప్రజల తీర్పు స్పష్టంగా చెబుతోందన్నారు. ఎంత బలమైన రాజకీయ కోట అయినా ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని బంకింపూర్ మరోసారి నిరూపించిందన్నారు. బిజెపి అగ్ర నాయకత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ స్థానంలో ఎదురైన పరాజయం దేశవ్యాప్తంగా రాజకీయ సందేశాన్ని ఇస్తోందన్నారు. ప్రజల విశ్వాసాన్ని గెలవాలంటే ప్రచారం కాదని, పాలనలో ఫలితాలు చూపాల్సిందేనని ఈ తీర్పు చెబుతోందన్నారు. దేశ ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎదురు చూస్తున్నారని, ప్రజలు కాంగ్రెస్ వైపు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందన్నారు. రానున్న కాలంలో దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ మరింత బలపడుతుందనే విశ్వాసాన్ని ఈ ఫలితం కలిగిస్తోందని ఆయన తెలిపారు. అలాగే మధ్యప్రదేశ్ లో బిజెపి అధికారంలో ఉన్నప్పటికి ఉప ఎన్నికల్లో దతియా అసెంబ్లీ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ దక్కించుకోవడం ప్రజాస్వామిక విజయమన్నారు.

**బంకిపూర్ ఫలితం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం : మంత్రి పొన్నం**

బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో బిజెపి ఓటమి ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనమని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సొంత నియోజకవర్గంగా పేరున్న బంకిపూర్‌లో జన్ సూరజ్ పార్టీ అభ్యర్థి ప్రశాంత్ కిషోర్ విజయం సాధించడం ప్రజల తీర్పుకు నిదర్శనమన్నారు. అధికార బలం, ప్రచార ఆర్భాటం కంటే ప్రజల నిర్ణయమే అంతిమమని ఈ ఫలితం మరోసారి నిరూపించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను విస్మరిస్తే తగిన సమయంలో ప్రజలు సరైన తీర్పు ఇస్తారని వ్యాఖ్యానించారు. బంకిపూర్ ఫలితం దేశ రాజకీయాల్లో మార్పుకు సంకేతమని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ప్రజల సంకల్పానికి ప్రతీకగా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# సింగరేణికి దక్కిన మరో కోల్ బ్లాక్

## పికెఓసి -2 దక్కడంపై హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి సంస్థ ఖాతాలో మరో కీలక విజయం చేరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సమీపంలోని ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్ (పికెఓసి 2) డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే దక్కింది. సోమవారం జరిగిన వేలం ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సమీపంలోని పికెఓసి 2 డిప్‌సైడ్ కోల్‌బ్లాక్ సింగరేణికి దక్కడం హర్షణీయమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సంస్థ అధికారులతో పాటు తెలంగాణ ప్రజలందరికీ ఆయన అభినందనలు తెలిపారు.
ఇటీవలే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల2 బ్లాక్లు సింగరేణి ఖాతాలో చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పికెఓసి2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ నేతల నుంచి డిమాండ్‌లు వచ్చాయి. దీనికి అనుగుణంగా తాను కేంద్రమంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా ప్రత్యేక కృషి చేశానని కిషన్ రెడ్డి తెలిపారు.
ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో వరుసగా మూడు బొగ్గు గనులు దక్కడం శుభపరిణామమని, దీనివల్ల దక్షిణ భారతదేశ అవసరాలకు తగినంత బొగ్గు లభ్యత పెరగడంతో పాటు తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ కల్పనకు మార్గం సుగమమవుతుందన్నారు.

**25 ఏళ్లపాటు కొనసాగనున్న గని :**



దక్షిణ భారతదేశంలో ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా పేరొందిన సింగరేణికి ఈ డిప్‌సైడ్ బ్లాక్ ద్వారా సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు అందుబాటులోకి రానున్నాయి. ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున ఈ గని 25 ఏళ్లపాటు కొనసాగనుంది. దీనివల్ల దాదాపు 2 వేల మందికి ఉపాధి లభించనుంది.

**రెవెన్యూ, ఆదాయంపై అంచనాలు :**

ఇక్కడ లభించే జి8 కేటగిరీ నాణ్యమైన బొగ్గు కారణంగా సింగరేణికి రూ.43 వేల కోట్లకు పైగా రెవెన్యూ సమకూరనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం లభించనుంది. దీనితో తెలంగాణ ఇంధన భద్రతకు మరింత భరోసా చేకూరడంతోపాటు, సంస్థ భవిష్యత్ అభివృద్ధికి అవసరమైన వనరులు అందుబాటులోకి వస్తాయి.

**మూడు బ్లాక్‌లతో మొత్తం చిత్రం ఇలా :**

నైని, తాడిచర్ల2, పికెఓసి 2 డిప్‌సైడ్ బ్లాక్‌లు కలిసి రావడంతో సింగరేణికి మొత్తం 860 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు సమకూరనున్నాయి. వీటి వల్ల 6,500 మందికి జీవనోపాధి లభించనుండగా, సగటున 35 ఏళ్లపాటు ఏటా 22 మిలియన్ టన్నుల చొప్పున ఉత్పత్తి సాధ్యమవుతుంది. ఈ మూడు బ్లాక్‌ల ద్వారా సింగరేణికి రూ.1,95,510 కోట్లకు పైగా రెవెన్యూ రానుండగా, రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు రూ.48 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరనుంది.


GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

| Nit No. | పని పేరు | అంచనా విలువ / ఇసివి | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 07/EE/ Circle-37/kz/ ghmc/2026-27, Dt: 03.08.2026 | 1 Nos., నిర్వహణ పనులు | రూ. 1.55 లక్షలు | 1 పనికి ప్రారంభ తేదీ: 04.08.2026 సా.4:30గం.ల నుండి, ఆఖరి తేదీ: 05.08.2026 సా.4.30గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-37, కె.జెడ్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్. ఫోన్: 9989930414 |
| మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు. | | | | కమిషనర్, జిహెచ్‌ఎంసి |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-37, (కెజెడ్) జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 7260-PP/CL/ADVT/2026-27, Date: 03-08-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

| 'e' Nit No. | పని పేరు | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|
| RFP-02/IT/ GHMC/2026-27, Dt: 01.08.2026 | జిహెచ్‌ఎంసి, సిఎంసి & ఎంఎంసి కోసం ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ మరియు ప్రత్యేకంగా రూపొందించిన అప్లికేషన్ల నిర్వహణ & సహాయం మరియు ఖాతాల నిర్వహణ నిమిత్తం సర్వీస్ ప్రొవైడర్‌ను ఎంపిక చేయడం. | ప్రారంభ తేది: 03.08.2026 మ.11:00గం.లకు, ఆఖరి తేది: 24.08.2026 సా.04.10గం.ల వరకు | అడిషనల్ కమిషనర్ (ఐటి) కార్యాలయం, 3వ అంతస్తు, సిసి కాంప్లెక్స్ బిల్డింగ్, జిహెచ్‌ఎంసి, లిబర్టీ సర్కిల్, హైదరాబాద్ - 500063. ఫోన్: 9963551523/ 7995009124. deeit-ghmc@gov.in |

సం/- అడిషనల్ కమిషనర్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 7218-PP/CL/ADVT/2026-27, Date: 03-08-2026

తెలంగాణ ప్రభుత్వం
ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, రామగుండం, పెద్దపల్లి జిల్లా.
R.C. No: Stores/GGH/RGM/01/2026 పత్రికా ప్రకటన తేది: 31.07.2026
ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ రామగుండము, పెద్దపల్లి జిల్లా నందు టెండర్ పద్ధతిలో వైద్య పరికరాలు సరఫరా చేయుటకు సంబంధించిన అర్హత గల దుకాణదారుల నుండి టెండర్ దరఖాస్తులు కోరడమైనది. టెండర్ ఫారములు తేది: 04.08.2026 నుండి 10.08.2026 వరకు లభించును. టెండర్ ఫారం ధర ఒక్కొక్కటి రూ.10,000/- (డి.డి.) మరియు EMD రూ.50,000/- (డి.డి.)ను Medical Superintendent, Government General Hospital, Ramagundam పేరున చెల్లించవలెను. టెండర్లు 04.08.2026 న ఉదయం 11.00 గంటల నుండి 14.08.2026 సాయంత్రం 4.00 గంటల వరకు స్వయంగా మెడికల్ సూపరింటెండెంట్, రామగుండం వారి కార్యాలయంలో సమర్పించవలెను. టెండర్ ఫారములు 14.08.2026 రోజున మధ్యాహ్నం 5.00 గంటలకు కలెక్టర్ కార్యాలయం పెద్దపల్లిలో కలెక్టర్ గారి ఆధ్వర్యంలో నందు అభ్యర్థుల సమక్షంలో తెరవబడును. కావున ఇట్టి ప్రకటనను ఏదైనా ఒక దినపత్రికలో ప్రచురించవలసిందిగా తమరిని కోరడమైనది.
*దీనికి సంబంధించిన వివరములు జతపరచడమైనది.*
సం/- మెడికల్ సూపరింటెండెంట్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, రామగుండం
DIPR R.O. No. : 7252-PP/CL/ADVT/2026-27, Date: 03-08-2026

## 6 నుంచి డిగ్రీ స్పెషల్ డ్రైవ్ ప్రవేశాలు

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ ఫైనల్ ఫేజ్ స్పెషల్ డ్రైవ్ అడ్మిషన్ల ప్రక్రియ 6వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. దోస్త్ ద్వారా ఇప్పటివరకు నాలుగు విడతల అడ్మిషన్లు పూర్తయ్యాయని, విద్యార్థుల అభ్యర్థన మేరకు ప్రత్యేక విడతను చేపడుతున్నామని వివరించారు. 6 నుంచి 11వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు, 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల గడువు ఉంటుందని పేర్కొన్నారు. 14న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ అందుబాటులో ఉందన్నారు. కళాశాలలో ఉద్యోగ గ్యారంటీతో కూడిన ఐదు ఎఇడిపి కోర్సులతో పాటు బిఎ, బికాం, బిఎస్‌సి కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎఇడిపి కోర్సుల్లో చేరే వారికి చివరి ఏడాది స్టైఫండ్‌తో కూడిన శిక్షణ ఇస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వసతిగృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/నిజామాబాద్ : సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ భుజంగరావు స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం అన్ని శాఖల ప్రభుత్వం విద్యా సంస్థల అధికారులు, నిర్వాహకులు, కాంట్రాక్ట్ ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష జరిపారు. ఇటీవల పలు హాస్టళ్లు, గురుకులాలను క్షేత్రస్థాయిలో సందర్శించిన సమయంలో నిర్వహణపరమైన లోపాలు తన దృష్టికి వచ్చాయని, తక్షణమే వాటిని సరిదిద్దుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం నిర్ధేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు డైట్ సమకూర్చాలని సూచించారు. కాంట్రాక్ట్ ఏజెన్సీలు నాణ్యమైన తాజా కూరగాయలు, పండ్లు మాంసాహారం సరఫరా చేసేలా నిశిత పర్యవేక్షణ జరపాలని ఒకవేళ ఎవరనా నాసిరకం వస్తువులు, చికెన్ మటన్ వంటివి సరఫరా చేస్తే వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు పౌష్టికాహారమందించే విషయంలో అలసత్వం వహిస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని, నిబంధనలు పాటించని కాంట్రాక్ట్ ఏజెన్సీని రద్దు చేసి కొత్తవారికి బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని, సానిటేషన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని హాస్టళ్లు, గురుకులాల నిర్వాహకులకు హితవు పలికారు. మండల ప్రత్యేకాధికారులు ఆర్‌సీఓలు క్రమం తప్పకుండా విద్యా సంస్థలను సందర్శిస్తూ నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో ట్రేనీ కలెక్టర్ సురేష్, డీఈఓ అశోక్ అధికారులు పాల్గొన్నారు.

## నిర్మల్ టౌన్ ఠాణా ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** బాధితులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందిస్తూ ప్రజలకు పోలీసు శాఖపై మరింత నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని నిర్మల్ జిల్లా ఎస్‌పి డా. జి. జానకి షర్మిల సూచించారు. సోమవారం ఆమె నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో పాటు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. ముందుగా నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి, స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, రికార్డు రూమ్‌లను పరిశీలించారు.అనంతరం వేర్వేరు రిజిస్టర్లను తనిఖీ చేసి, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కార తీరుపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో శాంతిభద్రతల రక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నేరాల నివారణకు పెట్రోలింగ్‌ను పటిష్టం చేయడంతో పాటు మహిళలు,చిన్నారులు, వృద్ధుల భద్రతకు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా మిత్ర పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో నిర్మల్ డిఎస్‌పి శ్రీనివాస్, టౌన్ సీఐ సమ్మయ్య, ఎస్‌ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ‘బివిఆర్ఐటి’లో ఘనంగా 30వ ఇండక్షన్ డే వేడుకలు

సాంకేతికతను అభ్యాసానికి తోడ్పడే సాధనంగా ఉపయోగించుకోవాలి

విష్ణు విద్యా సంస్థల చైర్మన్ విష్ణు రాజు




**ప్రజాపక్షం/నర్సాపూర్:** విద్యార్థులు సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని విష్ణు విద్యాసంస్థల చైర్మన్ విష్ణు రాజు అన్నారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు నిర్వహించిన 30వ ఇండక్షన్ డే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విష్ణు విద్యా సంస్థల చైర్మన్ విష్ణు రాజు హాజరై విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. సాంకేతికతను అభ్యాసానికి తోడ్పడే సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. నకిలీ వార్తలను నమ్మడం వాటిని ప్రచారం చేయడం సమాజానికి హానికరమని హెచ్చరించారు. బహుముఖ నైపుణ్యాలను పెంపొందించుకొని పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. బివిఆర్ఐటి లో చేరిన వివిధ విభాగాల విద్యార్థులను అభినందిస్తూ వారికి ప్రోత్సాహకంగా ఉత్తమ పుస్తకాలను బహుకరించారు. వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తరగతి గదిలో నేర్చుకున్న విజ్ఞానాన్ని ప్రాజెక్టులు పరిశ్రమల అనుభవంతో అనుసంధానం చేసుకోవాలని పరిశ్రమలు పూర్వ విద్యార్థులు సీనియర్లతో వృత్తిపరమైన సంబంధాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ సంజయ్ దుబే మాట్లాడుతూ, అత్యుత్తమ ప్లేస్మెంట్ ఉన్నత విద్య, పరిశోధన వ్యవస్థాపకత, సామాజిక బాధ్యత వంటి రంగాలలో బివిఆర్ఐటి విశిష్ట గుర్తింపు సాధించిందన్నారు. అయితే కళాశాలలో నూతనంగా చేరిన జూనియర్ విద్యార్థులను, సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రథమ సంవత్సరం విభాగాధిపతి మృలాలిని శశాంక, కళాశాల డిప్యూటీ జనరల్ మేనేజర్ కాంతారావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్, కళాశాలలో చేరిన నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శాశ్వత భవనాల కోసం ఎదురుచూపు

అద్దె భవనాల్లోనే బిసి గురుకులాలు

జూనియర్, డిగ్రీ కళాశాలలు

నాలుగు వేల మందికి పైగా

విద్యార్థులపై ప్రభావం



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఏడు గురుకుల పాఠశాలలు, ఏడు జూనియర్ కళాశాలలు, ఒక డిగ్రీ కళాశాలకు ఇప్పటికీ శాశ్వత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే విద్యాబోధన కొనసాగుతోంది. సుమారు నాలుగు వేల మందికిపైగా విద్యార్థులు ఈ విద్యాసంస్థల్లో చదువుకుంటున్నప్పటికీ, వారికి శాశ్వత మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.ముధోల్ బాలికల కళాశాల, జంగం (కుబీర్) బాలుర కళాశాల, సారంగాపూర్ బాలికల కళాశాల,నిర్మల్ బాలుర కళాశాల,లక్ష్మణచంద మండలం రాచాపూర్‌కు మంజూరైన కళాశాల ప్రస్తుతం మామడలో,ఖానాపూర్ బాలికల,బాలుర కళాశాలలు,చించోలి ఎక్స్‌రోడ్డు వద్ద డిగ్రీ కళాశాలతో పాటు జిల్లాలోని పలు బీసీ విద్యాసంస్థలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక వసతుల కొరత విద్యార్థులపై ప్రభావం చూపుతోందని తెలుస్తోంది. జిల్లాలో ఈ విద్యాసంస్థలకు ఇప్పటివరకు శా శ్వత భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ కూడా పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో శాశ్వత భవనాల నిర్మాణంపై హామీ లు ఇచ్చినప్పటికీ అవి అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా భవనాల నిర్మాణానికి సంబంధించి స్పష్టమైన పురోగతి కనిపించకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశాభంగానికి గురవుతున్నారు. జిల్లాలో బిసి జనాభా అధికంగా ఉండటంతో ఈ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం ప్రవేశాలు పెరుగుతున్నాయి. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో జాప్యం కొనసాగుతోంది. శాశ్వత భవనాలు అందుబాటులోకి వస్తే విద్యాప్రమాణాలు మెరుగుపడటంతో పాటు విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో చదువుకునే అవకాశం కలుగుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం తక్షణమే స్థల సేకరణ పూర్తి చేసి, నిధులు మంజూరు చేయాలని జిల్లాలో పలువురు కోరుతున్నారు.

**బిసి విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్యం: చంద్రశేఖర్**

బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలకు శాశ్వత భవనాలు లేకపోవడం దురదృష్టకరమని బిసి సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఏంబడి చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్రంలో బిసి జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో నిర్మల్ ఒకటైనా, ఇక్కడి బిసి విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.గత ప్రభుత్వం భవనాల నిర్మాణానికి హామీ ఇచ్చి అమలు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇప్పటివరకు కనీసం స్థల సేకరణ చేపట్టకపోవడం బాధాకరమన్నారు. బిసి గురుకులాలు, కళాశాలలు, వసతి గృహాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి, స్థల సేకరణ పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కో రారు.

## అందోల్ నియోజకవర్గంలో 99 శాతం ‘సర్’ ప్రక్రియ పూర్తి

మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఎస్ఐఆర్ విజయవంతం కావడానికి కృషి చేసిన బిఎల్‌ఎలకు మంత్రి ప్రశంసలు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంపై అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి, రాయికోడ్ , అందోల్, పుల్కల్, చౌటకూర్, రేగోడ్, వట్పల్లి, అల్లాదుర్గ్ బిఎల్‌ఎలు, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో సంగారెడ్డిలోని తన నివాసంలో సమావేశం నిర్వహించారు. అ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో బిఎల్‌ఎలు ఎంతో కష్టపడి 99 శాతం విజయవంతం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు బూతుల వారీగా నమోదు కాని ఓటర్ల వివరాలు వెంటనే సేకరించి 100 శాతం ఎస్ఐఆర్‌ను నియోజకవర్గంలో పూర్తి చేయాలని బిఎల్‌ఎలను మంత్రి దామోదర్ రాజనర్సింహ కోరారు. ఓటర్‌ల ఎన్యూమరేషన్ పారాలను ఓటర్ లను అందించి ఓటు నమోదు కు అవసరమైన అవగాహనను ఓటర్లకు కల్పించేలా బిఎల్‌ఏలు కృషి చేయాలన్నారు. ఓటర్లతో సమన్వయం చేసుకుని గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసి ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ కోసం బూత్ లెవల్ అధికారులు బిఎల్ఒలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి డాక్టర్స్ సెల్ చైర్మన్ డా.రాజీవ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణారెడ్డి , వైస్ చైర్మన్ చిట్టిబాబు, అందోల్ నియోజకవర్గం లోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీస్, బాలాజీ నరసింహులు ,దుర్గారెడ్డి, దశరథ్, రమేష్ జ్యోషి, శివరాజ్, శివారెడ్డి, దిగంబర్‌రావు, రమేష్, మాజీ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్స్ ఇతర ప్రజాప్రతినిధులు, స ర్పంచ్ ముఖ్యనాయకులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలు సాగు చేయాలి

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాపక్షం/హాజీపూర్ :** ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సూచించారు. హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామంలో సోమవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కెజిబివి, ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ప్రపంచ వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను సందర్శించి విత్తనాల నాణ్యత, దిగుబడి వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్రోన్ ద్వారా నానో యూరియా స్ప్రేయింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బాణేష్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రసాభాసాగా జనరల్ బాడీ మీటింగ్



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆధ్వర్యంలో మండల అధికారుల సమక్షంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రావడంలేదని, సకాలంలో బిల్లులు వచ్చేలా అధికారులు చూడాలని ఎమ్మెల్యేకు, అధికారులకు తెలిపారు. అలాగే సమావేశానికి వైద్య సిబ్బంది మరియు ఆర్ అండ్ బి తదితర అధికారులు రాకపోవడంతో సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తప్పనిసరిగా ఉండాలని తమ సమస్యలు చెప్పుకునేది ఎలా అని కోరారు. అలాగే మండలంలో ఉన్న పలు సమస్యల గురించి ఎమ్మెల్యేకు మరియు అధికారులకు తెలిపారు. అలాగే లేబర్ ఆఫీసర్ సమావేశంలో మాట్లాడుతూ కార్మికులు మీసేవ ద్వారా లేబర్ ఐడి కార్డు అప్లై చేసుకోవాలని చేసుకున్న వారికి పెళ్లికి రూ.30,000, అవసరానికి రూ.30,000 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడి నాగవర్ధన్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ దయానంద్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఓ సా లమన్ రాజ్, ఎస్ఐ ప్రదీప్, పిఏసిఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, ఆయాగ్రామల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## ఇందన్‌పల్లి ఘటనపై ఆదివాసీల నిరసన



**ప్రజాపక్షం/జన్నారం :** ఇందన్‌పల్లిలో గిరిజనులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయక్ పోడ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న, రాష్ట్ర కార్యదర్శి తత్ర భీమ్రావు డిమాండ్ చేశారు. ఆదివారం నాటి ఘటనకు నిరసనగా సోమవారం మధ్యాహ్నం జన్నారం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. గిరిజనులపై దాడికి పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాలని, ఇందన్‌పల్లి ఎఫ్ఆర్ఓ, డిఆర్ఓలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అనంతరం జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు తత్ర అర్జున్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి జైక శేఖర్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం జంగు, పివిజిటి ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కుడిమెత తిరుపతి, రాష్ట్ర నాయకుడు కొమ్ముల బాపు, 9 తెగల ఆదివాసీ సంఘాల జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు

అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

కలెక్టర్ ప్రతీక్ జైన్




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సంబందించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. వేదిక, అతిథులు, సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్యసదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాల్లో ఏలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబందిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారికి కలెక్టర్ ఆదేశించారు. ప్రొటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజా ప్రతినిధులు , విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావనను పెంపొందించేలా విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ సంబందిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశంసా పత్రాల బహుకరణ కోసం శాఖల ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు , సంగీత, పాండు ,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ,రెవెన్యూ డివిజనల్ అధికారులు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కారం: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి,తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులంతా తప్పనిసరిగా ప్రభుత్వ విద్యాసంస్థలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలని చెప్పారు. తనిఖీ వివరాల నివేదికలు సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్,డిఆర్ఓ రాథోడ్ రమేష్,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదం

విద్యార్థులతో వెళ్తున్న ఆటోను ఢీకొట్టిన లారీ

14మందికి గాయాలు...8 మందికి సీరియస్

సూపరిండెంట్ గైర్హాజరుపై స్థానికుల ఆగ్రహం



**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44 వై జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం సంభవించింది. రామాయంపేట మున్సిపాలిటి పరిధిలోని కోమటిపల్లిలో గల తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు పాఠశాల ముగించుకొని ఉపాధ్యాయులతో కలిసి ఇంటికి ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో వై జంక్షన్ వద్దకు రాగానే ఆటోను వెనుక నుండి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో 11 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు ఆటో డ్రైవర్ గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. తీవ్రంగా గాయపడ్డ ఆరుగురు విద్యార్థులు శివచరణ్, ముకేష్‌గౌడ్, లావణ్య, శ్రీతిక, దీక్షిత, శ్రావణ్‌బాబు, ఇద్దరు ఉపాధ్యాయులు మంజుల, జ్యోతిలను మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట, కామారెడ్డి తరలించారు. అభిరాం, విశాల్, నవీన్, రక్షిత, రిషికేష్, అభిజ్ఞలు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదవార్త తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు ఆసుపత్రికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఆందోళనకర వాతావరణం నెలకొంది. సిఐ సైదా, ఎస్ఐ బాల్‌రాజు, తహసీల్దార్ రజనీకుమారి ఆసుపత్రికి చేరుకొని గాయపడ్డ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అయితే ఇంత పెద్ద ప్రమాదం జరిగి ఆసుపత్రికి చేరిన అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వఆసుపత్రి సూపరింటెండెంట్ విధుల్లో లేకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలను సమన్వయం చేయాల్సిన అధికారి అందుబాటులో లేకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. గతంలో ప్రమాదాలు జరిగిన సమయంలో కూడా విధులకు రాలేదని, సూపరిండెంట్ ఎప్పుడు అందుబాటులో ఉండరని స్థానికులు ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా విధులకు రాని సూపరింటెండెంట్‌పై ఉన్నతాదికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులు నిజాంపేట మండలం నస్కల్, నగరం గ్రామాలకు చెందిన వారిగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంతర్జాతీయ నేరస్థుల ముఠా అరెస్ట్

రూ. 8 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



**ప్రజాపక్షం/మావల:** మావల పోలీస్ స్టేషన్ పరిధిలో కైలాస్‌నగర్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించి అంతర్జాతీయ, అంతరాష్ట్ర నేరాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేశారు. ఇద్దరు బంగ్లాదేశీయులు, ఒక భారతీయుడిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వివరాలు వెల్లడించారు. బంగ్లాదేశ్‌కు చెందిన మొహమ్మద్ జౌనీ అలీ, మొహమ్మద్ రుమాన్ అలీలతో పాటు మధ్య ప్రదేశ్‌కు చెందిన తరుణ్‌సింగ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడు జౌనీ అలీ గత 9 ఏళ్లుగా అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తూ పలు రాష్ట్రాల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలు, బైక్ చోరీలకు పాల్పడుతున్నాడని చెప్పారు. నిందితుల వద్ద నుంచి రూ. 8 లక్షల విలువైన 73.05 గ్రాముల బంగారం, 151.30 గ్రాముల వెండి, 5 ఐఫోన్లు, ఐప్యాడ్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించిన మావల సీఐ ప్రేమ్‌కుమార్, సైబర్ క్రైమ్ ఎస్సై గోపికృష్ణ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్పీ జీవన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో బోథ్ మండలం మందబొగుడ గ్రామానికి చెందిన 15 మంది గ్రామస్తులు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతోనే పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామన్‌డైట్ మెనూ పాటించి, వంటకాలు రుచికరంగా వండాలి



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: ప్రభుత్వ గురుకులాల్లో కామన్‌డైట్ మెనూ పాటించాలని, అలాగే వండిన ప్రతి వంటకం రుచికరంగా వండాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె హైమవతి అధికారులను అదేశించారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని రంగధాంపల్లి శివారులోని తెలంగాణ అల్పసంఖ్యాకుల బాలికల పాఠశాల,జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ హైమవతి సోమవారం అకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అన్నం,ఆలుగడ్డ,టమాట,పప్పు,రసం,పెరుగుల నాణ్యతను పరీక్షించి,పప్పు పలుచగా ఉందని అసహనం వ్యక్తం చేస్తూ,మరొకసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని,ప్రతి వంటకం నాణ్యతగా రుచికరంగా ఉండాలని వంట సిబ్బందిని హెచ్చరించారు. కామన్‌డైట్ మెనూలో భాగంగా పిల్లలకు గుడ్డు ఎందుకు పెట్టలేదని ఆరా తీయగా రోజూ సాయంత్ర భోజనంలో పెడతామని ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు తెలపగా,సాయంత్రం మెనూలో గుడ్డు,నెయ్యితో భోజనం పెట్టాలని,కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని,ప్రతిరోజు విద్యార్థుల హాజరు ప్రకారం ఫుడ్ కమిటీ సమక్షంలో సరుకులు అంది స్తూ,విద్యార్థులకు సరిపోయేలా వండాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

## ఒకే ఒక్క తరగతి గది... ముగ్గురే ఉపాధ్యాయులు...

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అత్యవసరంగా అదనపు తరగతి గదిని మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ మామిండ్ల కిషన్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌కు రెండోసారి వినతిపత్రం సమర్పించారు. గతంలో కూడా 2026 జూలై 13న నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇదే సమస్యపై వినతిపత్రం అందించినప్పటికీ, ఇప్పటి వరకు అదనపు తరగతి గది మంజూరు కాకపోవడంతో, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తరగతి గదులను పెంచాలన్నారు. అగ్రహారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న ఒక తరగతి గదిని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇటీవల తొలగించారు. దీంతో ప్రస్తుతం పాఠశాలలో ఒకే ఒక్క తరగతి గది మాత్రమే మిగిలి ఉండగా, అదే గదిలో 34 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. యూకేజీ నుండి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఒకే గదిలో ముగ్గురే ఉపాధ్యాయులు బోధనలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. తరగతుల నిర్వహణకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పాటు విద్యార్థుల అభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడుతోందని సర్పంచ్ వినతి పత్రంలో వివరించారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే అదనపు తరగతి గదిని మంజూరు చేసి, నిర్మాణానికి అవసరమైన పరిపాలనా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

## పిఇటి ఉపాధ్యాయుల ట్రైనింగ్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు

ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం సి. పి ఆదేశాల మేరకు,షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ ఐ లావణ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి షీ టీమ్ వారు జిల్లా పరిషత్ హై స్కూల్ రామగుండము లో జరిగే పి ఇ టి ఉపాధ్యాయుల ట్రైనింగ్ లో భాగంగా షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.అందులో భాగంగా షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఎలా ఉండాలి, పోక్సో యాక్ట్ గురించి,సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది,విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు.మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు.ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని,ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు.ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే,బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని,అలాగే ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ,మహిళలకు ప్రయాణ సమయం లో ట్రావెలింగ్ సేఫ్టీ అప్ 'టి సేఫ్ ఆప్ 'వాడాలని తెలిపారు.ఉపాధ్యాయులు,షీటీమ్‌సభ్యులు, సురేష్,మౌనిక పాల్గొన్నారు.

## మిట్టపల్లిలో మద్యపానం నిషేధం

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో మద్యం అమ్మరాదని,అమ్మితే 10వేల రూపాయల జరిమానా వసూలు చేయబడుతుందని,ఎవరైనా అమ్ముతునట్లు సమాచారం అందిస్తే 5వేల రూపాయల నజరానా అందించబడుతుందని గ్రామసభలో తీర్మానించినట్లు సర్పంచ్ చింతల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సిద్దిపేట అర్బన్‌మండలంలోని మిట్టపల్లి గ్రామంలో సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు హాజరైన వార్డు సభ్యులు,మహిళలు,గ్రామ పెద్దలు,ప్రతినిధులు కలిసి గ్రామంలో మద్యం అమ్మడం వలన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురైతున్నాయని,గ్రామంలో బెల్ట్‌షాపులు లేకుండా చేయాలని గ్రామస్తులంతా ఏకాభిప్రాయంతో గ్రామంలో మద్యం అమ్మవద్దని తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలోని యువత చెడు వ్యసనాలకు గురికాకుండా కాపాడడం మన అందరి బాధ్యత అని,గ్రామంలో మద్యం అమ్మితే జరిమానాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ వాణికిషన్,వార్డు సభ్యులు,గ్రామ అధికారులు,మహిళలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ పరిస్థితులపై అవగాహన సదస్సు



ప్రజాపక్షం / కొత్తపల్లి : వాతావరణ పరిస్థితులపై అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, ఆరెపల్లి, బహుదూర్ ఖాన్‌పేట, ఇరుకుల్ల గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ఎల్‌నినో పై అవగాహన కల్పించారు. బిందు సేద్యం, తుంపర సేద్యం రాయితిలో ధరఖాస్తు చేసుకొని ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు.ఎంపిడివో అశోక్, తహసీల్దార్ నర్సింహారావు, విఎస్ భారతి, ఆర్ఐ వాస్తవిక్, జిపిఓ అరవింద్, కార్పోరేటర్లు మ్యాకల వెంకటేశ్, బారి జితేంద, సర్పంచులు గుర్రం సంధ్య, బుర్ర రమేశ్, ఉప సర్పంచ్ రాకేశ్, ఎఓ సత్యం, కార్యదర్శి శ్రావణి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, వ్యవసాయ విస్తరణ అధికారి సంపత్, స్వర్ణలత, బిటిఎం శ్రీలత, మహేందర్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి

### రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/మంథని: కరీంనగర్ మంథని పట్టణంలో నిర్మాణంలో ఉన్న సమీకృత ఆర్డీవో కార్యాలయం, 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించారు.నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, పనులను నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా మంథని పట్టణంలోని బొక్కలవాగు చెక్‌డ్యాం ఆధునికరణ,కట్ట పై సుందరీకరణ పనులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు.కోకాకోలా కంపెనీ సీఎస్ఆర్ నిధుల కింద రూ.2 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.చెక్‌డ్యాంలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు,కట్టపై వాక్‌వే, చిన్నారుల పార్క్, పచ్చదనం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.మంథని పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.కోకాకోలా కంపెనీ తో యువతకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ శివారులో ప్రతిపాదిత కోకాకోలా ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించిన సుమారు 250 ఎకరాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,కోకాకోలా సంస్థ ప్రతినిధులతో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పరిశీలించారు.ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదించిన భూమి,రహదారులు,విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల పై అధికారులు మంత్రికి వివరాలు అందించారు.ఈ సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు స్థానిక యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన అన్ని అంశాలను పరిశీలించి,నిబంధనలకు అనుగుణంగా తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.కోకాకోలా ఫ్యాక్టరీ ఏర్పాటుతో పెద్దపల్లి జిల్లాలో పారిశ్రామిక రంగానికి మరింత ఊతం లభించడంతో పాటు స్థానికంగా ఉపాధి,ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని శ్రీధర్ బాబు అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు,ప్రజాప్రతిథులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితమే వరద కాలువలోకి గోదావరి జలాలు

### ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



ప్రజాపక్షం /మెట్‌పల్లి : కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్ మీదుగా వరద కాలువలోకి గోదావరి జలాలు చేరుతున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. ఇది మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దూరదృష్టితో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితమేనని ఆయన పేర్కొన్నారు.గత రెండు రోజులుగా సుమారు అర టిఎంసి నీటిని వరద కాలువలోకి విడుదల చేసినట్లు తెలిపారు. దీంతో వరద కాలువ ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి రైతులకు మేలు జరుగుతుందని అన్నారు.తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీరు అందించాలనే లక్ష్యంతో కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, నేడు ఆ ప్రాజెక్టు ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.జగిత్యాల,కోరుట్ల,మెట్‌పల్లి ప్రాంతాలతో పాటు వరద కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులకు ఈ నీటి విడుదల ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల ఫలితాలు భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడతాయని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు.అనంతరం పంప్ హౌస్ వద్ద మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు కార్యకర్తలు,రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

### ప్లాస్టిక్ నిషేధించాలని విద్యార్థుల భారీ ర్యాలీ



ప్రజాపక్షం / గజ్వేల్: భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యం కావాలని, ఇందుకోసం ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించగా, ఆమె ముఖ్య అతిథిగా హాజరై కమిషనర్ గణేష్ రెడ్డి, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, సెంటిమేరిస్ పాఠశాల బాధ్యులు ఇన్నారెడ్డితో కలిసి ప్రసంగించారు. విద్యార్థి దశ నుండే చైతన్యం చేస్తే సత్ఫలితాలు వస్తాయని, ప్లాస్టిక్ రహిత వారోత్సవాల సందర్భంగా సెయింట్ మేరీస్ విద్యార్థులు, రోటరీ క్లబ్ ముందుకు రావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. భూకాలుష్యానికి ముప్పుగా మారిన ప్లాస్టిక్ కు దూరంగా ఉండాలని, నిత్యజీవితంలో వినియోగించే కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, స్ట్రాలు, బాటిల్స్ పడేస్తుండడంతో భూమిలో 500 ఏండ్ల కుళ్లిపోకుండా ఉండి దాని ప్రభావం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.భావితరాలకు నాణ్యమైన, శుభ్రమైన భూమి, నీరు, గాలి ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్లాస్టిక్ నిషేధ ఉద్యమం నిర్వహిద్దామని అన్నారు. కాగా కమిషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 50 మైక్రాన్ కంటే తక్కువ ఉన్న కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు పూర్తిగా నిషేధమని తెలిపారు. పాఠశాల బాధ్యులు ఇన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులే ప్లాస్టిక్ నిషేధానికి సైనికులనీ, పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధిత వారోత్సవాలను నిర్వహించి పట్టణ వాసులకు ప్లాస్టిక్ పై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఇంట్లో, స్కూల్లో గుడ్డ సంచులు స్టీల్ బాటిల్ వాడాలని, విద్యార్థులు, పౌరులుగా మనం పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించగా, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాయప్ప, రోటరీ క్లబ్ అధ్యక్షులు సాయి రెడ్డి, కరుణాకర్ రెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి విధానాలు ఎండగట్టేందుకే ప్రచార యాత్ర

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్




ప్రజాపక్షం/కరీంనగర్: కేంద్రంలో అధికారం చలాయిస్తున్న బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని జిల్లా వ్యాప్తంగా ఈనెల 6వ తేదీ నుండి 14వ తేదీ వరకు ప్రచార యాత్ర కొనసాగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శుల సంయుక్త సమావేశం బండ రాజిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభు త్వం అధికారంలో ఉన్న దశాబ్ద కాలంగా దేశవ్యాప్తం గా తీవ్రమైన ఆందోళనలు నిరాశ నిస్పృహలు పెరిగిపో యి ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని, ఎన్నికల సందర్భంగా దేశ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందారని, బిజెపి ప్రభు త్వ వైఫల్యంలో అతి పెద్దది నిరుద్యోగమని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లో పూర్తిగా విఫలం చెందారన్నారు. సామాన్య పేద మ ధ్య తరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను దెబ్బతీసే విధంగా నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోలు,డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచిందని, ధరల పెరుగుదలను నియంత్రించలేని మోదీ ప్రభుత్వంపై ప్ర జల్లో వ్యతిరేకత ఉందన్నారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వ పాలనను నిరసిస్తూ బద్లావ్ జరూరీ హై – మార్పు కావాలని సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు ఆగస్టు 6వ తేదీ నుండి 14వ తేదీ వరకు జిల్లాలో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని దానిని జయప్రదం చేయాలని సిపిఐ శ్రేణులకు శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ సమావేశములో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి,పిట్టల సమ్మయ్య మండల కార్యదర్శులు బండ రాజిరెడ్డి,గోవిందుల రవి, చొక్కల్ల శ్రీశైలం,లంకదాసరి కల్యాణ్,ఎస్. కే .మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

### హుజురాబాద్ ఎసిపి మాధవి



ప్రజాపక్షం / జమ్మికుంట: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని వారి సహకారంతో అది సాధ్యపడుతుందని హుజురాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. సోమవారం మండలంలోని వావిలాల, గండ్రపల్లి, విలాసాగర్ గ్రామాల్లో ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో జమ్మికుంట సిఐ రామకృష్ణ నేతృత్వంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలతో నేరుగా సమావేశమైన పోలీసులు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే సరైన రిజిష్ట్రేషన్, సంబంధిత ధృవపత్రాలు, వాహన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. వాహనాల యజమానులు తగిన పత్రాలు సమర్పించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా, చోరీలు, గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. అనుమానస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని పోలీస్‌ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం చేసేందుకు ఇటువంటి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, యువకులు, గ్రామస్థులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సత్వరమే అర్జీల పరిష్కారం

### అదనపు కలెక్టర్ శ్రీరాములు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని,ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం గౌ రెడ్డి పేట గ్రామానికి చెందిన పద్మ తన భూమిలో కార్పొరేషన్ బోరింగ్ మంజూరు అయిందని,తనకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి విద్యుత్తులైన మోటర్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా హార్టికల్చర్ అధికారికి రాస్తూ సోలార్ పంప్ సెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. మంథని కు చెందిన ఆకుల సౌమ్య పట్టణంలోని పదవ వార్డు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్ట్ తనకు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికు రాస్తూ పరిశీలించి అవకాశం మేర కు చర్యలు తీసుకోవాలని అదనపు తెలిపారు. పెద్దపల్లి మండలం రంగంపల్లికి చెందిన ఎం.జయశ్రీ తను బీఎస్సీ నర్సింగ్ లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసానని, తనకు ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న మెడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టు భర్తీ చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కు రా స్తూ పరిశీలించి అవకాశం మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ బి. ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

## నిధుల కొరతతో... పనుల్లో జాప్యం



ప్రజాపక్షం/కోరుట్ల : కోరుట్ల నియోజకవర్గంలోని కోరుట్ల సంఘం వాగు వంతెన అర్థాంతరంగా నిలిచిపోయింది. ఏళ్లు గడుస్తున్న వంతెన పనులు మాత్రం ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లుగా ఉంది. నాయకత్వం మారుతున్న ప్రజల సమస్యలు పట్టించుకునే నాధుడే కరువయ్యారు. విమర్శలు చేయడం కాదు సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ వంతెనకు శంకుస్థాపన చేయడం జరిగింది. స్వరాష్ట్రంలో కోరుట్ల నియోజకవర్గం నుండి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఈ వంతెనకు శ్రీకారం చుట్టడం జరిగింది. వారి హయాంలోనే పూర్తి కావలసిన వంతెన ఇప్పటికీ అలానే ఉంది. వారి తనయుడు ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎన్నికైన తర్వాత అయినా ఈ బ్రిడ్జ్ వంతెన పూర్తి అవుతుందని ప్రజలు ఆశించడం జరిగింది. ఉన్నత అధికారులు ఈవంతెనకు సమీక్ష నిర్వహించి బిల్లులు వెంటనే విడుదల చేసి వంతెనను పూర్తి చేయాలని కోరుట్ల నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

**నిధులు రాక పనులు నిలిచి:** అర్థాంతరంగా నిలిచిపోయిన పనులను సకాలంలో బిల్లులు అందకపోవడంతో పనులు నిలిచిపోయాయని వాదనలు వినిపిస్తున్నాయి. కోరుట్ల నియోజకవర్గంలో బి.ఆర్.ఎస్. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తుండడం ఇందుకు కారణమా? లేక నిధులు సమకూర్చడంలో జాప్యమా? ఇలాంటి కారణాల వల్ల కాంట్రాక్టర్లు బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే ఆపేశారు. ఫలితంగా భారీ వర్షాలకు జనం నానా తిప్పలు పడుతున్నారు. వాగులో నీళ్లు ఎక్కువ రావడంతో వాహనాలపై వాగును దాటడం ప్రమాదకరమని వాపోతున్నారు.బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి కోరుట్ల సంఘం వాగు వంతెనను పూర్తి చేయాలని స్థానిక ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.


## ఎల్లంపల్లి నీటిపై బిఆర్‌ఎస్ నేతల తప్పుడు ప్రచారం



ప్రజాపక్షం / రామడుగు : మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఎల్లంపల్లి ప్రా జెక్టు నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా వరద కాలువకు విడుదల చే సిన నీటిని బిఆర్ఎస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్ట్ నీళ్లు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని చొప్పదండి నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి హరీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో గోదావరి నది మీద శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులను నిర్మించి తెలంగాణ రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కోల రమేశ్, బిసిసెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, 6 మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్ప శ్రీనివాస్ రెడ్డి, మంత్రి మహేందర్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, నాగభూషన్ రెడ్డి, సువిన్ యాదవ్, అంజన్న ప్రసాద్, 6 మండలాల మార్కెట్ కమిటీ పాలకవర్గం, సింగిల్ విండో పాలకవర్గం, రైతులు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

### అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



ప్రజాపక్షం/కరీంనగర్: ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి,ఆర్‌డిఒషర్మిల, డిఆర్ఓ స్వామితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 212 దరఖాస్తులు అందగా, అత్యధికంగా కరీంనగర్ ఆర్‌డిఒ కార్యాలయానికి 66, గృహ నిర్మాణ శాఖకు 44 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులు, కోర్టు కేసులు అనవసరంగా పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రతి శాఖ బాధ్యతాయుతం గా వ్యవహరించాలని సూచించారు.

**కార్పొరేషన్‌లో ప్రజావాణి..**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆవరణలోని కళా భారతి లో సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమం జరిగింది. నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ ఆయాజ్, డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమీషనర్ రాజమనోహర్ నగరంలోని పలు డివిజన్లకు చెందిన ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు.వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో పెట్టకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఇఇ లచ్చిరెడ్డి, డిసిపి బషీరొద్దిన్, ఎసిపి శ్రీధర్, సూపరింటెండెంట్ షాహిదా పలువురు అధికారులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘానికి నష్టపరిహారం

ప్రజాపక్షం/గజ్వేల్: మల్లన్న సాగర్ భూనిర్వాసిత పల్లెపహాడ్ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘానికి నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం భవన నిర్మాణ రంగ కార్మికులు గజ్వేల్ ఆర్డీఓ కార్యాలయం, ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపటినటువంటి మల్లన్నసాగర్ ప్రాజెక్టులో భాగంగా ముంపునకు గురైన భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు. పల్లెపహాడ్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు గూడూరు స్వామి, ఉపాధ్యక్షులు శనిగరం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి శివలింగ స్వామి, సహాయ కార్యదర్శి , తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడు తప్పు.. ఇప్పుడు ఒప్పు.. ఎట్టెట్టా!




**ప్రజాపక్షం/ఖమ్మం:** తప్పు ఒప్పు దీనికి ఒక కొలబద్ద లేదని తనకు అనుకూలమైంది ఒప్పని, అననుకూలమైంది తప్పు అన్న భావన చాలా మంది రాజకీయ నాయకుల్లో ఉంది. ఇటువంటి రాజకీయ నాయకుల జాబితాల్లోకి కొందరు అధికారులు కూడా చేరుతున్నారనుకోండి. తమకు అనుకూలంగా తప్పును సైతం ఒప్పుగా మలుచుకోవడం తమకు అనుకూలించని పక్షంలో ఒప్పును సైతం తప్పుగా చిత్రీకరించడం ఇప్పటి ట్రెండ్. కొందరికైతే అధికారంలో ఉన్నప్పుడు తప్పు అయిన చర్య ప్రతిపక్షంలోకి రాగానే ఒప్పు అవుతుంది. అది వారి స్థానాన్ని బట్టి ఒక చర్యను తప్పు ఒప్పులుగా నిర్ణయించడం జరుగుతుంది. ఉదాహరణకు బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సీతారామ ప్రాజెక్టు పరిశీలనకు వెళ్లడానికి ప్రయత్నించిన మల్లు భట్టివిక్రమార్కను గృహ నిర్బంధం చేశారు. పోలీసులు కాస్త హడావుడి చేశారు. భట్టి విక్రమార్క ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. మరో మూడేళ్ల తర్వాత ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. ఇటీవల తనకు ఉద్యోగం రాలేదన్న మనోవ్యథతో ముదిగొండకు చెందిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతన్ని పరామర్శించేందుకు బిఆర్ఎస్ నాయకులు ఆసుపత్రికి వెళ్లారు. బిఆర్ఎస్ నాయకులు యువకున్ని పరామర్శించినంత మాత్రాన ప్రభుత్వానికి వచ్చే నష్టమేమి లేదు. ప్రభుత్వ ఆదేశాలో లేక పోలీసుల స్వయం నిర్ణయమో కానీ బిఆర్ఎస్ నాయకులను ఆసుపత్రి వద్ద అడ్డుకున్నారు. అప్పుడు సీతారామను భట్టి పరిశీలించిన ఇప్పుడు బిఆర్ఎస్ నాయకులు నిరుద్యోగిని పరామర్శించిన ప్రభుత్వాలకు వచ్చే నష్టం లేదు. మరి అప్పుడు తప్పు అని గొంతెత్తిన భట్టి ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు అదే పని చేసింది. అదే రీతిలో అప్పుడు గృహ నిర్బంధం చేయడం ఒప్పు అయినప్పుడు నేడు ఆసుపత్రి వద్ద పోలీసులు అడ్డుకోవడం కూడా ఒప్పే అవుతుందిగా అన్న విషయాన్ని బిఆర్ఎస్ నేతలు ఎందుకు గ్రహించడం లేదు అంటే స్థానాన్ని బట్టి తప్పొప్పులు మారిపోతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు ప్రశ్నించడాన్ని నేరంగా పరిగణించిన వారు విపక్షంలో ఉన్నప్పుడు దానిని హక్కుగా భావిస్తుండటం విడ్డూరం. విధాన పరమైన విమర్శలకు సంబంధించి ఇదే రీతి కొనసాగుతుంది. పథకాల అమలు, పాలన వ్యవహారాల కోసం అప్పులు చేయడం నేరమన్న కాంగ్రెస్ ఇప్పుడు తాను అప్పులే చేస్తుంది. మరి అప్పుడు అప్పులు చేసిన బిఆర్ఎస్ ఇప్పుడు అప్పు చేయడాన్ని తప్పుపడుతుంది. అదేమని ప్రశ్నిస్తే మేము చేసిన అప్పు కారణం వేరు మీరు చేస్తున్నది వేరు అంటూ ఇద్దరు సమర్థించుకునే ప్రయత్నం చేస్తారు. ఇక ఖమ్మం స్థానికానికి వచ్చే సరికి ఇటీవల ఖమ్మం నుంచి దేవరపల్లి హైవే ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఓ అమాత్యుడు దానికి సంబంధించి చొరవ చూపగా మరో అమాత్యుడు గతంలో అదే ప్రయత్నం చేశాడు. కానీ ఇప్పుడు మాత్రం ప్రారంభోత్సవానికి ఏమి తొందరవచ్చింది సర్వీసు రోడ్లను నిర్మించకుండానే ప్రారంభోత్సవాలా, ధంసలాపురం ఎగ్జిట్‌ను నేనే ఏర్పాటు చేయించా, నా ప్రమేయం లేదా అంటూ నేషనల్ హైవే అథారిటీ అధికారులపైన కాస్త పరుషంగానే మరో అమాత్యుడు మాట్లాడాడని సమాచారం. మరి అప్పుడు ప్రారంభోత్సవానికి సిద్ధపడటం ఇప్పుడు తొందరేమిటి అనడం వెనుక తప్పు ఒప్పోలను ఆలోచించాల్సింది. ఇక స్థానిక వ్యవహారానికి వస్తే బిఆర్ఎస్ హయాంలో మున్నేరుపై ఒక చెక్‌డ్యాం నిర్మించారు. అప్పటి చెక్‌డ్యాం శంకుస్థాపన సమయంలో అప్పుడు బిఆర్ఎస్‌లో ఉన్న ఓ నాయకుడు అత్యంత కీలకంగా వ్యవహరించారు. శంకుస్థాపన ఫోటోల్లోనూ మంత్రి తర్వాత తనదే స్థానమంటూ ఫోజులిచ్చాడు. ఇటీవల కాంగ్రెస్ పాలనలో ఆ చెక్‌డ్యాంను కూల్చివేశారు. అప్పుడు మంత్రి తర్వాత తానే అన్న నేత పార్టీ మారి ఆ చెక్ డ్యాం వల్ల ఖమ్మంకు నష్టమంటూ అందికే కూల్చివేశామంటూ నూరున్నొక రాగం అందుకున్నాడు. మరి నష్టమని తెలిసి ఉండి శంకుస్థాపన సమయంలో ఎందుకు పాల్గొన్నారు. అప్పుడు ఒప్పు అయింది ఇప్పుడు తప్పు ఎందుకైంది అంటే తాను పార్టీ మారడం దానితో పాటు ప్రభుత్వం మారడమే కారణం. గతంలో ప్రజలు ప్రభుత్వానికి నిలదీసినప్పుడు సంబరపడిన వారంతా ఇప్పుడు ప్రభుత్వంలోకి రాగానే ప్రభుత్వాన్ని నిలదీసే వారంతా ప్రశ్నించే వారు ఎందుకో ప్రభుత్వ వ్యతిరేకులుగా కుట్ర దారులుగా కనిపిస్తున్నారు. అంతే కాదు సంక్షేమాన్ని, ప్రజాపాలనను అడ్డుకుంటున్న కుట్రదారులుగా కనిపిస్తున్నారు. కేంద్రానికి సంబంధించి రెండేళ్లుగా కొత్త ట్రెండ్ మొదలైంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారంతా దేశ ద్రోహులేనట. కాంగ్రెస్ హయాంలో ప్రశ్నా పత్రాలు లీకై విద్యార్థుల జీవితాలు నాశనం అయ్యాయంటే ఒప్పు. ఇప్పుడు బిజెపి పాలనలో పేపర్ లీకై విద్యార్థుల భవితవ్యం దెబ్బతిన్నదంటే తప్పు అయిపోయింది. మొత్తంగా ఎప్పుడైనా తప్పు తప్పే. ఒప్పు ఒప్పే అన్న భావాన్ని పెంపొందించుకోవాలి. తప్పొప్పుల వ్యవహారంలో స్థానాన్ని బట్టి నిర్ణయం కాకుండా ఘటనను బట్టి తప్పొప్పులు నిర్ణయిస్తే మంచిది.

## పట్టుతప్పి కుంటుపడిన పాలన

కార్పొరేషన్‌లో అధికార పార్టీ నేతల హవా
జీ హుజూర్ అంటున్న సిబ్బంది




**ప్రజాపక్షం/ఖమ్మం:** ఖమ్మం కార్పోరేషన్‌లో పాలనపై పట్టుతప్పింది. పాలక వర్గం లేకపోవడం, అధికారులకు రకరకాల కారణాలతో సిబ్బందిపై పట్టు లేకపోవడంతో పాలన కుంటుపడుతుంది. సుమారు ఐదు లక్షలు పైబడిన జనాభా కలిగిన ఖమ్మం కార్పోరేషన్ పాలనపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో పాటు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగం గుత్తేదారులతో కుమ్మక్కు అవుతుందని గుత్తేదారులు చేసిన పనిని సక్రమంగా ఉందని చెప్పడం తప్ప ఇంజనీరింగ్ అధికారులు పనులను పర్యవేక్షించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ అధికారుల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే పని చేయడమే కాకుండా ఇంజనీరింగ్ అధికారులే ప్రశ్నించే వారికి ముడుపులు చెల్లిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటీవల ఓ ఇంజనీరింగ్ అధికారి ఇలాంటి చెల్లింపులే జరిపినట్లు కార్పోరేషన్ కార్యాలయంలోనే గుసగుసలాడుకుంటున్నారు. కార్పోరేషన్ కార్యాలయంలో అనుమతులకు సంబంధించి నిబంధనలకు తిలోదకాలు వదిలారని, పైరవీకారుల జోరు కార్యాలయంలో కొనసాగుతుందన్న ఆరోపణలకు ఊతమిచ్చేవిధంగా ఇటీవల కాలంలో పలు పనులను చట్టవిరుద్ధంగా చేశారని సమాచారం. ముఖ్యంగా భవన నిర్మాణాల అనుమతుల విషయంలో నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారని ప్రతి పనికి ఒక రేటు కట్టి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు పాలనపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మొత్తంగా లక్షలాది మంది ప్రజలతో ముడిపడిన కార్పోరేషన్ పాలన స్వేచ్ఛగా, నిజాయితీగా జరిగేవిధంగా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## గిరిజన సమస్యలు పరిష్కరించాలి

ఐటిడిఏ ఎపిఎ జనరల్
డేవిడ్ రాజ్



**ప్రజాపక్షం/భద్రాచలం:** గిరిజనుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఐడిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌కు హాజరైన ఆయన వివిధ మండలాల నుండి తరలివచ్చిన గిరిజనుల నుండి విన్నపాలు స్వీకరించారు. ఈసందర్భంగా డేవిడ్ రాజు మాట్లాడుతూ అర్హులన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు ప్రాధాన్యతా క్రమంలో అందుతాయని చెప్పారు. ఆయా యూనిట్ల అధికారులు ఇందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కారానికి వీలుగాని వాటిపై సమగ్ర నివేదికలు త్వరితగతిన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి చందన, ఎస్‌డిసి ఆనంద్ కుమార్, గురుకుల ఆర్‌సి అరుణకుమారి ఏడిఎం హెచ్‌ఓ సైదులుతో పాటు పలు యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

## డిసెంబర్ నాటికి వైద్య కళాశాల పనులు పూర్తి

నిర్మాణ పనులను
పరిశీలించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ప్రభుత్వ వైద్య కళాశాల పనులను త్వరితగతిన పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్దం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం రఘునాథ పాలెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను దశల వారీగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. వైద్య కళాశాల ప్రహరీ గోడ, హాస్టల్, అంతర్గత రహదారులను పూర్తి చేయాలని, అవసరమైన నిర్మాణ పనులకు సంబంధించిన రివైజ్డ్ ఎస్టిమేట్స్‌కు నిరంతర ఫాలోప్ చేసి ఆమోదాలు పొందాలని యంగ్ ఇండియా స్కూల్‌కు సంబంధించి బాలికల హాస్టల్ నిర్మాణాన్ని సెప్టెంబర్ ఒకటి నాటికి పూర్తి చేయాలని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజ నర్సింహా తో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనుల పూర్తి కోసం అదనంగా రూ. 64 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయని విద్యుత్, మౌలిక సదుపాయాల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని నిధులు మంజూరైతే కళాశాలను ప్రారంభించే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ నాటికి అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభానికి సిద్దం చేయాలన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్‌బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, ఆర్డీవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైద్యశాఖాధికారులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకులపై కేసు కొట్టివేత

పోడు రైతులకు అండగా ఉంటాం
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి మొండికట్ట ( సత్యనారాయణపురం ) గ్రామానికి చెందిన పలువురు రైతులు పోడుసాగు చేసుకొంటూ జీవినం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే 2016 సంవత్సరంలో సాగుకు సిద్దమవుతున్న తరుణంలో రైతులపై అటవీ అధికారులు దాడులు చేస్తున్నారు. విషయాన్ని తెలుసుకొన్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావులు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. పోడురైతులకు అండగా నిలిచారు. ఈ నేపద్యంలో ఫారెస్ట్ అధికారులు సిపిఐ నాయకులు, పోడుసాగుచేసుకొంటున్న రైతులు చిల్లా క్రిష్ణ, ముగితె వెంకట ముత్యం,బాద్ చెన్నయ్య, కందుకూరి మల్లేష్, చిట్ల కుమారస్వామి, నాగేశ్వరరావు,శంకర్, వనపర్తి శ్రీను, తిప్పెన కొండల్, వనపర్తి దేవి, తిప్పన రేణుక, వడ్డే భద్రయ్య, వెంకన్నలతో పాటుగా మొత్తం 23 మందిపై కేసులు పెట్టి జైలుకు పంపించారు. కొత్తగూడెం సెకండ్ అడిషనల్ న్యాయమూర్తి ఎదుట సుధీర్ఘ విచారణ అనంతరంరోజున కేసును కొట్టి వేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వీరి తరుపున సీనియర్ న్యాయవాదులు వై. ఉదయభాస్కర్, ఉప్పుశెట్టి సునీల్ వాధించారు. ఈ సంధర్భంగా మొండికట్టలో నాయకులు రైతులతో కలిసి సంబరాలు చేసుకొన్నారు. అనంతరం ముత్యాల విశ్వనాధం మాట్లాడుతూ పోడు రైతులకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏండ్లు గడుస్తున్నా పోడుసాగు దారులకు పట్టాలు మంజూరు చేయకపోవటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పంధించి నిరుపేదలైన గిరిజన, గిరిజనేతర పోడు రైతులకు పోడు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

'సీతారామ' జాప్యం
రైతాంగానికి శాపమే: దండి సురేష్




**ప్రజాపక్షం/ఖమ్మం:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా పాలన సాగించడం లేదని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేష్ మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం మినహా మహిళలకు ఇచ్చిన నెలకు రూ.2,500, తులం బంగారం, పింఛన్ల పెంపు, యువతకు స్కూటీల పంపిణీ సహా ఏ హామీ నెరవేరలేదని అదేవిధంగా రెండు లక్షల రుణమాఫీ లోపభూయిష్టంగా ఉందన్నారు. పంటల బీమా, రైతు బీమా తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేయలేదని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే సీతారామ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడంతో తీవ్ర జాప్యం జరిగిందని ఈ ప్రాజెక్టు విషయంలో బిఆర్ఎస్ బాటనే కాంగ్రెస్ పయనిస్తుందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు ఛాయలు నెలకొన్న నేడు సీతారామ పూర్తయి ఉంటే ఈ జిల్లా సస్యశ్యామలం అయి ఉండేదని సురేష్ తెలిపారు. ఈ ఏడాది కూడా అరకొర కేటాయింపులు చేశారని ట్రయల్ రన్ నిర్వహించి ఏడాది దాటినా నీటిని అందించకపోవడం ప్రభుత్వ వైఫల్యంగానే భావించాలన్నారు. ఈ పద్దతికి స్వస్తి పలికి అర్హులైన పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని సురేష్ డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువకులు నిర్వహించిన ఆందోళనకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించి ఆందోళనలో పాల్గొన్నదని మోడీ మొదటి సారి యువత ముందు తలవంచారని ఆయన తెలిపారు. ఇదే పోరాట పటిమను కొనసాగించాలని జంతర్ మంతర్ స్ఫూర్తితో రానున్న కాలంలో ప్రజా ఉద్యమాలు పురుడుపోసుకోనున్నాయని సురేష్ తెలిపారు.

**ఆరు నుంచి ప్రచార జైత్రయాత్ర :** ఈనెల ఆరు నుంచి 13 వరకు జాతీయ సమితి పిలుపులో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార జైత్ర యాత్రను నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఈ పాదయాత్రలు నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను గుర్తించడంతో పాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయనున్నామని సురేష్ తెలిపారు. ఈనెల ఆరున ఖమ్మం జిల్లా తల్లంపాడు వద్ద యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఆరు నుండి 13వరకు యాత్రలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలిస్తున్నట్లు సురేష్ తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణ కుమార్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యం వద్దు : కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ప్రజావాణిలో వచ్చిన వినతుల పరిష్కారంలో జాప్యం వద్దని, ప్రతీ దరఖాస్తునూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ఆయన జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల విన్నపాలు స్వీకరించారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు బట్వాడా చేశారు. అనంతరం అంకిత్ మాట్లాడుతూ అందిన ప్రతీ దరఖాస్తును పూరిత్ వివరాలతో పాటు రిజిష్ట్రర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అధికారులపై ఉన్న నమ్మకంతో వ్యయప్రయాసలకు ఓర్చి జిల్లా నలుమూలల నుండి ఇక్కడిదాకా వచ్చిన అర్జీలు సమర్పిస్తున్నారని, ప్రభుత్వ సేవలపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగేలా అధికారుల తీరు ఉండాలన్నారు. అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేయాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై హేతుబద్ధమైన నివేదికలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వేణుగోపాలరావు, అదనపు కలెక్టర్ విద్యాచందన డిఆర్ఓ పద్మావతితో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఎఐటియుసి

**ప్రజాపక్షం/చింతకాని :** కార్మికుల హక్కుల కోసం పోరాడేదిఎఐటియుసి మాత్రమేనని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలోని గంగవరపు విజయ్‌కుమార్ భవన్‌లో నక్కనబోయిన కృష్ణ అధ్యక్షతన జరిగిన ఎఐటియుసి చింతకాని మండల 5వ మహాసభలో జమ్ముల మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చి కార్మికుల హక్కులు కాలరాస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలతో నడుస్తున్న ప్రభుత్వాలను ప్రశ్నించడానికి కార్మికులు ఏకమవ్వాలన్నారు. ఈ నెల 23, 24 వతేదీలలో సత్తుపల్లిలో జరిగే జిల్లా ఎఐటియుసి మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక వర్గం ఎనిమిది గంటల పని, కనీస వేతనాలు, సంఘ హక్కులు కోల్పోతున్నారన్నారు.శతాబ్ద కాలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం ఎఐటియుసి చింతకాని మండల కన్వీనర్‌గా బండి పుల్లారావు, కోకన్వీనర్‌గా గోగుల వెంకట్రావుతో పాటు మరో 5గురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈసమావేశం ప్రెసిడెంట్ రావి శివరామ కృష్ణ, సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బోళ్ల భాను, వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మోడి ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతిఘటించేందుకు సెప్టెంబర్ 1న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రథం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే ఫహీమ్ దాదా అన్నారు. ఈ మేరకు సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పరిస్థితులు నానాటికీ దిగజారి పోతున్నాయని, దేశంలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా సామాన్యులకు భారంగా మారిందన్నారు.

## తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆగస్టు ఒకటి నుంచి ఏడు వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ ఆహారమని తెలిపారు. ఈ ఆరు నెలల కాలంలో శిశువు ఎదుగుదల అభివృద్ధికి రోగ నిరోధక శక్తికి అవసరమైన అన్ని పోషకాలు తల్లిపాలలో లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పార్థస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పి సీఈవో దీక్షారైనా, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి ఎ. ప్రమీల, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రామారావు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, అధికారులు, పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిరస్మరణీయులు బందారుపల్లి వెంకయ్య, కోటేశ్వరరావు



సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు

**ప్రజాపక్షం/కొణిజర్ల:** సిపిఐ నాయకులు బందారుపల్లి వెంకయ్య, కోటేశ్వరరావు లు అతి కిరాతకంగా హత్యచేయబడ్డారని పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన వారు చిరస్మరణీయులుగా నిలిచారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు అన్నారు. మండల పరిధిలోని కొత్తకాచారం గ్రామంలో వారి 30 వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామంలో పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేని కొందరు దుండగులు వారిని చంపేశారని అన్నారు. పేదప్రజల సమస్యల నేడు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టుల అవసరం ఉందని అన్నారు. పార్టీ నిర్మాణం, విస్తరణకోసం ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, జిల్లా సమితి సభ్యులు పొఖరిని సుదర్శన్, మాజీ సర్పంచ్ మోదుగు చిన్న వెంకటి, నారాయణ, కొమ్మగిరి మురళి, తాళ్లూరి రాములు, లక్ష్మయ్య, మోదుగు నాగయ్య, వెంకటి, బందారుపల్లి వెంకయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించండి

రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి...




**ప్రజాపక్షం/మణుగూరు:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండ కట్టడానికి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుండి నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని రాష్ట్ర సమితి సభ్యులు పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల ప్రజా వ్యతిరేక విధానాల పట్ల సామాన్యుల ప్రజల జీవితం అస్తవ్యస్తంగా మారిందని నిత్యావసర వస్తువుల ధర లు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల నిరంతరం పెరుగుతుందో ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ ప్రజా చైతన్య యాత్రను ప్రజలు రైతులు కార్మికులు, యువజనులు, విద్యార్థులు, మహిళలు, మేధావులు, ప్రజాసామికవాదులు ,అన్ని వర్గాల ప్రజల అత్య సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు.

## డెలీవేజ్ వర్కర్ల సమస్యలు నా దృష్టికి తీసుకురండి: చందన



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని డిడి ట్రైబర్‌వెల్ఫేర్ అధికారిని చందన అన్నారు. ఈ సందర్భంగా ఆమెను సోమవారం డైలీవేజ్ వర్కర్ల సంఘం తరుపున కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డిడి చందన మాట్లాడుతూ డైలీవేజ్ వర్కర్లు శ్రమతో కూడిన పనులు చేస్తున్నారని, శ్రమకు తగినట్లుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని యూనియన్ నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైలీవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజు మహిళా అధ్యక్షురాలు రమాకళ, సుజాత ఉపాధ్యక్షులు తాటి ఉమా కార్యదర్శి పొడియం బాబూరావు సహాయ కార్యదర్శి సమ్మక్క సలహాదారులు వీరస్వామి ఆర్గనైజర్లు విజయలక్ష్మి వీరస్వామి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల వేడుకలపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు.

### మహిళా రెజ్లర్ల లైంగిక ఆరోపణల కేసు

# బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు క్లీన్ చిట్


## సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసు కొట్టివేసిన ఢిల్లీ కోర్టు



**న్యూఢిల్లీ :** తనపై ఎన్ని కేసులు ఉన్నా... బిజెపిలో చేరగానే ఆ వ్యక్తిపై ఉన్న మచ్చలు చెరిపేస్తున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలు ఒక్కొక్కటిగా నిజమవుతున్నాయి. ఇటీవలే 2024 నీట పేపర్ లీకేజీలో ఎలాంటి ఆధారాలు లేవంటూ నిందితుడికి క్లీన్‌చిట్ ఇవ్వగా, తాజాగా డబ్ల్యుఎఫ్‌ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు క్లీన్ చిట్ ఇచ్చారు. ఆరుగురు మహిళా రెజ్లర్లు దాఖలు చేసిన లైంగిక వేధింపుల కేసులో మాజీ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌ఐ) అధ్యక్షుడు, మాజీ బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, మాజీ డబ్ల్యుఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను ఢిల్లీ కోర్టు సోమవారం నిర్దోషులుగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా ఈ కేసును అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అశ్విని పన్వార్ కొట్టివేశారు. డబ్ల్యుఎఫ్‌ఐ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారనే ఆరోపణలతో బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా వంటి అగ్రశ్రేణి ఒలింపిక్ రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఆందోళనల అనంతరం ఢిల్లీ పోలీసులు 2023లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు పూర్తయ్యాక సుమారు 1,500 పేజీల ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. భారతీయ శిక్షాస్మృతి (ఐపిసి)లోని సెక్షన్ 354, 354ఎ, 354డి, 506(1) కింద అభియోగాలు మోపారు. మాజీ డబ్ల్యుఎఫ్‌ఐ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా సహ నిందితుడిగా చేర్చారు.

**జులై 2న వాదనలు ముగింపు**

జులై 2న ఈ కేసులో ఇరు పక్షాల తుది వాదనలు పూర్తయ్యాయి. అదనపు ప్రధాన న్యాయ మేజిస్ట్రేట్ అశ్విని పన్వార్ తీర్పును ఆగస్టు 3కు వాయిదా వేశారు. విచారణ మొత్తం మీడియాను అనుమతించకుండా ఇన్‌కెమెరా విధానంలో నిర్వహించారు. ఫిర్యాదుదారుల తరఫున సీనియర్ న్యాయవాది రెబెక్కా జాన్ వాదనలు వినిపించగా, బ్రిజ్‌భూషణ్ తరఫున రాజీవ్ మోహన్ నేతృత్వంలోని న్యాయవాదుల బృందం తమ వాదనలు వినిపించింది. సోమవారం వెలువడిన తీర్పులో బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్, వినోద్ తోమర్‌లను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. అయితే తీర్పుకు సంబంధించిన పూర్తి కారణాలతో కూడిన ఉత్తర్వులు ఇంకా వెలువడాల్సి ఉంది. వాటిని పరిశీలించిన అనంతరం తదుపరి న్యాయపరమైన చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అవసరమైతే మేజిస్ట్రేట్ కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసే అవకాశముందని ప్రభుత్వ తరఫు న్యాయవాది పేర్కొన్నారు.



**వ్యవస్థ మొత్తం బ్రిజ్ భూషణ్‌నే కాపాడుతుంది:** వినేశ్ ఫొగట్ బ్రిజ్ భూషణ్‌కు క్లీన్ చిట్‌పై వినేశ్ ఫొగట్ స్పందిస్తూ.. బ్రిజ్ భూషణ్‌ను రక్షించడానికి వ్యవస్థ మొత్తం పనిచేసిందని ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. మహిళా రెజ్లర్లు తమ పోరాటాన్ని విడిచిపెట్టరని, ఢిల్లీ కోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళతామని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేయాలని తమ లీగల్ టీమ్‌కు సూచించామని వెల్లడించారు. అధికార పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయించడానికి ధైర్యాన్ని కూడగట్టుకుని వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టాం. కేసు వాపసు తీసుకోమని అతడు తన పలుకుబడితో, కండబలంతో ఫిర్యాదుదారులను బెదిరించాడని ఆమె ఆరోపించారు. అయినా భయపడకుండా తమ న్యాయపోరాటాన్ని కొనసాగించామని తెలిపారు. కానీ ఢిల్లీ కోర్టు అతడిని నిర్దోషిగా తేల్చడం మాకు తీవ్ర నిరాశను కలిగించిందని వాపోయారు. అయినా దీనిపై వెనుకడుగు వేయమని, న్యాయం జరిగే వరకు పోరాడతామని పేర్కొన్నారు.

### ఉభయసభల్లోనూ

# కొనసాగుతున్న ప్రతిష్టంభన

- విద్యార్థులు, యువతపై పోలీసుల అమానుష చర్యపై చర్చకు ప్రతిపక్షాలు పట్టు
- సభకు హోంమంత్రి అమిత్ షా వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్
- విపక్ష ఎంపిల నిరసనలు, నినాదాలతో దద్దరిల్లిన లోక్‌సభ, రాజ్యసభ



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మూడవ వారానికి చేరుకున్నాయి. గత రెండు వారాల నుంచి ఉభయసభల్లో ప్రతిపక్షాలు పలు అంశాలను లేవనెత్తుతూ నిరసనలు, ఆందళనకు దిగాయి. దీంతో సభలు అట్టుడికాయి. తాజాగా సోమవారం కూడా ఉభయసభల్లో ప్రతిష్టంభన నెలకొంది. సభలు ప్రారంభం కాగానే నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు, యువత నిర్వహించిన 'పార్లమంట్ మార్చ్' సందర్భంగా వారిపై పోలీసు చర్య, రామ మందిర విరాళాల చోరీ ఆరోపణలపై ప్రతిపక్ష సభ్యులు పదేపదే నిరసనలు తెలియజేశాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. అయితే లోక్‌సభలో అంతరాయాలు ఉన్నప్పటికీ, సభ కొద్దిసేపు తిరిగి కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత ప్రభుత్వం కీలక చట్టాలను ప్రవేశపెట్టింది. మరోవైపు పార్లమెంట్ ఆవరణలో కూడా ప్రతిపక్ష పార్టీల ఎంపిలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాగా, లోక్‌సభ ఉదయం ప్రారంభమైన వెంటనే నీట్ పేపర్ లీక్, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల అపహరణ ఆరోపణలపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసనల చేపట్టారు. విద్యార్థులు, యువతపై పోలీసుల అమానుష చర్యపై చర్చ జరపాలని నినాదాలు చేశారు. సభ సజావుగా సాగేందుకు అనుమతించాలంటూ సభాపతి పదేపదే చేసిన విజ్ఞప్తులను నిరసనకారులు తిరస్కరించడంతో సభ కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేయాల్సి వచ్చింది. అంతకుముందు వాయిదా పడిన సభ తిరిగి సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య రెండు బిల్లులను ప్రవేశపెట్టారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ బిల్లు, 2026, బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు, 2026 అనే ఈ రెండు బిల్లులను ప్రవేశపెట్టే దశలోనే వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష సభ్యులు నోటీసులు ఇచ్చారు. కానీ, ప్రతిపక్ష సభ్యులెవరూ మాట్లాడకపోవడంతో, ఈ బిల్లులను మూజువాణి ఓటు ద్వారా ప్రవేశపెట్టారు. బిల్లులను వ్యతిరేకిస్తూ నోటీసులు ఇచ్చిన వారి పేర్లను ప్రకటించినప్పటికీ ఎవరూ మాట్లాడలేదని సభాపతి ప్రతిపక్ష సభ్యులకు గుర్తు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయడం పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధమని కూడా ఆయన సూచించారు. ఆ తర్వాత సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

**హోంమంత్రి సభకు రావాలి**

మరోవైపు రాజ్యాసభలోనూ ప్రతిపక్ష సభ్యులు నిరసనలు, నినాదాలు చేశారు. విద్యార్థులపై పోలీసుల చర్యకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు హోం మంత్రి అమిత్ షా హాజరు కావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు సభకు అంతరాయం కలిగించారు. రాజ్యసభ కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. గత నెలలో రాజధాని, ఇతర రాష్ట్రాలలో నిరసన చేస్తున్న విద్యార్థులను చెదరగొట్టడానికి పోలీసులు మితిమీరిన బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై హోం మంత్రి సమాధానాలు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో సహా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. అయోధ్యలోని రామ మందిరం నుండి విరాళాలను దొంగిలించారన్న ఆరోపణలపై కూడా ఎంపిలు నినాదాలు చేశారు. కొంతమంది వామపక్ష ఎంపిలు సభలో ప్లకార్డులు ప్రదర్శించడంతో, చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఇలాంటి ప్రవర్తన సరికాదని, ఇది కొనసాగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడటానికి ప్రయత్నించగా, ప్రతిపక్ష సభ్యులు ముందుగా నినాదాలు ఆపి తమ సీట్లకు తిరిగి వెళ్లాలని చైర్మన్ పట్టుబట్టారు. పలువురు ఎంపిలు తమ తమ సీట్లలోకి తిరిగి వెళ్లడం ప్రారంభించినప్పటికీ, అడపాదడపా నినాదాలు కొనసాగడంతో, సభాపతి సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేయవలసి వచ్చింది. అంతకు ముందు సభలో జాబితాలోని పత్రాలను ఉంచిన వెంటనే గందరగోళం మొదలైంది. నినాదాలు చేస్తున్న ప్రతిపక్ష ఎంపిలు — వారిలో కొందరు ప్లకార్డులు పట్టుకుని — వెల్ వైపు దూసుకెళ్లారు. అయితే, వారు ముందు వరుసలలో ఆగి, నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఈ గందరగోళం మధ్య, రాధాకృష్ణన్ జాబితాలోని జీరో అవర్ ప్రస్తావనలకు పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించాలని ప్రతిపక్ష పార్టీలు ఆయనను కోరాయి. అయితే, నినాదాలు కొనసాగుతుండటంతో, ఖర్గేను పిలవలేదు. సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

# సుప్రీంలో జడ్జీల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ :** దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న మొత్తం 34 మంది న్యాయమూర్తుల సంఖ్యను 38కు పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు–2026ను విపక్షాల తీవ్ర నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. దీంతో ఈ ఏడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. లోక్‌సభ సమావేశం ప్రారంభమైనప్పటి నుంచే ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో సభా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం సజావుగా సాగలేదు. పలుమార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. వాయిదాల పర్వంలోనే ఈ పరిస్థితుల్లో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లును సభలో ప్రవేశపెట్టి దాని ఉద్దేశాన్ని సంక్షిప్తంగా వివరించారు. అయితే స్పీకర్ సభ్యులను పలుమార్లు శాంతించాలని కోరారు. అయితే విపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో చర్చ జరగలేదు. అనంతరం బిల్లును మూజువాణి ఓటుకు పెట్టగా సభ ఆమోదం తెలిపింది. ఇదే సమయంలో ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షం తీసుకొచ్చిన చట్టబద్ధ తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో తిరస్కరించారు. ఈ సవరణ బిల్లు ప్రకారం ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అనుమతించిన సంఖ్యను 33 నుంచి 37కు పెంచనున్నారు. ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు చేరుతుంది. సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల సంఖ్య, న్యాయమూర్తులపై అధిక పని భారం, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది.

**లోక్‌సభలో రెండు బిల్లులు ప్రవేశం**

ఇదిలా ఉండగా, సోమవారం లోక్‌సభలో మరో రెండు బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భారతీయ గణాంక సంస్థ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్–ఐఎస్‌ఐ)కు సమగ్ర చట్టపరమైన వ్యవస్థను కల్పించే భారతీయ గణాంక సంస్థ బిల్లు–2026ను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ సభలో ప్రవేశపెట్టారు. ఆ బిల్లు ద్వారా ప్రస్తుతం 1959 చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదిస్తోంది. ఐఎస్‌ఐను బాడీ కార్పొరేట్‌గా ఏర్పాటు చేసి పాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, విద్యా, పరిశోధనా రంగాల్లో ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దడం, గణాంక శాస్త్రం, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, పరిమాణాత్మక ఆర్థిక శాస్త్రం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో అవసరాలకు అనుగుణంగా సంస్థను తీర్చిదిద్దడం బిల్లు ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. కాగా, డిజిటల్, వర్చువల్ రికార్డులను న్యాయస్థానంలో ఆమోదయోగ్యమైన సాక్ష్యంగా చేర్చాలనే లక్ష్యంతో, బ్రిటిష్ కాలం నాటి చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి బిల్లును ప్రభుత్వం లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్, 2026'గా పిలవబడే ఈ కొత్త చట్టం, 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్, 1891' స్థానంలోకి రాబోతోంది లేదా దానిని రద్దు కానుంది. 'సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం, డిజిటల్ బ్యాంకింగ్ పెరగడంతో, బ్యాంకు రికార్డులు భౌతిక రికార్డులకు బదులుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎక్కువగా సృష్టించబడుతున్నాయి, నిల్వ చేయబడుతున్నాయి. అందువల్ల, ప్రస్తుత బ్యాంకింగ్ వ్యవస్థ అవసరాలను తీర్చడానికి ఇప్పటికే ఉన్న చట్టపరమైన వ్యవస్థను ఆధునీకరించడం, బలోపేతం చేయడం అవసరమైంది' అని బిల్లు ఉద్దేశ్యాలు, కారణాల ప్రకటనలో పేర్కొన్నారు.

# బంగ్లా, నేపాల్‌వైపు చూడాల్సిన అవసరం లేదు

- మనకు మహాత్మాగాంధే స్ఫూర్తి
- పిటిఐ ఇంటర్వ్యూలో సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

**ఛత్రపతి సంభాజీనగర్:** ప్రపంచానికే స్ఫూర్తినిచ్చే మహాత్మా గాంధీ వారసత్వం మనకు ఉన్నప్పుడు, నిరసనలు తెలిపే విద్యార్థులు బంగ్లాదేశ్ లేదా నేపాల్ వైపు చూడాల్సిన అవసరం లేదని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో ఉన్న తన నివాసంలో పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో, దీప్కే సిజెపి విస్తరణ ప్రణాళికలు, ఆత్మహత్య చేసుకున్న నీట్ అభ్యర్థుల కుటుంబాలకు పరిహారం, భారతదేశంలో విద్యా వ్యవస్థ స్థితిగతులపై వచ్చిన ఆరోపణల గురించి మాట్లాడారు. పరీక్షల్లో అక్రమాలకు వ్యతిరేకంగా సిజెపి చేపట్టిన ఢిల్లీ నిరసనను, షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వాన్ని గద్దె దించిన 2024 నాటి ఉద్యమంతో పోలుస్తూ ప్రవాస బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ చేసిన వ్యాఖ్యలను దీప్కే తోసిపుచ్చారు. 'బంగ్లాదేశ్, నేపాల్‌లోని నిరసనలను మాకు అపఖ్యాతి తెచ్చేందుకు వాడుకుంటున్నారు; మేము వారిలా కాదు' అని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన నిరసనలో తాము రాజ్యాంగానికి కట్టుబడి, శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేశామని నిరూపించుకున్నామని, బంగ్లాదేశ్, నేపాల్ నిరసనలతో పోల్చడం ద్వారా మమ్మల్ని అపఖ్యాతి పాలు చేస్తున్నారన్నారు. ప్రపంచం నిరసన తెలపడానికి స్ఫూర్తిని పొందే మహాత్మా గాంధీ మనకు ఉన్నప్పుడు, మనం బంగ్లాదేశ్ లేదా నేపాల్ వైపు చూడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పోలీసుల అరాచకాలు ఆయా దేశాల్లోని దృశ్యాలను గుర్తుచేయడం వల్లే ప్రజలు బంగ్లాదేశ్, నేపాల్ నిరసనల గురించి మాట్లాడుతున్నారని దీప్కే పేర్కొన్నారు. భారతదేశంలోని విద్యార్థులు హింసాత్మకంగా లేదా దూకుడుగా ప్రవర్తించలేదని, వారి తలలు, చేతులు, కాళ్లు విరిగినా సంయమనం పాటించి జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా కూర్చున్నారని చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ విద్య ప్రధాన ఎజెండాగా ఉండాలని సిజెపి వ్యవస్థాపకుడు అన్నారు. ఎన్నికల్లో విద్యను ప్రధాన ఎజెండాగా చేసుకోకపోతే, ఎవరూ భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదని అర్థమని, విద్య అనేది దేశ భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడిని ఉద్ఘాటించారు. ఆత్మహత్య చేసుకున్న నీట్ అభ్యర్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో జాప్యం జరుగుతుండటంపై దీప్కే ప్రభుత్వాన్ని విమర్శించారు. 'రాత్రికి రాత్రే (రాష్ట్ర) ప్రభుత్వాన్ని కూల్చడానికి వారి (పాలక పక్షం) దగ్గర డబ్బు ఉంది. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎంపిలు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేయగలరు, కానీ నీట్ బాధితులు, వారి కుటుంబాల విషయానికి వస్తే మాత్రం నిబంధనల గురించి మాట్లాడుతారు' అని దీప్కే మండిపడ్డారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వీలైనంత త్వరగా నెరవేర్చాలని, లేకపోతే మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. పార్లమెంటులోనూ, బహిరంగ సభల్లోనూ దూషించే బిజెపి నాయకుల స్థాయికి దిగజారవద్దని 'జెన్ జీ'కి దీప్కే పిలుపునిచ్చారు. తమకు, ఆ గుండాలకు మధ్య కొంత తేడా ఉందని, ఆ తేడా ఎప్పుడూ అలాగే ఉండాలన్నారు.



**జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనకు మద్దతు**

జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ పరీక్ష, ఇతర నియామక పరీక్షలలో జరిగినట్లు ఆరోపించబడుతున్న అక్రమాలపై, అలాగే సిబిఐ విచారణ, నియామక సంస్థలలో సంస్కరణల కోసం డిమాండ్ చేస్తూ ఆ రాష్ట్రంలో విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు తాను మద్దతు ఇస్తున్నట్లు దీప్కే తెలిపారు. వారి పోరాటం ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా కాదని, వ్యవస్థకు వ్యతిరేకంగా సాగుతోందన్నారు. వారి డిమాండ్లకు తాము అండగా ఉంటామని, వారు సిబిఐ విచారణ కోరుకుంటే, దానిని సాధించే ప్రయత్నంలో తాము వారికి మద్దతు ఇస్తామన్నారు. విద్య కోసం ఎక్కడ ఆందోళనలు జరిగినా, విద్యార్థులు తమ హక్కుల కోసం ఎక్కడ ముందుకు వచ్చినా, ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీతో సంబంధం లేకుండా వారికి అండగా నిలబడతామని దీప్కే స్పష్టం చేశారు. 'మా పోరాటం ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా కాదు కాబట్టి మా విధానం స్పష్టంగా ఉంది. దేశంలోని విద్యార్థులను నిరాశపరిచిన వ్యవస్థకు వ్యతిరేకంగానే మా పోరాటం' అని దీప్కే అన్నారు. విద్యార్థుల నిరసనకు మద్దతుగా పలువురు ప్రముఖ ప్రతిపక్ష నాయకులు జంతర్ మంతర్‌ను సందర్శించడంపై స్పందిస్తూ, ఆ నాయకులు తమ పార్టీల ప్రచారం లేదా తమ సొంత ప్రచారం కోసం ఆ అవకాశాన్ని వాడుకోలేదని దీప్కే పేర్కొన్నారు. సిజెపి విస్తరణ ప్రణాళికల గురించిన ప్రశ్నకు సమాధానంగా, ఈనెల 5న ఛత్రపతి సంభాజీనగర్‌లో సంస్థ సమావేశం నిర్వహించనున్నట్లు దీప్కే తెలిపారు. 'సిజెపి విస్తరణ జరుగుతుంది. ఇటీవలి నిరసన విజయవంతమైన తర్వాత మా బాధ్యత పెరిగింది. సిజెపి పట్ల ప్రజల అంచనాలు కూడా పెరిగాయి. బుధవారం జరిగే సమావేశంలో మా భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై చర్చిస్తాము' అని ఆయన అన్నారు. ఈ సమావేశం తన నివాసంలో జరుగుతుందని, ఇందులో 10 నుండి 15 మంది పాల్గొంటారని దీప్కే తెలిపారు.

**భారత్, విదేశీ విద్యలో చాలా వ్యత్యాసం**

భారతదేశంలోనూ, విదేశాల్లోనూ విద్య విషయంలో చాలా వ్యత్యాసం ఉందని దీప్కే అన్నారు. 'అతిపెద్ద వ్యత్యాసం ఏమిటంటే, విద్య విషయంలో (చాలా) విదేశీ దేశాలలో మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయి' అని ఆయన అన్నారు. 'వారు మిమ్మల్ని ఒక మనిషిగా, ఆ దేశ బాధ్యత గల పౌరుడిగా మరింతగా నేర్చుకునేలా, ఎదిగేలా చేస్తారు. మన విద్య కేవలం గ్రేడ్‌లకే పరిమితం. నేను అమెరికాలో చదువుతున్నప్పుడు, అక్కడి కోర్సులు ఎక్కువగా ఆచరణాత్మకంగా ఉండేవి, సిద్ధాంతం చాలా తక్కువగా ఉండేది. భారతదేశంలో, ఆచరణాత్మక అభ్యాసానికి మరింత అవకాశం ఉండాలి' అని ఆయన అన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత భారత ప్రభుత్వం విద్యపై తక్కువ ఖర్చు చేస్తుండటం దురదృష్టకరమని దీప్కే అన్నారు. 'అత్యధిక నిధులు విద్యకే కేటాయించాలి. ప్రభుత్వానికి నిధుల కొరత ఏమీ లేదు, కాబట్టి విద్యపై ఖర్చును ఎందుకు తగ్గిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. దేశానికి విద్యే పునాది కాబట్టి, దానిపైనే అత్యధికంగా ఖర్చు చేయాలి' అని అన్నారు. 'పిఎం కేర్స్' నిధిలో ఎంత మొత్తం ఉందో తెలియదు, ఆ నిధి నుండి విద్యాశాఖ కొంత సహాయం పొందవచ్చని భావిస్తున్నానన్నారు. దేశంలో విద్యా ప్రమాణాలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోవడమే కాకుండా, భరించలేని ఖర్చుతో కూడినవిగా మారాయని ఆయన పేర్కొన్నారు.


తెలంగాణా ప్రభుత్వము

భూ సేకరణ అధికారి మరియు సబ్- కలెక్టర్, కల్లూరు వారి రూఢీ ప్రకటన

ఫారం - 7

(చూడుము సబ్ రూల్ 1 రూల్ - 25, సెక్షన్ - 19(1) చట్టము - 30/2013)

కలెక్టర్ ఫైల్ నెం నెం. జి1/75652/2024 — తేది: 29.07.2026

భూ. సే అధికారి ఫైల్ నెం. A/1119/2025 — తేది: 22.07.2026

జిల్లా గెజిట్ నెం. A3/67/2026 — తేది: 30.07.2026

తెలంగాణా ప్రభుత్వం ఖమ్మం గారు దిగువ నిర్దిష్ట పరిచిన ఖమ్మం జిల్లాలోని జిల్లా కలెక్టర్ / సత్తుపల్లి మండలములోని చెరుకుపల్లి గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ. 4.03 గుం. నిమిత్తం అనగా SRLIP (సీతారామ లిఫ్ట్ నీటిపారుదల ప్రాజెక్టు) కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నందున భావించనైనది.

కావున ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలములోని చెరుకుపల్లి గ్రామములో ఉన్న భూమి సుమారు ఎ.4.03 గుం. ఈ క్రింద చూపిన వారి నుండి, గల భూమి యొక్క వివరములు భూసేకరణ నిమిత్తం జారి చేయనైనది (డిక్లరేషన్) రూఢీ ప్రకటన,

షెడ్యూలు

గ్రామం : చెరుకుపల్లి — మండలం : సత్తుపల్లి — జిల్లా : ఖమ్మం

| క్ర.సం. | స.నెం. SDR | భూమి స్వభావం | భూమి రకం | విస్తీర్ణం | ఆసక్తిదారుని పేరు మరియు చిరునామా | హద్దులు | | | | చెట్లు మరియు కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | |
| 1 | 114/1/2/A | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.06 3/4 | సోయాం నాగ లక్ష్మి W/O నాగ రాజు (ఆక్రమణ) | సున్నం ముత్యాలు S/O రాజులు | రాంబాబు S/O గోపాల రావు | సోయాం నాగలక్ష్మి W/O నాగరాజు | సోయాం నాగలక్ష్మి W/O నాగ రాజు | టేకు : 1, కొబ్బరి : 2- |
| 2 | 114/1/2/B | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.17 | సున్నం ముత్యాలు S/O రాజులు (ఆక్రమణ) | సున్నం ఎర్రప్ప S/O రాములు | సోయాం నాగలక్ష్మి W/O నాగ రాజు | సున్నం ఎర్రప్ప S/O రాములు | సున్నం ముత్యాలు S/O రాజులు | టేకు : 1 పైప్స్ :30 |
| 3 | 114/1/2/C | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.22 | సున్నం ఎర్రప్ప S/O రాములు (ఆక్రమణ) | సున్నం నాగేశ్ S/O వీర స్వామి | సున్నం ముత్యాలు S/O రాజులు | సున్నం ఎర్రప్ప S/O రాములు | సున్నం ఎర్రప్ప S/O రాములు | - పైప్స్ : 10 |
| 4 | 114/1/2/D | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.07 | సున్నం నాగేశ్ S/O వీర స్వామి (ఆక్రమణ) | సున్నం నాగేశ్ S/O వీర స్వామి | సున్నం ఎర్రప్ప S/O రాములు | సున్నం ముయ్యా S/O కటప్ప | సున్నం నాగేశ్ S/O వీర స్వామి | -- |
| 5 | 114/1/2/E | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.10 1/2 | సున్నం ముయ్యా S/O కటప్ప (ఆక్రమణ) | వాగు | సున్నం ఎర్రప్ప S/O రాములు | సున్నం ముయ్యా S/O కటప్ప | సున్నం నాగేశ్ S/O వీర స్వామి | కొబ్బరి :1, టేకు :1, జీడి:1, నిమ్మ :1, మామిడి:2 పైప్స్:10, కరెంట్ పోల్స్:1 |
| 6 | 114/1/2/F | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.05 | రెసు దుర్గ W/O కృష్ణ (ఆక్రమణ) | రెసు దుర్గ W/O కృష్ణ | రెసు దుర్గ W/O కృష్ణ | సున్నం కృష్ణవేణి W/O కృష్ణ | సున్నం ముయ్యా S/O కటప్ప | -- |
| 7 | 114/1/2/G | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.03 1/2 | సున్నం కృష్ణ వేణి W/O కృష్ణ (ఆక్రమణ) | వాగు | సున్నం కృష్ణ వేణి W/O కృష్ణ | సున్నం రాజు S/O వీరస్వామి | రెసుదుర్గ W/O కృష్ణ | టేకు : 4, జీడి: :3 |
| 8 | 114/1/2/H | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.00 3/4 | సున్నం రాజు S/O వీర స్వామి (ఆక్రమణ) | వాగు | సున్నం రాజు S/O వీర స్వామి | సున్నం రాజు S/O వీరస్వామి | సున్నం కృష్ణ వేణి W/O కృష్ణ | టేకు :8, మేడి :4 |
| 9 | 114/1/2/I | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.02 1/2 | సున్నం పోతమ్మ W/O ముయ్యా (పట్టా దారు) | సున్నం పోతమ్మ W/O ముయ్యా | వాగు | సున్నం రాజమ్మ W/O నాగేశ్ | సున్నం వీర స్వామి S/O రాజులు | వెదురు పొద:1 |
| 10 | 114/1/2/J | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.00 3/4 | సున్నం వీర స్వామి S/O రాజులు (ఆక్రమణ) | సున్నం వీర స్వామి S/O రాజులు | వాగు | సున్నం పోతమ్మ W/O ముయ్యా | సున్నం వీరస్వామి S/O రాజులు | వెదురు పొద:1 |
| 11 | 114/1/2/K | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.03 | సున్నం రాజమ్మ W/O నగేశ్ (ఆక్రమణ) | సున్నం రాజమ్మ W/O నాగేశ్ | సున్నం రాజమ్మ W/O నాగేశ్ | తెల్లం వీరస్వామి S/O గంగులు | సున్నం పోతమ్మ W/O ముయ్యా | పైప్స్ :10 |
| 12 | 114/1/2/L | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.03 | తెల్లం వీర స్వామి S/O గంగులు (ఆక్రమణ) | తెల్లం వీర స్వామి S/O గంగులు | తెల్లం వీర స్వామి S/O గంగులు | సున్నం చిన వీర స్వామి S/O యెల్లప్ప | సున్నం రాజమ్మ W/O నాగేశ్ | -- |
| 13 | 114/1/2/M | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.03 | సున్నం చిన వీర స్వామి S/O యెల్లప్ప (ఆక్రమణ) | సున్నం చిన వీర స్వామి S/O యెల్లప్ప | సున్నం చిన వీర స్వామి S/O యెల్లప్ప | సోయాం నాగ లక్ష్మి S/O నాగరాజు | తెల్లం వీరస్వామి S/O గంగులు | -- |
| 14 | 114/1/2/N | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.03 3/4 | సోయాం నాగ లక్ష్మి S/O నాగ రాజు (ఆక్రమణ) | సోయాం నాగలక్ష్మి S/O నాగ రాజు | సోయాం నాగలక్ష్మి S/O నాగ రాజు | కట్టం బక్కులు S/O బోడప్ప | సున్నం చిన వీర స్వామి S/O యెల్లప్ప | -- |
| 15 | 114/1/2/O | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.04 | కట్టం బక్కులు S/O బోడప్ప (ఆక్రమణ) | కట్టం బక్కులు S/O బోడప్ప | కట్టం బక్కులు S/O బోడప్ప | సున్నం మునెమ్మ W/O ఎర్రప్ప | సోయాం నాగలక్ష్మి S/O నాగ రాజు | పైప్స్ :3 |
| 16 | 114/1/2/P | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.03 3/4 | సున్నం మునెమ్మ W/O ఎర్రప్ప (పట్టా దారు) | సున్నం మునెమ్మ W/O ఎర్రప్ప | సున్నం మునెమ్మ W/O ఎర్రప్ప | సున్నం కాంతమ్మ W/O నాగేశ్ | కట్టం బక్కులు S/O బోడప్ప | |
| 17 | 114/1/2/Q | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.07 1/2 | సున్నం కాంతమ్మ W/O నగేశ్ (పట్టా దారు) | సున్నం కాంతమ్మ W/O నాగేశ్ | సున్నం కాంతమ్మ W/O నాగేశ్ | చీదర సుగుణ W/O బాలరాజు | సున్నం మునెమ్మ W/O ఎర్రప్ప | పైప్స్ :5 |
| 18 | 114/1/2/R | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.01 1/2 | సున్నం తులశమ్మ W/O ముత్యాలు (ఆక్రమణ) | సున్నం రాజమ్మ W/O నాగేశ్ | చీదర సుగుణ W/O బాలరాజు | సున్నం తులశమ్మ W/O ముత్యాలు | సున్నం కాంతమ్మ W/O నాగేశ్ | -- |
| 19 | 114/1/2/S | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.00 1/2 | చీదర సుగుణ W/O బాలరాజు (ఆక్రమణ) | సున్నం తులమ్మ W/O ముత్యాలు | చీదర సుగుణ W/O బాలరాజు | సున్నం తులశమ్మ W/O ముత్యాలు | సున్నం కాంతమ్మ W/O నాగేశ్ | -- |
| 20 | 114/1/2/T | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.12 1/4 | సున్నం రాజమ్మ W/O నగేశ్ (ఆక్రమణ) | సున్నం తులశమ్మ W/O ముత్యాలు | తెల్లం వీరస్వామి S/O గంగులు | సున్నం రాజమ్మ W/O నాగేశ్ | సున్నం కాంతమ్మ W/O నాగేశ్ | పైప్స్ : 40 |
| 21 | 114/1/2/U | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.11 1/2 | తెల్లం వీర స్వామి S/O గంగులు (ఆక్రమణ) | తెల్లం వీరస్వామి S/O గంగులు | తెల్లం వీరస్వామి S/O గంగులు | సున్నం చుక్కమ్మ W/O నాగేశ్ & సోయాం వెంకటమ్మ W/O రాజులు | సున్నం రాజమ్మ W/O నాగేశ్ | -- |
| 22 | 114/1/2/V | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.00 3/4 | సున్నం చుక్కమ్మ W/O నాగేశ్ (పట్టా దారు) | సోయాం వెంకటమ్మ W/O రాజులు | సున్నం చుక్కమ్మ W/O నాగేశ్ | సున్నం చుక్కమ్మ W/O నాగేశ్ | తెల్లం వీరస్వామి S/O గంగులు | పైప్స్ : 4 |
| 23 | 114/1/2/W | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.09 1/2 | సోయాం వెంకటమ్మ W/O రాజులు (పట్టా దారు) | కుంజా నాగేంద్రమ్మ W/O రాముడు | సోయాం వెంకటమ్మ W/O రాజులు | సోయాం వెంకటమ్మ W/O రాజులు | తెల్లం వీర స్వామి S/O గంగులు | పైప్స్ : 6 |
| 24 | 114/1/2/X | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.05 | కుంజా నాగేంద్రమ్మ W/O రాముడు (పట్టా దారు) | కుంజా నాగేంద్రమ్మ W/O రాముడు | సోయా వెంకటమ్మ W/O రాజులు | మాడివి చిన్న అమ్మాయి W/O రాజు | కుంజా నాగేంద్రమ్మ W/O రాముడు | పైప్స్ : 4 |
| 25 | 114/1/2/Y | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.00 3/4 | మాడివి చిన్న అమ్మాయి W/O రాజు (పట్టా దారు) | మాడివి చిన్న అమ్మాయి W/O రాజు | కుంజా నాగేంద్రమ్మ W/O రాముడు | పొట్ట పద్మ W/O పోతురాజు | మాడివి చిన్న అమ్మాయి W/O రాజు | తునికి చెట్టు :1 పైప్స్ :5 |
| 26 | 114/1 12/Z | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.04 | వాగు | వాగు | వాగు | సున్నం పోతమ్మ W/O ముయ్యా & సున్నం వీరస్వామి S/O రాజులు | సున్నం కృష్ణ వేణి W/O కృష్ణ & సున్నం రాజు S/O వీర స్వామి | -- |
| మొత్తం : 3.29 1/2 | | | | | | | | | | |
| 27 | 22/1/2/A | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.01 1/2 | పొట్ట పద్మ W/O పోతురాజు (పట్టా దారు) | సున్నం మలప్ప W/O రాజులు | పొట్టపద్మ W/O పోతురాజు | కాలువ | పాండా పద్మ W/O పోతురాజు | పైప్స్ : 4 |
| 28 | 22/1/2/B | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.01 1/2 | సున్నం మలప్ప W/O రాజులు (పట్టా దారు) | సున్నం మలప్ప W/O రాజులు | పొట్టపద్మ W/O పోతురాజు | కాలువ | పొట్ట పద్మ W/O పోతురాజు | ఈప : 3 |
| 29 | 22/1/2/C | ఎస్సైన్మెంట్ | మాగాణి | 0.09 1/2 | ఇండ్ల తులశమ్మ W/O కృష్ణయ్య (పట్టా దారు) | కాలువ | ఇండ్ల తులశమ్మ W/O కృష్ణయ్య | కాలువ | ఇండ్ల తులశమ్మ W/O కృష్ణయ్య | -- |
| మొత్తం : 0.13 1/2 | | | | | | | | | | |
| మొత్తం విస్తీర్ణం : 4.03 | | | | | | | | | | |

సెక్షన్ 15) చట్టము ప్రకారము చట్టము 30/2013 క్రింద పై భూసేకరణపై వచ్చిన అభ్యంతరములకు గాను సంబంధిత సమాచారమును సంబంధిత వారికి తెలియచేసి వున్నాము.

ఈ చట్టము ప్రకారము జారీ చేయనైనది (డిక్లరేషన్) కావున ఇట్టి తుది ప్రకటనభూ నిర్వాసితులు అవుతున్న కుటుంభీకులకు భూ సేకరణ పునరుపాదిపునరావాస కల్పనకుగాను తదుపరి ఖమ్మం గారి ద్వారా నియమించబడిన పునరావాస మరియు, ప్రతిపాదనలు శ్రీయుత జిల్లా కలెక్టరు కల్లూరు గారి ద్వారా పునరుపాది అధికారి మరియు శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి జరుపబడును.

భూసేకరణ తలపెట్టిన ఆ భూమిలో బొగ్గుస్లేట్ మరియు ఖనిజములు ఇట్టి, ఇనుము భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్టు నిర్మాణమునకు లేనిచో స్వీకరించబడవు, ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయపు పని వేళలో జిల్లా కలెక్టరు /ఖమ్మం మరియు భూ సేకరణ అధికారి, సబ్, కలెక్టర్-కల్లూరు వారి కార్యాలయములో పరిశీలించుకోను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- సబ్ కలెక్టర్, కల్లూరు — సం/- అదనపు కలెక్టర్, ఖమ్మం జిల్లా — సం/- జిల్లా కలెక్టర్, ఖమ్మం

DIPR RO NO. 587/LA/PP/Advt/Pub/2026-27

## రెడ్‌క్రాస్ ప్రతినిధితో సూకీ సమావేశం



**బ్యాంకాక్:** మయన్మార్ మాజీ ప్రజాస్వామ్య నాయకురాలు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత ఆంగ్ సాన్ సూకీకి చాలా కాలం తర్వాత బయటి ప్రపంచంతో అరుదైన సంప్రదింపు అవకాశం లభించింది. 2021లో సైన్యం అధికారాన్ని స్వాధీనం చేసుకుని ఆమెను నిర్బంధించిన తర్వాత, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ (ఐసిఆర్‌సి) ప్రతినిధి ఆర్నో డి బెక్ ఆమెను సోమవారం కలిసి వ్యక్తిగతంగా మాట్లాడారు. ఈ విషయాన్ని మయన్మార్ సైనిక మద్దతు ఉన్న ప్రభుత్వం, అలాగే ఐసిఆర్‌సి ధ్రువీకరించాయి. అయితే ఈ సమావేశం ఎక్కడ జరిగింది, ఏ అంశాలపై చర్చించారు అనే వివరాలను వెల్లడించలేదు. ప్రభుత్వం విడుదల చేసిన చిత్రాల్లో సూకీ చిరునవ్వుతో కనిపించారు. ఆమె 81వ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యాలు కూడా ఉన్నాయి. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఈ చిత్రాల ఆధారంగా స్పష్టమైన నిర్ధారణకు అవకాశం లేదని పరిశీలకులు భావిస్తున్నారు. ఇటీవల మయన్మార్ రాజకీయ సంక్షోభ పరిష్కారం కోసం సూకీతో సంప్రదింపులు జరపాలని ఆసియాన్ సభ్య దేశాలతో పాటు అనేక దేశాలు కోరుతున్నాయి. లండన్‌లో నివసిస్తున్న ఆమె కుమారుడు కిమ్ అరిస్ ఈ సమావేశాన్ని స్వాగతిస్తూ, తన తల్లి క్షేమానికి ఇది తొలి సానుకూల సంకేతమని వ్యాఖ్యానించారు. మరోవైపు ప్రతిపక్ష జాతీయ ఐక్య ప్రభుత్వం మాత్రం ఈ భేటీని ప్రజాస్వామ్య పునరుద్ధరణకు సూచనగా మారదని, ఎలాంటి షరతులు లేకుండా సూకీతో పాటు రాజకీయ ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

# డాన్యూబ్ నదిలో తగ్గిన నీటిమట్టం




**బుడాపెస్ట్:** యూరప్‌లోని అత్యంత ముఖ్యమైన నదుల్లో ఒకటైన డాన్యూబ్‌లో నీటిమట్టం ఎన్నడూ లేనంతగా పడిపోవడంతో మధ్య, తూర్పు యూరప్ దేశాలు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితికి చేరుకున్నాయి. తీవ్ర కరువు, వరుసగా సంభవిస్తున్న వేడి గాలుల కారణంగా నదిలో నీటి ప్రవాహం గణనీయంగా తగ్గింది. హంగేరీ రాజధాని బుడాపెస్ట్ వద్ద డాన్యూబ్ నీటిమట్టం సోమవారం కేవలం 10 సెంటీమీటర్లకు పడిపోయింది. 2018లో నమోదైన 33 సెంటీమీటర్ల కనిష్ట స్థాయి కంటే ఇది చాలా తక్కువ. డాన్యూబ్ నీటిని శీతలీకరణ కోసం ఉపయోగించే హంగేరీకి చెందిన ఏకైక అణు విద్యుత్ కేంద్రం 'పాక్స్' మూతపడే ప్రమాదంలో పడింది. ఈ ప్లాంట్ దేశ విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు సగం వాటాను అందిస్తుంది. సాధారణంగా 2,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ఈ కేంద్రం ప్రస్తుతం కేవలం 240 మెగావాట్లకు పరిమితమైంది. నాలుగు రియాక్టర్ల సామర్థ్యాన్ని వరుసగా తగ్గించాల్సి వచ్చింది. పూర్తి గా మూసివేతను తాత్కాలికంగా నివారించినప్పటికీ, పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. విద్యుత్ కొరతను ఎదుర్కొనేందుకు హంగేరీ ప్రభుత్వం పరిశ్రమలు, గృహ వినియోగదారులను విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని కోరింది. ముఖ్యంగా సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు గరిష్ట డిమాండ్ సమయంలో పొదుపు చర్యలు చేపట్టాలని సూచించింది. విద్యుత్ రైళ్ల రాకపోకలను కూడా పరిమితం చేసింది. పొరుగు దేశాలైన సెర్బియా, రుమేనియాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సెర్బియాలో డాన్యూబ్ నీటిమట్టం తగ్గడంతో కీలక జలవిద్యుత్ కేంద్రం కేవలం 20 శాతం సామర్థ్యంతో పనిచేస్తోంది. రొమేనియాలో చెర్నవోదా అణు విద్యుత్ కేంద్రంలో భద్రతా కారణాలతో ఒక రియాక్టర్‌ను నిలిపివేశారు. డాన్యూబ్ నీటి కొరత విద్యుత్ ఉత్పత్తిపైనే కాకుండా నదీ రవాణా, వ్యవసాయ రంగాలపై కూడా ప్రభావం చూపుతోంది. వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న కరువు, తీవ్రమైన ఉష్ణోగ్రతలు యూరప్‌లో ఇంధన భద్రతకు కొత్త సవాళ్లను సృష్టిస్తున్నాయని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

## నౌరు పేరు నయోరోగా మార్పు

**వెల్లింగ్టన్:** ప్రపంచంలో జనాభా పరంగా మూడో అతి చిన్న దేశమైన నౌరు తన పేరును అధికారికంగా 'రిపబ్లిక్ ఆఫ్ నయోరో'గా మార్చుకుంది. ఈ పేరు ఆ దేశ స్థానిక భాషలోని అసలు ఉచ్చారణ, సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుంది. ఇకపై దేశ అంతర్జాతీయ కోడ్ 'ఎన్ఆర్‌యు' స్థానంలో 'ఎన్ఆర్ఒ'గా మారనుండగా, ప్రజలను 'నౌరువన్' బదులుగా 'డెయినయోరో' అని పిలుస్తారు. 1968లో స్వాతంత్ర్యం పొందిన ఈ పసిఫిక్ ద్వీపదేశం వలస పాలన కాలంలో విదేశీయుల సౌలభ్యం కోసం 'నౌరు' పేరుతో ప్రసిద్ధి చెందింది. ఇప్పుడు సాంస్కృతిక గుర్తింపు, భాషా వారసత్వాన్ని గౌరవించాలనే ఉద్దేశంతో అసలు పేరును పునరుద్ధరించింది. ఈ మార్పును ఇప్పటికే ఐక్యరాజ్యసమితి సహా పలు దేశాలు తమ అధికారిక రికార్డుల్లో అమలు చేశాయి.



## ఉక్రేన్‌పై రష్యా భారీ దాడి



**కీవ్:** రష్యా దక్షిణ ఉక్రేన్‌లోని జపోరిజ్జియా నగరంపై 90 నిమిషాల వ్యవధిలో ఎనిమిది గ్లైడ్ బాంబులతో భారీ దాడి చేసింది. ఈ దాడిలో 71 ఏళ్ల మహిళ మరణించగా, ఒక 16 ఏళ్ల బాలికతో సహా 31 మంది గాయపడ్డారు. నగరంలోని నాలుగు ప్రాంతాల్లో 22 అపార్ట్‌మెంట్ భవనాలు దెబ్బతిన్నాయి. గ్లైడ్ బాంబులు అత్యంత శక్తివంతమైన పేలుడు సామర్థ్యం కలిగి ఉండటంతో వాటిని అడ్డుకోవడం ఉక్రేన్‌కు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ అమెరికా తయారు చేసిన 'పేట్రియాట్' వైమానిక రక్షణ వ్యవస్థలను మరింత అందించాలని మిత్రదేశాలను మరోసారి కోరారు. ఇదే సమయంలో ఇరుదేశాలు డ్రోన్ల దాడులను కూడా కొనసాగించాయి.

## కార్చిచ్చు అదుపు కోసం ముమ్మర ప్రయత్నాలు



**ఏథెన్స్:** గ్రీస్ రాజధాని ఏథెన్స్‌కు పశ్చిమాన చెలరేగిన భారీ కార్చిచ్చును అదుపు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ఐదు విమానాలు, మరో ఐదు హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. మంటలపై వీటి ద్వారా నీటిని చల్లుతున్నారు. మరోవైపు దాదాపు 500 మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. కాగా, ఆదివారం రెండు అగ్నిమాపక హెలికాప్టర్లు గాల్లోనే ఢీకొనడంతో ఒక గ్రీకు, ఒక డెన్మార్క్ సిబ్బంది మరణించిన విషయం తెలిసిందే. మరో హెలికాప్టర్‌లో ఉన్న గ్రీకు, బ్రిటిష్ సిబ్బంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన ఐరోపాలో అడవి మంటలను అదుపు చేసే సిబ్బంది ఎదుర్కొనే ప్రమాదాల తీవ్రతను మరోసారి గుర్తుచేసింది. శుక్రవారం ప్రారంభమైన ఈ అగ్నిప్రమాదం బలమైన గాలుల కారణంగా వేగంగా వ్యాపించింది. గాలుల తీవ్రత వల్ల నీటిని చిమ్మే విమానాల కార్యకలాపాలు కూడా పలుమార్లు నిలిచిపోయాయి. అయితే సోమవారం గాలుల వేగం తగ్గడంతో మంటల వ్యాప్తిని అడ్డుకునే అవకాశాలు మెరుగుపడ్డాయని అధికారులు భావిస్తున్నారు. అయినప్పటికీ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉండటంతో ఏథెన్స్ పరిసర అట్టికా ప్రాంతంలో అడవి మంటల ముప్పు ఇంకా కొనసాగుతోందని హెచ్చరించారు. ఈ ప్రమాదం కారణంగా వేలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. విద్యుత్ ప్రసార వ్యవస్థలో లోపభూయిష్టమైన తీగల నుంచి వచ్చిన నిప్పురవ్వలే ఈ అగ్నిప్రమాదానికి కారణమై ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో విద్యుత్ ప్రాజెక్టును పర్యవేక్షించిన ఇంజనీర్, నిర్మాణ కాంట్రాక్టర్‌ను అరెస్టు చేయగా, విండ్ జనరేటర్ సంస్థ యజమానిపై కూడా అరెస్టు వారెంట్ జారీ చేశారు. ఇదిలా ఉండగా, ఫ్రాన్స్‌లో కూడా భారీ అడవి మంటలు పూర్తిగా ఆరిపోకపోయినా అదుపులోకి వచ్చాయి. సుమారు 2.24 లక్షల మంది తమ ఇళ్లను ఖాళీ చేయాల్సి వచ్చింది. ఫ్రాన్స్, స్పెయిన్‌లలోని అగ్నిప్రమాదాల కారణంగా మొత్తం మూడు లక్షల మందికి పైగా ప్రజలు నిర్వాసితులయ్యారు. దీంతో ఐరోపా అత్యవసర సేవలపై తీవ్ర ఒత్తిడి నెలకొంది.

## ఆత్మాహుతి దాడి ఘటనలో మరో ముగ్గురు మృతి

**పెషావర్:** వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో శాంతి ర్యాలీ సందర్భంగా జరిగిన ఆత్మాహుతి దాడిలో మరణించిన వారి సంఖ్య 17కు చేరింది. గాయపడిన మరో ముగ్గురు సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో మృతుల సంఖ్య పెరిగిందని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఏడుగురు పోలీసు సిబ్బంది, పది మంది పౌరులు ఉన్నారు. ఇంకా 12 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం స్వాత్ జిల్లాలోని కబాల్ పట్టణంలో 'స్వాత్ పీస్ ర్యాలీ' కొనసాగుతున్న సమయంలో, పోలీస్ స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద ఈ దాడి జరిగిన విషయం తెలిసిందే. నిషేధిత 'తెహ్రీక్–ఎ–తాలిబాన్ పాకిస్థాన్' (టిటిపి)కి చెందిన ఆత్మాహుతి దాడి చేసిన వ్యక్తి పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా, విధుల్లో ఉన్న పోలీసులు అతడిని అడ్డుకున్నారు. దీంతో అతడు ప్రధాన గేటు వద్దే తన వద్ద ఉన్న పేలుడు పదార్థాలను పేల్చుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఉగ్రవాద నిరోధక చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రారంభ విచారణలో టిటిపి కమాండర్ ముజఫర్, అతని అనుచరుల ప్రమేయం ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా ఈ దాడికి బాధ్యత వహించలేదు. శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆరోపిస్తూ, ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో స్థానిక గిరిజన మండలి ఈ శాంతి ర్యాలీని నిర్వహించింది. ఈ నేపథ్యంలో జరిగిన ఆత్మాహుతి దాడి పాకిస్థాన్‌లో భద్రతా పరిస్థితులపై మరోసారి ఆందోళనలను పెంచింది.



## చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి పేద, నిరుపేద, గృహరహిత కుటుంబానికి కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇతర పేద కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేసి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి వెంటనే అమలు ప్రారంభించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని మారుపాక అనిల్ కుమార్ హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, పెద్దసంఖ్యలో దళితులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదా లు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు ఉష్రశీ, రాష్ట్ర నాయకులు జేరిపోతుల కుమారస్వామి, జిల్లా కార్యదర్శి కొమురెల్లి బాబు, వంశీ, శ్రీనాథ్, రాజయ్య తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మీ సేవల బలోపేతానికి కార్యాచరణ..

### రూ.2,000 కోట్ల డిజిటల్ పెట్టుబడులకు ప్రపంచ బ్యాంక్ ఆసక్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన డిజిటల్ సేవలు అందించేందుకు మీ సేవ కేంద్రాలను ఆధునీకరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ప్రపంచ బ్యాంక్ సహకారంతో డిజిటల్ గవర్నెన్స్, కృత్రిమ మేధస్సు , సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ), డేటా సెంటర్ల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా తెలంగాణలో డిజిటల్ రంగంలో సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడులకు ప్రపంచ బ్యాంక్ ఆసక్తి వ్యక్తం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం ప్రపంచ బ్యాంక్ డిజిటల్–ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మావేశమయ్యారు. డిజిటల్ ఇండియా–వికసిత్ భారత్–2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల బలోపేతం, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు, ఎఐ వినియోగం, సైబర్ భద్రత, డిపిఐ విస్తరణ, యువతకు ఐటి ఆధారిత ఉపాధి అవకాశాల పెంపుపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ గవర్నెన్స్ సంస్కరణలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు. డిజిటల్ సామర్థ్యాల పెంపు, డేటా గవర్నెన్స్, ప్రజా సేవల నాణ్యత మెరుగుదల, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంలో ప్రపంచ బ్యాంక్ సాంకేతిక సహకారం, జ్ఞాన భాగస్వామ్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డిజిటల్ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ, హర్యానా రాష్ట్రాలు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డిపిఆర్‌లు) సిద్ధం చేసి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అనంతరం టిఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవల విస్తరణపై అధికారులతో చర్చించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, టిఫైబర్ ఎండీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెరుపులు..

(మొదటి పేజీ తరువాయి)

జగిత్యాల, పెద్దప ల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుము లు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అ వకాశం ఉందన్నారు. ఈ ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముండటంతో ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. హైదరాబాద్ నగరంలో కూడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందని చెప్పారు. మంగళవారం నుంచి శనివారం వరకు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నాయన్నారు. ఈ కాలంలోనూ అన్ని జిల్లాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. శనివారం నుంచి సోమవారం వరకు వర్షాల తీవ్రత కొంత తగ్గి, కొన్నిచోట్ల మాత్రమే వర్షాలు కురిసే అవకాశమున్నప్పటికీ బలమైన ఉపరితల గాలులు కొనసాగుతాయని తెలిపారు. వర్షాలు, ఉరుములు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతా ల్లో ఆశ్రయం పొందాలని సూచించారు.

**ఎల్లో హెచ్చరికలు జారీ చేసిన జిల్లాలు..**

పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం అధికారులు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలు ఉన్నాయి.

## రుణం తీర్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)

వనరులను సద్వినియోగం చేస్తూ పాలన సాగుతోందని పెట్టుబడులకు, పరిశ్రమలకు అత్యంత అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం వేగంగా దూసుకెళ్తోందని చెప్పారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరానికి మణిహారంగా ఉన్న 56 కిలోమీటర్ల మూసీ నదిని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో సుందరీకరిస్తున్నామని, స్వచ్ఛమైన నీరు పారేలా ప్రక్షాళన చేసి నగర రూపురేఖలు మార్చబోతున్నామని వెల్లడించారు. ఇలాంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ బృహత్తర యజ్ఞంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని, ఏ మూలాల నుంచి వచ్చారో ఆ మూలాలను మర్చిపోకుండా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఎన్నారైల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన ప్రత్యేక వ్యవస్థ :**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులు (ఎన్నారైలు), తెలంగాణలో ఉంటున్న వారి తల్లిదండ్రుల సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధత (లీగల్ స్టేటస్) కలిగిన ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే అంశం ప్రభుత్వ ఆలోచనలో ఉందన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ప్రవాసులు.. తమ సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేక వేదిక కావాలని ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంపై ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రపంచంలో ఎక్కడున్న తెలంగాణ వాసులైనా తమ ఇబ్బందులను, రాష్ట్రంలో ఉంటున్న తమ తమ తల్లిదండ్రుల సమస్యలను ఈ ప్రత్యేక వ్యవస్థ దృష్టికి తీసుకొస్తే.. వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ కొనసాగుతోందని ప్రవాసులకు గుర్తుచేశారు. తెలంగాణ పౌరులు ప్రపంచంలో ఏ నలుమూలల ఉన్నా.. ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా తమ ఓటుహక్కును నమోదు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉందన్నారు. ప్రవాసులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

నోడల్ అధికారులను నియమించి, ఏడు రోజుల్లో అన్ని రికార్డులను సమీకరించాలని ఆదేశించారు. 30 రోజుల్లో పర్యావరణ అధ్యయనాలు, అనుసరణ నివేదికలు, భూసంబంధిత పత్రాలు సిద్ధం చేయాలని, 60 రోజుల్లో ప్రధాన పరిపాలనా ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి వారం పురోగతి నివేదికలు సమర్పించి, నెలనెలా ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను వెంటనే పూర్తి స్థాయిలో పని చేసేలా సిద్ధం చేయాలని , కాలువల పరిశీలన, మరమ్మతులు, నీటి ప్రవాహానికి అడ్డంకుల తొలగింపు, అవసరమైన వంతెనలు, రహదారి క్రాసింగ్‌ల పనుల అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రధాన కాలువల ద్వారా త్వరితగతిన నీరు విడుదలయ్యేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అధ్యయనాలు, డాక్యుమెంటేషన్‌ను వెంటనే పూర్తి చేసి, అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేలా ఇంజినీరింగ్ ప్రణాళికలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పాలమూరురంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల అనుమతుల అంశంలో ఇదే స్థాయిలో అత్యవసర చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యావరణ అనుమతులకు సంబంధించిన అన్ని కేసుల్లో రాష్ట్ర న్యాయవాదులు, అదనపు అడ్వకేట్ జనరల్‌తో సమన్వయం చేసుకుని బలమైన వాదనలు వినిపించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక నివేదికలు, పర్యావరణ పత్రాలు, కౌంటర్ అఫిడవిట్‌లు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతో తెలంగాణలో ముంపుకు గురయ్యే భూములు, గ్రామాలు, మౌలిక వసతులపై శాస్త్రీయ అధ్యయనాలను వేగవంతం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. విశ్వసనీయ సాంకేతిక ఆధారాలతో రాష్ట్ర వాదనను కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముందు బలంగా వినిపించాలని తెలిపారు.

**పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి ఖమ్మం జిల్లాపై పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, భూములు, మౌలిక వసతుల నష్టానికి కేంద్రం నుంచి తగిన పరిహారం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఖమ్మం జిల్లా గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ మల్టీపర్పస్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సీతమ్మసాగర్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి నూతన ఉత్తేజం వస్తుందని, నీటి కష్టాలు తీరుతాయని తెలిపారు.

## అమిత్‌షా ఎందుకు రారు?

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలు మూడవ వారంలోకి ప్రవేశిస్తున్నప్పటికీ, శాంతియుత నిరసనకారులపై జరిగిన క్రూరమైన దాడిపై అమిత్ షా తన పిరికి మౌనాన్ని వీడి పార్లమెంటుకు సమాధానం ఇస్తారని మేము ఇంకా ఎదురుచూస్తున్నాము' అని అన్నారు. అందులో పాలుపంచుకున్న ఉన్నత స్థాయి వ్యక్తులను కాపాడటానికి, రామ మందిరంలో జరిగిన 'చందా చోరీ' విషయంలో కూడా ఈ ప్రభుత్వం మౌనం పాటిస్తోందని ఆయన ఎక్స్‌లో అన్నారు. ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టే వరకు పార్లమెంటు బయట, ఉభయ సభలలో తమ నిరసనలు కొనసాగుతాయన్నారు. రామ మందిరంలో విరాళాల చోరీ ఆరోపణలు, గత వారం విద్యార్థుల నిరసనల సందర్భంగా వారిపై క్రూరమైన బలప్రయోగం వంటి అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని ఇండియా కూటమి సభ్యులు ప్రతినబూనారు.

**విరాళాల చోరీపై ప్రధాని కూడా సమాధానం చెప్పాలి : ఖర్గే**

అంతకు ముందు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని తన ఛాంబర్‌లో ఇండియా కూటమి పార్టీల ఫ్లోర్ లీడర్లతో రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే సమావేశం నిర్వహించారు. నిరసన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్–పెల్లెట్ గన్ చర్యపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి వివరణ ఇవ్వాలని ఖర్గే డిమాండ్ చేశారు. రామ మందిరానికి వచ్చిన విరాళాలను ఎలా దొంగిలించారో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం భారత్‌కు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. 'ప్రధాన మంత్రి పర్యవేక్షణలో ట్రస్ట్ ఉన్నప్పటికీ, శ్రీరామ మందిరానికి విరాళంగా ఇచ్చిన నిధులు ఎలా చోరీకి గురయ్యాయో ప్రధానమంత్రి సమాధానం చెప్పాల్సిందే నన్నారు. ఖర్గేతో పాటు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరామ్ రమేశ్, కె.సి. వేణుగోపాల్, ఎస్‌పికి చెందిన ధర్మేంద్ర యాదవ్, టిఎంసికి చెందిన మహువా మొయిత్రా, సాగరిక ఘోష్, ఎన్‌సిపి (ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, శివసేన (యుబిటి)కి చెందిన సంజయ్ రౌత్, అరవింద్ గాంధీ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేయగా, సమావేశంలో సావంత్, జెఎంఎంకు చెందిన మహువా మాఝీ, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్, సిపిఐకి చెందిన పి. సందోష్ కుమార్, ఆర్ఎస్‌పికి చెందిన ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## 10న జైల్ భరో

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌కెఎం నేతలు పిలుపునిచ్చారు. రైతుల హక్కుల సాధన కోసం 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో నిర్వహిస్తున్న శాంతియుత కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌కెఎం కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, కోకన్వీనర్లు జగ్గుల వెంకటయ్య, భాస్కర్, విజయ్, తుకారాం, చంద్రారెడ్డి, సంధ్య దేవ భక్తుని, డి.జి.నరేంద్ర ప్రసాద్‌లు జైల్‌భరో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. పశ్య పద్మ మాట్లాడుతూ 7 ప్రధాన డిమాండ్లతో ఈనెల 10 వ తేదీన జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పా రు. విదేశాలతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు , స్వామినాథన్ సిపార్సు మేరకు కనీస మద్దతు ధర అమలు, రైతు రుణవిమోచన చట్టం, 2013 చట్టం ప్రకారమే భూసేకరణ సేకరణ, 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనుల భూ హక్కులను రక్షణ , విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును ఉపసంహరణ, 4 లేబర్ కోడ్లు, సీడ్ బిల్–2025, జాతీయ ఆహార భద్రత చట్ట సవరణ బిల్లును రద్దు సాధనే లక్ష్యంగా దేశవ్యాప్తంగా వెయ్యి కేంద్రాల్లో జైల్ భరో, రైల్ రోకో, రోడ్ రోకో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు జిల్లా, మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న జైల్ భరో కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తు న పాల్గొన్ని విజయవంత చేయాలని కోరారు. టి.సాగర్ మాట్లాడుతూరైతు రుణమాఫీ, రుణ విమోచన చట్టం అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని, కార్పొరేట్ సంస్థలకు మాత్రం లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేస్తోందని విమర్శించారు. జక్కుల వెంకటయ్య మాట్లాడుతూ రైతులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తుకు దరాదత్తం చేసేందుకు అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాన్ని తీసుకువచ్చిందన్నారు. భాస్కర్, విజయ్, తుకారాం, చంద్రారెడ్డిలు మాట్లాడుతూ దేశంలో 145 కోట్లమంది ప్రజలకు అన్నం పెడుతున్న రైతులను రక్షించుకోకపోతే దేశ ఆహార భద్రతకు ప్రమాదంలో పడనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా గళమెత్తి అన్నదాతలకు అండగా నిలవాలని కోరారు.

## టిఎన్ఎ హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల తెలంగాణ ప్రభుత్వ నర్సస్ అసోసియేషన్(టిఎన్ఎ) హర్షం వ్యక్తం చేసింది. ఇందుకు సిఎం రేవంత్‌రెడ్డికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపింది. 13 వేలకు పైగా ఉన్న క్లినికల్ నర్సింగ్ ఆఫీసర్లకు డైరెక్టరేట్‌లో సముచిత స్థానం కల్పించాలని, వారి సంఖ్య, అర్హతలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని పరిపాలనా పోస్టులను టిఎన్ఎ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

# కామన్వెల్త్‌లో భారత్ అదరహో




ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్లో టాప్5 లక్ష్యంగా బరిలోకి దిగిన భారత్.. అనుకున్నది సాధించింది. గతంతో పోలిస్తే భారత్‌కు పతకాలు లభించే రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టెన్నిస్ వంటి క్రీడలను ఈసారి తొలగించినా టోర్నీలో ఆడించిన ఆటల్లోనే మన క్రీడాకారులు సత్తాచాటి పతకాల పట్టికలో దేశాన్ని నాలుగో స్థానంలో నిలిపారు. ముఖ్యంగా బాక్సర్లు అంచనాలకు మించి పసిడి పంచ్లు విసిరి గ్లాస్గోలో స్వర్ణ చరిత్ర లిఖించగా అథ్లెట్లు మునుపెన్నడూ లేని రికార్డులను తిరగరాస్తూ పతకాల మోత మోగించారు. బాక్సర్లు, వెయిట్ లిఫ్టర్లు, అథ్లెట్లు మెరవడంతో ఈ టోర్నీలో భారత్ 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలతో మొత్తంగా 39 పతకాలు సాధించి నాలుగో స్థానంతో టోర్నీని ముగించింది. ఆస్ట్రేలియా అగ్రస్థానాన ఉండగా ఇంగ్లండ్, కెనడా.. భారత్ కంటే ముందున్నాయి. ఈ క్రీడల తర్వాతి ఎడిషన్ (2030)కు భారత్‌లోని అహ్మదాబాద్ నగరం ఆతిథ్యమివ్వనుంది.

**బాక్సర్ల పసిడి పంట...** ఈసారి దేశానికి పసిడి కాంతులు పంచడంలో బాక్సర్లదే హవా. పలు క్యాటగిరీల్లో పదిమంది బాక్సర్లు ఫైనల్స్కు అర్హత సాధిస్తే వారిలో ఏకంగా ఏడుగురు పసిడి పంచ్లు విసరగా ముగ్గురు రజతాలతో మెరిశారు. ముఖ్యంగా అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు దుమ్మురేపారు. ఏడు స్వర్ణాల్లో ఐదుగురు (ప్రీతి పవార్, సాక్షి చౌదరి, ప్రియాఘంఘాస్, అరుంధతి చౌదరి, జైస్మీన్ లంబోరియా) వారివే కాగా ఇద్దరే అబ్బాయిలు (సచిన్, అంకుశ్) గోల్ గెలిచారు. బాక్సర్ల కంటే ముందు రెజ్లర్లు సత్తాచాటి 8 మెడల్స్ గెలుచుకున్నారు. వీరిలో మీరాబాయి స్వర్ణం సాధించగా జ్ఞానేశ్వరి, హర్జీందర్, రిషికంత, అజయ్ బాబు, లవ్ప్రీత్ రజతాలతో మెరిశారు.

**జుడోకాల స్వర్ణ చరిత్ర...** ఈక్రీడల చరిత్రలో స్వర్ణం గెలువని జుడోకాలు ఈసారి అ'ద్వితీయ' ప్రదర్శనతో రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. డోపింగ్ తంటాలు, లగేజీ సమస్యలతోసతమతమైనా యువ జుడోకాలు అస్మిత, హర్ష్‌సింగ్ గోల్ మెడల్స్‌ల కొత్త చరిత్ర సృష్టించారు. యామిని రజతంతో మెరవగా ఉన్నతి కాంస్యం సాధించింది.

**అథ్లెట్ల జోరు..** అథ్లెటిక్స్లో భారత్ ఈసారి 9 పతకాలు గెలుచుకుంది. పదివేల మీటర్ల పరుగు పందెంలో గుల్వీర్ సింగ్ దేశానికి తొలిసారి (రజతం) పతకం అందించగా అతడే.. 5వేల మీటర్ల రేసులోనూ కాంస్యం గెలిచి సీడబ్ల్యూజీలో రెండు మెడల్స్ గెలిచిన ఫస్ట్ ట్రాక్ అథ్లెట్(భారత్)గా రికార్డులకెక్కాడు. తేజస్వినీ శంకర్ డెకథ్లాన్లో దేశానికి తొలి పతకాన్ని తీసుకొచ్చాడు. జావెలిన్ త్రో అంటేనే దేశానికి గుర్తొచ్చే నీరజ్ చోప్రాతో పాటు భారత్లో కొత్త అథ్లెట్ దూసుకొచ్చాడు. యశ్వీర్ సింగ్ కాంస్యం గెలిచి భవిష్యత్ ఆశాకిరణంలా కనబడుతున్నాడు. పారా అథ్లెట్ల విషయానికొస్తే షాట్పుటర్ షర్మిల ధనకర్ (ఎఫ్57) పారా క్రీడల్లో తొలి స్వర్ణాన్ని దేశానికి అందించింది. ఇక పురుషుల వంద మీటర్ల టీ47 ఈవెంట్లో దిలీప్ గవిత్.. 10.71 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి సీడబ్ల్యూజీలో కొత్త రికార్డు నెలకొల్పాడు.

**ఆఖరి రోజు పతకాల్లేకుండానే..** ఆటల ఆఖరి రోజైన ఆదివారం భారత్కు పతకాలేమీ రాలేదు. జూడోలో భారత్ ఆశలు పెట్టుకున్న ఇష్రూప్ (మహిళల 78 కిలోలు).. బ్రాంజ్ మెడల్కు అర్హత సాధించినా ఆ పోరులో నెగ్గలేకపోయింది. పురుషుల 100 కిలోల విభాగంలో అవతార్ సింగ్, యశ్ ఘంఘాస్ రౌండ్ ఆఫ్16లోనే ఇంటిబాట పట్టారు. ట్రాక్ సైక్లింగ్లో భాగంగా మెన్స్ 1000 మీటర్ల టైమ్ ట్రయల్లో రొనాల్డోతో పాటు పారా సైకిలిస్ట్ లిషా దాస్ సైతం నిరాశపరిచారు

# రహానే రిటైర్మెంట్‌తో క్రికెట్‌లో మొదలైన చర్చ..

టీమిండియా మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో భారత క్రికెట్‌లో కొత్త చర్చ మొదలైంది. గత కొన్నేళ్లుగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న రహానే, ఇకపై అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ నిర్ణయం తర్వాత జట్టుకు దూరంగా ఉన్న మరికొందరు సీనియర్ ఆటగాళ్లు కూడా త్వరలోనే రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఒకప్పుడు భారత టెస్ట్ జట్టుకు కీలక బ్యాటర్గా, వైస్ కెప్టెన్గా సేవలందించిన అజింక్య రహానే గత మూడేళ్లుగా జాతీయ జట్టులో స్థానం దక్కించుకోలేకపోయాడు. దేశవాళీ క్రికెట్లో నిలకడగా రాణించినప్పటికీ సెలెక్టర్లు అవకాశాలు ఇవ్వకపోవడంతో చివరికి అంతర్జాతీయ కెరీర్కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నాడు. రహానే నిష్క్రమణతో భారత క్రికెట్లో ఒక ముఖ్యమైన అధ్యాయం ముగిసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు టీమిండియా స్వింగ్ స్పెషలిస్ట్ భువనేశ్వర్ కుమార్ ఇప్పటికీ దేశవాళీ క్రికెట్, ఐపీఎల్లో మంచి ప్రదర్శనలు చేస్తూనే ఉన్నాడు. ఇటీవల జరిగిన సీజన్లోనూ కీలక వికెట్లు తీసి తన అనుభవాన్ని మరోసారి నిరూపించాడు. అయినప్పటికీ భారత జట్టులో అవకాశాలు లేకపోవడంతో అతని భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భువీ కూడా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది.సుదీర్ఘకాలం భారత పేస్ దళానికి నాయకత్వం వహించిన ఇషాంత్ శర్మ కూడా జాతీయ జట్టుకు చాలా కాలంగా దూరంగా ఉన్నాడు. చివరిసారిగా భారత్ తరఫున మరో మ్యాచ్ ఆడి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించాలని భావిస్తున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ అవకాశం దక్కే సూచనలు కనిపించడం లేదు. దీంతో ఆయన కూడా త్వరలోనే అధికారికంగా వీడ్కోలు ప్రకటించే అవకాశాలు ఉన్నాయని క్రీడావర్గాలు భావిస్తున్నాయి. టెస్ట్ క్రికెట్లో భారత్ తరఫున ట్రిబుల్ సెంచరీ సాధించిన అరుదైన బ్యాటర్లలో ఒకడైన కరుణ్ నాయర్కు కూడా జట్టులో అవకాశం దక్కడం లేదు. చాలాకాలం తర్వాత జట్టులోకి వచ్చినా వచ్చిన అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోవడంతో మళ్లీ జట్టుకు దూరమయ్యాడు. ప్రస్తుతం అతని రీఎంట్రీ అవకాశాలు కూడా స్వల్పంగానే కనిపిస్తున్నాయి. మరోవైపు ఆల్రౌండర్ శార్దూల్ ఠాకూర్ కూడా యువ ఆటగాళ్ల రాకతో తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాడు. కొత్త తరానికి ప్రాధాన్యం పెరగడంతో అతని అవకాశాలు తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో శార్దూల్ కూడా తన భవిష్యత్తుపై త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

## యువతరంగం

# యువత, జనాభా ప్రయోజనం..



యువత ఏ దేశానికైనా అత్యంత విలువైన మానవ వనరు. బాల్యం నుంచి పరిపక్వత దశకు చేరుకునే కాలాన్ని యువదశగా పరిగణిస్తారు. ప్రపంచవ్యాప్తంగా 10–24 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత సంఖ్య చరిత్రలో ఎన్నడూ లేనంతగా పెరిగింది. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా నిలవడం విశేషం. ఈ పరిస్థితి దేశానికి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అపూర్వ అవకాశాన్ని అందిస్తోంది. అయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రభుత్వ విధానాలు, విద్యా వ్యవస్థ, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సేవలపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో జనాభా ప్రయోజనం అనే భావనకు ప్రాధాన్యం ఏర్పడుతుంది. జననాల రేటు తగ్గడం, మరణాల రేటు నియంత్రణలోకి రావడం వల్ల పనిచేసే వయస్సు గల ప్రజల శాతం పెరిగి, ఆధారపడే జనాభా తగ్గుతుంది. ఫలితంగా ఉత్పాదకత పెరగడం, పొదుపులు అధికమవడం, పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి వేగవంతం కావడం వంటి ప్రయోజనాలు కలుగుతాయి. తూర్పు ఆసియా దేశాలు, ముఖ్యంగా చైనా, ఈ అవకాశాన్ని సమర్థంగా వినియోగించుకుని వేగవంతమైన ఆర్థికాభివృద్ధిని సాధించాయి. భారత దేశానికి కూడా ఇదే తరహా అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దేశ జనాభాలో అధిక భాగం పనిచేసే వయస్సులో ఉండటం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నైపుణ్యంతో కూడిన మానవ వనరును అందించే సామర్థ్యం భారత్‌కు ఉంది. అయితే జనాభా ప్రయోజనం స్వయంచాలకంగా ఆర్థికాభివృద్ధిగా మారదు. యువతకు నాణ్యమైన విద్య, వృత్తి నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి అవకాశాలు, వ్యాపార ప్రోత్సాహం లభించినప్పుడే ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవచ్చు. లేనిపక్షంలో నిరుద్యోగం, అసమానతలు, సామాజిక అసంతృప్తి వంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. భారతదేశంలో ప్రాంతాల మధ్య విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, జీవన ప్రమాణాల్లో గణనీయమైన అసమానతలు కనిపిస్తున్నాయి. కొంతమంది యువత ఆధునిక రంగాల్లో అవకాశాలు పొందుతున్నప్పటికీ, మరికొంతమంది పేదరికం, పోషకాహార లోపం, నాణ్యమైన విద్యా కొరత, బాల కార్మికత్వం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందువల్ల జనాభా ప్రయోజనాన్ని నిజమైన జాతీయ సంపదగా మార్చాలంటే సమాన అవకాశాలు, సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన మానవ వనరుల నిర్మాణం అత్యవసరం. ఈ దిశగా విద్యా సంస్కరణలు, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య రంగ బలోపేతం వంటి చర్యలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

# అసాధ్యుడు మోసెస్..



ఒకే రోజులో ఒక అడవిని సృష్టించడం అసాధ్యంగా అనిపించినా, కెనడాకు చెందిన 23 ఏళ్ల సామాజిక కార్యకర్త ఆంటోయిన్ మోసెస్ తన అసాధారణ కృషితో దాన్ని సాధ్యం చేసి చూపించాడు. 2021లో ఆయన కేవలం 24గంటల్లో 23, 060 చెట్లను నాటి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాడు. అనంతరం 2026లో కెన్యా తీరప్రాంతంలో జరిగిన మడ (మ్యాంగ్రోవ్) అడవుల పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొని, ఒకే రోజులో 47,460 మ్యాంగ్రోవ్ మొక్కలను నాటి తన సొంత రికార్డును దాదాపు రెండింతలు అధిగమించాడు. ఈ ఘనతను కూడా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారికంగా గుర్తించింది. మోసెస్ సాధించిన విజయం రికార్డు సృష్టించడానికి మాత్రమే పరిమితం కాలేదు. పర్యావరణ పరిరక్షణ పట్ల వ్యక్తిగత నిబద్ధత ఎంతటి మార్పును తీసుకురాగలదనే విషయాన్ని కూడా ప్రపంచానికి చాటిచెప్పింది. ముఖ్యంగా ఆయన నాటిన మ్యాంగ్రోవ్ మొక్కలు పర్యావరణ సమతుల్యతకు అత్యంత కీలక మైనవి. సముద్ర తీరాలను తుఫాన్లు, అలల ఉద్ధృతి, తీర కోతల నుంచి రక్షించడంతో పాటు, వాతా వరణంలో ఉన్న కార్బన్ డైఆక్సైడ్‌ను అధికంగా గ్రహించి నిల్వ చేయగల సామర్థ్యం వీటికి ఉంది. అందువల్ల వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో మ్యాంగ్రోవ్ అడవులు కీలక పాత్ర పోషిస్తాయి. అలాగే చేపలు, రొయ్యలు, పీతలు వంటి అనేక సముద్ర జీవులకు సహజ ఆవాసాలుగా, జీవవైవిధ్యానికి ఆధారంగా నిలుస్తాయి. ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ఒక రక్షణ కవచం, ప్రతి చెట్టు భూమికి కొత్త ఊపిరి, ప్రతి విత్తనం పర్యావరణ పునరుజ్జీవనానికి ఒక ఆశాకిరణం. ప్రపంచవ్యాప్తంగా అటవీ విస్తీర్ణం తగ్గిపోతున్న తరుణంలో, ప్రభుత్వాలు మాత్రమే కాదు ప్రతి పౌరుడు కూడా ప్రకృతి సంరక్షణలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్న గొప్ప సందేశాన్ని మోసెస్ రికార్డు మనకు గుర్తు చేస్తోంది. ఒక వ్యక్తి ఒక రోజులో వేలాది మొక్కలను నాటగలిగితే, కోట్లాది మంది ఒక్కొక్కరు ఒక్కో మొక్కను నాటినా భూమి మరింత పచ్చదనంతో కళకళలాడుతుంది. పర్యావరణ పరిరక్షణలో చిన్న ప్రయత్నాలే భవిష్యత్తులో గొప్ప మార్పులకు పునాది అవుతాయి. ఆంటోయిన్ మోసెస్ నాటిన వేలాది మొక్కలు కేవలం అడవులుగా మాత్రమే కాకుండా, ప్రకృతిపట్ల మానవ బాధ్యతకు, సుస్థిర భవిష్యత్తుపై ఆశకు చిరస్మరణీయ చిహ్నాలుగా నిలిచిపోతాయి.

# దళిత సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు

**ఏజెన్సీలో గిరిజనులతో పాటు సమాన హక్కులు కల్పించాలి**

**అసైన్డ్ భూములకు పూర్తిస్థాయి భూమి హక్కులు ఇవ్వాలి**

**ఎస్సి సబ్ ప్లాన్ పునరుద్ధరించాలి**

**కలెక్టరేట్‌ల ముట్టడిలో డిహెచ్‌పిఎస్ డిమాండ్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దళిత అభివృద్ధి సంక్షేమం విషయంలో పాలకులు అనుసరిస్తున్న వివక్షపూరిత విధానాలను ఇప్పటికైనా విరమించి రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యం లో దళితుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు గనిగల్ల వీరస్వామి, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, కంచర్ల జమలయ్య, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు దొంతమాల చెన్నయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ పేరాల శ్రీనివాసరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రత్నకుమారి, డిహెచ్‌పిఎస్ నాయకులు పోలమూరి ధనలక్ష్మి, మద్దాల హరిత, జంగం మోహన్‌రావు, మామిడాల ధనలక్ష్మి, ఉర్సు రామకృష్ణ, పోలమూరి శ్రీనివాస్, మండల రాజు, రవికిషోర్, మేదిని లక్ష్మి, దారా లక్ష్మి, ఇమ్మానుయేల్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** దళితులకు కెటాయించిన అసైన్డ్ భూములకు పూర్తిస్థాయి భూమి హక్కును కల్పించాలను డిహెచ్‌పిఎస్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బోయిని అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతి ఆధ్వర్యంలో కరీంనగర్ అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు లంకదాసి కళ్యాణ్, ఇల్లందుల సురేందర్, యుగేందర్, మురళి, నర్సింగ్, రాజు, అశోక్, కొమురన్న తదితరులు పాలొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** అంబేద్కర్ అభయహస్తం నిధుల విడుదల చేయడంతో పాటు అసైన్డ్ భూములకు పట్టా పత్రాలు పంపిణీ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సమితి అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి, నాయలు వంకేశ్వరం శ్రీనివాసులు, జిల్లా సమితి సభ్యులు కొత్త రామస్వామి, చిన్న పాగా శ్రీను, శివశంకర్, కురుమయ్య, పేరుమలి శ్రీను, దుర్గ, బండి బాలపీరు పాల్గొన్నారు.

**భువనగిరి :** దళితుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని, సబ్ ప్లాన్ నిధులను పునరుద్ధరించి ప్రతి దళిత కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత, ప్రధాన కార్యదర్శి జిట్టా రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమానికి ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ మద్దతు తెలుపగా డిహెచ్‌పిఎస్ నాయకులు పిట్టల శంకర్, పోతూ ప్రవీణ్, మామిడికాయల నరసింహ, చెడె సుందరయ్య, గుండెపు వెంకటయ్య, వాసం గాలయ్య, వెంకన్న, ధనమ్మ, స్వామి, ముత్యాలు, జంగయ్య, శ్యాగ జానూ, మనోహర, శ్రీను, రాములు, అండాలు, వసంత పాల్గొన్నారు.

**జవహర్ నగర్(మేడ్చల్):** దళితులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ దళిత పోరాట సమితి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సమితి సభ్యులు చిలుముల మల్లేశం, సిపిఐ మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు ఆనందరావు, అశోక్, సోమన్న, నాచారం మండల అధ్యక్షురాలు శోభ, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కృపాకర్, రాములు, రేణుక, యాదమ్మ, యాకమ్మ, జయమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరాంపూర్ :** దళితులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు బొల్లం తిలక్ అంబేద్కర్, బడికల మధునయ్య, గునిగంటి నర్సింగరావు, దాసరి రాజా శ్రీధర్, జాడి పోచన్న, బొంతల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్ :** దళితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిహెచ్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు హాజరై సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్, జిల్లా అధ్యక్షుడు రాజారత్నం మాట్లాడారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు రెంటాల దేవా, శనిగరపు రాజకుమార్, శంకర్, ప్రదీప, శ్రీనివాస్, పద్మ,, చంద్రమౌళి, కుడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

**జనగామ టౌన్ :** దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దళిత హక్కుల పోరాట సమితి జిలా ప్రధాన కార్యదర్శి పైస రాములు ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

**ఖమ్మం :** కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని దళిత పోరాట హక్కుల సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరావు, జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు, నాయకులు తడికమళ్ల యోబు, దోసపాటి సృజన, వరదా నర్సింహారావు, లింగయ్య, మామిడాల కిరణ్, భూపాల్, కరుణాకర్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

**భూపాలపల్లి :** డిహెచ్‌పిఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి పొన్నగంటి లావణ్య, జిల్లా అధ్యక్షుడు రాసపల్లి భద్రయ్య, మంచినీళ్ల వైకుంఠం, లక్ష్మయ్య సమ్మక్క శ్రీనివాస్‌పాల్గొన్నారు.

**సిద్దిపేట అర్బన్ :** తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్ డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షడు బొనగిరి రూపేష్, నాయకులు చంద్రశేఖర్, మంజుల, రమేష్, సతీష్, లక్ష్మి, మనీష్, రాకేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో దళిత కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం డిహెచ్ పిఎస్ జిల్లా కన్వీనర్ గజ్జల ప్రభాకర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా కమిటీ సభ్యులు గొల్ల బాబు, పండుగ చంద్రయ్య, ఎల్లయ్య, జాన్సన్, కవిత, అనిత తదితరులు పాల్గొన్నారు.


భద్రాద్రి కొత్తగూడెం...


మేడ్చల్...



యాదాద్రి భువనగిరి...




నాగర్‌కర్నూల్...



రాజన్న సిరిసిల్ల...



భూపాల్‌పల్లి...


సిద్దిపేట...


కరీంనగర్...


హనుమకొండ...


ఖమ్మం...


మంచిర్యాల...



## ప్రజావాణి దరఖాస్తుల సత్వరమే పరిష్కారం

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 113 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 65, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 15, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్స్ 4, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య శాఖ 3, ఇరిగేషన్ 2, డి.సి.ఓ (టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐ) 2, డి.పి.ఓ 2, వ్యవసాయ, విద్య, మైన్స్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్ అండ్ బి, మార్కెటింగ్, హౌసింగ్, సివిల్ సప్లై, జిఎం ఇండస్ట్రీస్, పశుసంవర్ధక శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్ కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాల్సిందే




**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ రాష్ట్రంలోఅధికారంలోకి రాగానే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భారత జాతీయ మహిళ సమాఖ్య ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత డిమాండ్ చేశారు. సోమవారం బీబీనగర్ మండలంలో బట్టుగూడెం గ్రామంలో 3వ మండల మహిళ మహాసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కావటం లేదని, ముఖ్యమంత్రి ప్రతి మహిళకు రూ.2,500 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభలో మహిళ రిజర్వేషన్ 33 శాతం వెంటనే అమలు చేసి అన్ని రంగాలలో మహిళలకు స్థానం కల్పించాలని పేర్కొన్నారు. మహిళల యొక్క శ్రమదోపిడీ జరుగుతుందని వారి శ్రమకు తగిన ఫలితం అందాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే బీబీనగర్ మండల మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. కోర శాలిని అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో కోరే నాగమ్మ, కోరే బాలమణి, కోరే లక్ష్మ మ్మ, కోరే యశస్విని, కోరే మంగమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

## సమగ్ర యువజన విధానం రూపొందించాలి

ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ సంస్థాన్ నారాయణపురం మండల సమితి సమావేశం గడ్డం యాదగిరి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతుందని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని వెంటనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు. యువతకు సమగ్ర ఉద్యోగ, ఉపాధి విధానం రూపొందించాలి అని అన్నారు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. రాజీవ్ యువ వికాస్ వెంటనే అమలు చేయాలని అన్నారు. యూత్ పాలసీని తీసుకొచ్చి యువతకు నైపుణ్యత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు విప్లవ్, కొండూరి రవితేజ, సింగపంగ రమేష్, కొత్త శేఖర్, కొర్ర వినోద్, కేలోతు కిషన్ నాయక్, కొండూరు నవీన్, చరణ్, హరి, ప్రభాకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 117 దరఖాస్తులు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 117 దరఖాస్తులు వచ్చాయని వాటిలో భూ సమస్యలకి సంబంధించి 59, డిడబ్ల్యుఓ 10, డిపిఓ 7, డిఎం అండ్ హెచ్ఓ 6, మిగిలిన 35 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవి ఉన్నట్లు తెలిపారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, జిల్లా పరిషత్ సిఈఓ శిరీష, డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య, సిపిఓ కిషన్, డిఇఓ అశోక్, డిపిఓ యాదగిరి పాల్గొన్నారు.

## ఎంజియు పిహెచ్‌డి నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాలలో 2024/25,2025/26 విద్య సంవత్సరానికి సంబంధించిన పీహెచ్డీ నోటిఫికేషన్ ను సోమవారం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, డైరెక్టర్ విడుదల చేశారు.కామర్స్‌లో 1, ఇంజినీరింగ్ టెక్నాలజీలో 13, బిజినెస్ మేనేజ్మెంట్ లో 18, బయో కెమిస్ట్రీలో 5, కెమిస్ట్రీలో 31,మ్యాథమెటిక్స్‌లో 8, ఎకనామిక్స్ లో 6,ఇంగ్లీష్‌లో 2 ఖాళీలకు గాను కేటగిరి 1, కేటగిరి 2 లో భర్తీ చేయనున్నారు. పూర్తి వివరాలకై ఎంజియు వెబ్ సైట్ ను సందర్శించాలని ఆయన తెలిపారు.

### కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై

# సిపిఐ ప్రజా చైతన్య యాత్రలు

6 నుంచి 12 వరకు ప్రచారం

ఎస్ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టులు పూర్తి చేయాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించేందుకు సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, రైతులు, కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సంక్షేమ పథకాల అమలులో జరుగుతున్న లోపాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడమే ఈ యాత్రల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని యాత్రలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలని కోరారు. నల్లగొండ జిల్లాలో దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఎస్ఎల్‌బీసీ , డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తయితేనే సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఈ కీలక ప్రాజెక్టులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి నిర్ణీత గడువులోగా వాటిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని, బోరు బావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్టం పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరా రు. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య అధ్యక్షత వహించగా సినియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మల్లేపల్లి ఆదిరెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లొడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు ఉజ్జిని యాదగిరి రావు,పబ్బు వీర స్వామి,ఆర్ అంజచారి,బంటు వెంకటేశ్వర్లు,టి. వెంకటేశ్వర్లు,తూము బుచ్చిరెడ్డి,కౌన్సిల్ సభ్యులు ఉన్నారు. అనంతరం కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ సిపిఐ రూపొందించిన బద్లావ్ జరూరీ హైమార్పు కావాలి వాల్ పోస్టర్ ను విడుదల చేశారు.

## గుండాల మండలాన్ని అభివృద్ధి చేస్తా

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళతానని ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పిఏసిఎస్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య హాజరై మాట్లాడారు. రైతులు సకాలంలో రుణాలను చెల్లించి సంస్థ అభివృద్ధికి పాటు పడాలని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కంటే ప్రజా ప్రభుత్వంలో ఎక్కువ మొత్తంలో రుణాలను సంస్థ ద్వారా అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో రైతులకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ రైతు రుణ మాఫీ, రైతు బంధు, రైతు బీమాలను అమలు చేస్తూ రైతుల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. అనంతరం మాజీ మంత్రి స్వర్గీయ ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలో పని తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందితున్న చికిత్స , మందుల లభ్యత, అత్యవసర సేవలు, వసతులపై సమగ్రంగా పరిశీలించారు. వైద్య, పారామెడికల్ సిబ్బంది కొరతపై ఆరా తీసి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా జిల్లా వైద్యాధికారితో ఫోన్లో మాట్లాడి ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది కొరత, మందుల లభ్యత, 108 సేవలు తదితర అంశాలపై పూర్తి నివేదికను వెంటనే అందజేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో పిఏసిఎస్ ఛైర్మన్ అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు దశరథగుప్త, జిల్లా నాయకులు వెంకన్న, రాంరెడ్డి, పిఏసిఎస్ మాజీ చైర్మన్ బిక్షం, యాదగిరి, సునిల్‌రెడ్డి, నారాయణ, సోమన్న పాల్గొన్నారు.

## యువత, విద్యార్థులే టార్గెట్‌గా గంజాయి విక్రయం

6కేజీల గంజాయి, 38 బాటిళ్ల దగ్గు మందు స్వాధీనం

కేసు వివరాలు వెల్లడించిన కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి




**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణ సిఐ శివశంకర్‌నాయక్ నేతృత్వంలో ప్రత్యేక నిఘా టీం ఆదివారం సాయంత్రం కోదాడ పట్టణ పరిధిలోని దేగబాబు కళ్యాణ మండపం సమీపంలో నిందితుల నుండి ఆరు కేజీల గంజాయి, 38 బాటిళ్ల దగ్గు మందును స్వాదీనం చేసుకున్నారు. కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం కోదాడ పట్టణానికి చెందిన పంది వినోద్, షేక్ మగ్దుంపాషా, ఆవిడి రాఘవలు అనంతగిరి మండలానికి చెందిన రవి తేజ, షేక్ ఇర్ఫాన్లతో పాటు ఖమ్మం పట్టణానికి చెందిన షేక్ సుబానీ లను పట్టణ సిఐ నేతృత్వంలో ప్రత్యేక టీం దాడి నిర్వహించి నిందితులను పట్టుకుని వారి నుండి ఆరు కేజీల గంజాయి, 38 దగ్గు మందు బాటిళ్లు, ఒక ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాదీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రవితేజ ఒరిస్సా రాష్ట్రం నుండి గంజాయి కొనుగోలు చేసి కోదాడకు తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారు. అతని ద్వారా ఇతర నిందితులు కొనుగోలు చేసుకుని విక్రయిస్తున్నారు. దీంతో పాటు ఖమ్మం పట్టణంలోని మెడికల్ జనరల్ స్టోర్ యజమాని సుభాని ఎటువంటి ప్రిస్కిప్షన్ లేకుండా దగ్గుమందు విక్రయిస్తున్నాడు. ఈ సందర్భంగా కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక నిఘా టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలు సమాచారాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, పోలీస్ అధికారులకు తెలియపర్చాలని సూచించారు. ఈకేసును చేదించిన పట్టణ సిఐ శివశంకర్ నాయక్, ఎస్ఐ అజయ్‌కుమార్, ఇతర పోలీసులకు రివార్డుకు ప్రతిపాదించినట్లు తెలిపారు.



## ప్రజల భద్రత, రక్షణలో పోలీసులు నిరంతర కృషి

రూ.20 లక్షల విలువైన 102 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజల భద్రత, రక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా నిర్వహించారు. ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న దాదాపు రూ.20లక్షల విలువైన 102 సెల్‌ఫోన్లను గుర్తించి రికవరీ చేసి బాధితులకు ఎస్‌పి నరసింహ తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా ఉంటే నష్టాలు తప్పవని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదమరిస్తే సైబర్ మోసగాళ్ళు ఆర్థికంగా నష్టపరుస్తారన్నారు. సాంకేతిక అభివృద్ధి చెందడంతో పాటు సైబర్ మోసాలు కూడా పెరిగాయన్నారు. ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో (https://www.ceir.gov.in) నందు నమోదు చేసుకోవాలన్నారు. మొబైల్‌ను బ్లాక్ చేసి మీ సేవ ద్వారా దరఖాస్తుకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ తోట లక్ష్మి నారాయణ, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి ప్రజలవద్ద నుండి పిర్యాదులను స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ తర్వాత ఎప్పటిలాగే జిల్లా అధికారులతో వివిధ అంశాల పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మండలాల ప్రత్యేక అధికారులు హాస్టళ్లు, ఇతర ప్రభుత్వ సంస్థలు తనిఖీ చేసిన అనంతరం నివేదికలను తప్పనిసరిగా సమర్పించాలని, కొంతమంది అధికారులు నివేదికలు సమర్పించడం లేదని, ఇకపై తప్పనిసరిగా ప్రతి ఒక్కరు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.ఈ సంవత్సరం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్య అతిథి సందేశానికి ఇప్పటినుండే ఆయా శాఖల అధికారులు నోట్స్ ను తయారుచేసి ఈ నెల 7 లోగా సిపిఓ కు అందజేయాలన్నారు. రేపటినుండి పాఠశాల విద్యార్థులకు బ్లూ యూనిఫామ్ స్టిచ్చింగ్ మొదలు పెట్టాలని తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చిన యూనిఫాంను మండలాలలో వెంటనే హ్యాండ్ఓవర్ చేసుకోవాలని ఆదేశించారు. కాగా ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 81, ఇతర అధికారులకు 57 ఫిర్యాదులు, మొత్తం 138 వచ్చాయి. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, జెడ్‌పిసీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

## తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ కే.శంకర్‌నాయక్, మిర్యాలగూడ ఆర్డీవో ఎస్.రమణారెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్ కోరారు. స్థానిక రెవెన్యూ డివిజన్ (ఆర్డీవో) కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ ఐసీడీఎస్ అర్బన్, దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. నవజాత శిశువులకు తల్లిపాలు పట్టడం వల్ల బిడ్డతో పాటు తల్లికి కూడా ఆరోగ్యం సమకూరుతుందన్నారు. వారం రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దామరచర్ల తహసీల్దార్ పి. దామరచర్ల, అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్లు శాంతి, విజయలక్ష్మి , మిర్యాలగూడ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కే. నాగమణి, అనుముల సూపర్‌వైజర్ ఫరీదా బేగం, మాధవి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది



**ప్రజాపక్షం/సూర్యాపేట** : పట్టణంలో ప్రస్తుతం నెలకొన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది స్పష్టం చేశారు. సోమవారం దోసపహాడ్ నుంచి గతంలో అమలులో ఉన్న నీటి పంపింగ్ విధానాన్ని పునరుద్ధరించే అవకాశాలను మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి, పబ్లిక్ హెల్త్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. వెంకటేశ్వర్లు, ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దోసపహాడ్ పంపింగ్ వ్యవస్థతోపాటు శిథిలావస్థకు చేరిన పాత నీటి ట్యాంకుల స్థానంలో కొత్త ట్యాంకుల నిర్మాణానికి డిపిఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మల హాస్పటల్ రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంకులను పరిశీలించిన అధికారులు 1970లో నిర్మించిన రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల జిఎల్ఎస్ఆర్ ట్యాంకు, 1987లో నిర్మించిన రెండు అంతస్తుల 1.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు ట్యాంకులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నట్లు గుర్తించారు. ఈ ట్యాంకుల స్థానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త నీటి నిల్వ ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా చౌదరి ప్లాంట్, సైనికపురి ప్లాంట్, దోసపహాడ్ ప్లాంట్లలో మోటార్లు, పంపింగ్ లైన్లు, జనరేటర్లు, వాల్వులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, వాటి కోసం సమగ్ర డిపిఆర్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ కిరణ్, పబ్లిక్ హెల్త్ డిఈ రమాదేవి, అనిల్, మున్సిపల్ డిఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిర్మలయ్య, వార్డు కౌన్సిలర్లు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, నాగుల వాసు, గునగంటి హేమ సతీష్, సయ్యద్ సమ్మి, ఎస్ఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## ఎవిఎం హాస్టల్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్?

15 మంది విద్యార్థులకు ఆస్పత్రికిలో సెలూన్స్

పాఠశాల నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రుల ఆరోపణ

మాది ఎలాంటి బాధ్యత లేదు అంటున్న యాజమాన్యం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలోని ఏవీఎం పాఠశాల హాస్టల్‌లో సోమవారం 15 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఉపాధ్యాయులు హుటాహుటిన స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రి కితరలించి చికిత్స అందించారు.విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు ఆస్పత్రులకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థులు హాస్టల్‌లో అందించిన ఆహారం తీసుకున్న తర్వాతే అస్వస్థతకు గురయ్యారని, ఇది పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమేనని తల్లిదండ్రులు ఆరోపించారు. చికిత్సకు అయ్యే ఖర్చులను కూడా తామే భరించాలని యాజమాన్యం చెబుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, వైద్య ఖర్చులను యాజమాన్యంతోనే భరింపజేయాలని డిమాండ్ చేశారు.అయితే, ఈ ఘటనను ఫుడ్ పాయిజన్‌గా పేర్కొనడం సరికాదని ఆ పాఠశాల అధినేత కందాల పాపిరెడ్డి తెలిపారు. హాస్టల్‌లో సుమారు 200 మంది విద్యార్థులు ఉంటున్నారని, ఆదివారం కావడంతో కొందరు తల్లిదండ్రులు బయట నుంచి ఆహారం తీసుకొచ్చి పిల్లలకు తినిపించారని చెప్పారు. హాస్టల్‌లోని ఆహారం, బయట నుంచి తెచ్చిన ఆహారం కలిసిపోయిన నేపథ్యంలో కేవలం 15 మంది విద్యార్థులకు మాత్రమే వాంతులు, విరేచనాలు అయ్యాయని, పాఠశాల తరఫున ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదని ఆయన వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆపాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్ డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ డే

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ పరిధుల నుంచి వచ్చిన 58 మంది బాధితులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను జిల్లా ఎస్‌పికి అందజేశారు.ఈ సందర్భంగా ప్రతి బాధితుడి ఫిర్యాదును స్వయంగా పరిశీలించి,వారి సమస్యలను విని,సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపి త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూ వివాదాలు,కుటుంబ కలహాలు, మోసం,ఆర్థిక లావాదేవీలు,ఇతర వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖ



ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని,బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డేను వినియోగించుకోవాలని సూచించారు.

# గుడుంబా కేంద్రాలపై ఎక్సైజ్ ఉక్కుపాదం

**9కేసులు నమోదు, 30 లీటర్ల నాటుసారా, 20 కిలోల బెల్లం, 5 కిలోల పటిక స్వాధీనం**



**ప్రజాపోం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం ఇనుగుర్తి మండలాల్లో నాటుసారా తయారీ కేంద్రలపై ఎక్సైజ్ అధికారులు సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు.నాటుసారా తయారీ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపట్టిన ఈ దాడుల్లో మొత్తం 9 కేసులు నమోదు చేసి తోమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ డిప్యూటి కమిషన్ హెచ్ దత్తురాజు గౌడ్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషన్ కె నవీన్‌కుమార్ మహబూబాబాద్ డీపీఈఓ పీ కరంచంద్ ఆదేశాల మేరకు గూడూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కేసముద్రం మండలంలోని గిర్ని తండా ఎన్టీఆర్ నగర్ కట్టుకాలువ తండా బ్రహ్మంగారిగుడి తండా కొత్తూరు అలాగే ఇనుగుర్తి మండలంలోని లాలు తండా ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు.దాడుల్లో 30 లీటర్ల నాటుసారా 20 కిలోల బెల్లం 5 కిలోల పటిక స్వాధీనం చేసుకోగా నాటుసారా తయారీకి సిద్దంగా ఉంచిన సుమారు 1.100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటుసారా తయారీకి పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేశారు.కేసులు నమోదైన వారిలో బానోత్ సరస్వతి అంగోత్ విజయ బానోత్ బద్రి బానోత్ బద్రి నూనె ముత్తమ్మ జాటోత్ బంగారి బానోతుగాయి వాంకుడోత్ సోని భానోత్ సునీత ఉన్నారు. వీరిలో ఏడుగురిని కేసముద్రం తహసీల్ధార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ముడిసరుకు రవాణాపైనా నిఘా నాటుసారా తయారీకి కేంద్రాలతో పాటు నాటుసారా తయారీకి ఉపయోంచే ముడిసరుకుల అక్రమ రవాణా నిల్వలపైనా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు గూడూరు ఎక్సైజ్ సీఐ ఎన్ బిక్షపతి తెలిపారు. నాటుసారా తయారు చేసినా విక్రయించినా కొనుగోలు చేసినా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు. ఈదాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్లు నాగయ్య చంద్రశేఖర్ మహబూబాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స ఇన్‌స్పక్టర్ నీరజ ఎస్సైలు కిరీటి రాజేశ్వరి ట్రైనీ ఎస్సై ఎస్ సంతోస్ తదితరులు పాల్గోన్నారు.

## 7న నివేదికలను అందజేయాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు తమ ప్రగతి నివేదికలను ఈ నెల 7 నాటికి అందజేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ, ఏర్పాట్లపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల ద్వారా సాధించిన పురోగతి, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించిన పూర్తి నివేదికలను ఆగస్టు 7లోగా డిపిఆర్‌ఓకు అందించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టంచేశారు. పారిశుద్ధ్యం, అలంకరణ, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ప్రోటోకాల్‌కు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్‌ఓ వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం లక్ష్యాలు గడువులోగా పూర్తి: సత్య శారద

**ప్రజాపక్షం/వరంగల్:** జిల్లాలో వన మహోత్సవం 2026 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి, శాఖలకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా మొక్కలు నాటి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) నిఖిలతో కలిసి జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ (డీఎల్‌ఎంసీసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా మొక్కల నాటకం, లక్ష్యాల సాధన, జియో ట్యాగింగ్ పురోగతి, మొక్కల సంరక్షణ చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లాకు ఈ ఏడాది 25,51,248 మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 7,27,612 మొక్కలు నాటడం జరిగిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. టార్గెట్ పూర్తి చేయని అధికారులను అందుకు గల కారణాలను తెలుసుకుని నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నాటిన ప్రతి మొక్క మనుగడను నిర్ధారించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మొక్కల జియో ట్యాగింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రతి మొక్కను తప్పనిసరిగా నమోదు చేయాలని, వాటి సంరక్షణపై సంబంధిత శాఖలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డిఆర్డిఓ నాగపద్మజా, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత: కలెక్టర్ హేమంత్




**ప్రజాపక్షం/ములుగు:** ప్రజావాణి కార్యక్రమంలో ఆర్జీదారులు అందించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్ధడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావులతో కలిసి ఆర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 67 దరఖాస్తులు రాగా, వాటిలో భూ సమస్యలు 11, ఇందిరమ్మ ఇళ్లకు 18, పెన్షన్లకు 26, ఇతర శాఖలకు సంబంధించినవి 12 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గత వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా కారణాల వలన క్రింది స్థాయి కార్యాలయాల్లో సమస్యను పరిష్కరించలేకపోతే, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కృష్ణవేణి, ఎస్‌డిటి ప్రతాప్ అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల ఎంఆర్‌ఓలు, ఎంపిడిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కుదేలవుతున్న ఆటో కార్మికుల కుటుంబాలు

**ఆటో కార్మికుల కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలి**
**ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్**




**ప్రజాపక్ష/వరంగల్ :** ఆటో కార్మికుల కుటుంబాలు కుదేలు అవుతున్నయని, ఆటో కార్మికుల కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. తమ్మెర భవన్ శివనగర్ లో ఆటో , ట్రాలీ డ్రైవర్స యూనియన్ జిల్లా నిర్మణ మహాసభ యండి అక్బర్ పాషా అద్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్బాంగా ఆయన మాట్లాడుతు ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఆర్థిక భారాలు, ఉపాధి కోల్పోవడం, సంక్షేమ పథకాలు అందక పోవడంమని విపరీతంగా పెరిగిన స్పేర్ పార్ట్స్ ధరలు, గ్యాస్/డీజిల్ ధరలు , వాహన పన్నులవల్ల ఇబ్బది పడుతున్నరని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఎలక్ట్రిక్ ఆటోలు, ఆన్‌లైన్ క్యాబ్ సేవల వల్ల తగ్గిన ఆదాయం లేదని ఆరోగ్య భద్రత, సరైన పెన్షన్ , ప్రమాద బీమా వంటి సదుపాయాలు లేకపోవడం, ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని లేదా సబ్సిడీలను వెంటనే నేరుగా ఆటో కార్మికులకు అందించాలన్నారు. కొత్త రవాణా విధానాలను ప్రవేశపెట్టే ముందు ఆటో యూనియన్లతో చర్చించి, వారి ఉపాధికి భద్రత కల్పించాలన్నారు. ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, హెల్త్ కార్డ్‌లు , ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రతి ఆటో కార్మికునికి సంవత్సరానికి 25 వేల రూపాయలు అందించాలని, వారి పిల్లలకు ఉచిత విద్య స్కాలర్ షిప్లు ఉన్నత విద్యకు తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమం లో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి గుండె బద్రి, జన్నురవి, పరికరాలు రమేష్, తోట మల్లయ్య, రాజన్ బాబు, దాసరి రాము, లావ్యుడ్య దస్రు, యునిస్, నరేందర్, బానాల మహేష్ ,మాల్లా రెడ్డి, మందపల్లి శ్రీనివాస్, మౌటం కుమార్ , గణేష్ తదితరులు పాల్గొన్నారు

## పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి**



**ప్రజాపక్షం/వేలేరు:** ప్రజాసమస్యలు పరిష్కరించడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిరసిస్తూ ఆగస్టు 06 నుంచి 14వరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆద్వర్యంలో దేశవ్యాప్తంగా అన్నారాష్ట్రాలు, మండలకేంద్రాలలో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. సోమవారం వేలేరు మండలంలోని పీచర గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాదయాత్ర పోస్టురు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్రె భిక్షపతి, సారంగపాణి తదితరులు మాట్లాడాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడి నేత్రుత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలతో నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. అక్రమార్కులను రక్షించడానికి బిజెపి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 06నుంచి14వరకు పాదయాత్రలు, సెప్టెంబరు 1న చలో ఢిల్లీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి,మునిగాల భిక్షపతి, స్టాలిన్, రాజమౌళి, సారంగపాణి, మాలోతు శంకర్, కొట్టె వెంకటేష్, బొట్టు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట ఓసి క్లబ్‌ను స్వాధీనం చేసుకోవాలి

**సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వినతి**



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాద్ జిల్లా కేంద్రంలోని కోట్ల విలువ చేసే విశాలమైన ప్రభుత్వ క్లబ్ ను వెంటనే ప్రభుత్వం మున్సిపాలిటీ స్వాధీనం చేసుకొని ప్రజల బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని సందర్శించాలని సోమవారం సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్నో ఏండ్ల నుండి ఓసి క్లబ్ ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పోరాడుతున్నామని బహుళ ప్రయోజనాల కోసం ఇండోర్ స్టేడియం కళాక్షేత్రం అందరికీ ఉపయోగపడే విధంగా ఉపయోగించాలని కోరారు. స్థలం కబ్జా కాకుండా అనేక ఏళ్లుగా అటు మున్సిపాలిటీలో ప్రజాక్షేత్రంలో ఉద్యమించినట్టు అజయ్‌సారథిరెడ్డి తెలిపారు ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ గారు సానుకూలంగా స్పందించి సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

## సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ' వాల్ పోస్టరు విడుదల


**సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా**




**ప్రజాపక్షం/వరంగల్:** ఆగస్టు 6 నుండి 14 వరకు జరుగు పాదయాత్రలను విజయవంతం చేయాలని, సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరుగు బద్లావ్ జరూరీ హే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా పిలుపునిచ్చారు. శివనగర్ తమ్మెర భవన్ లో ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్రలు, సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం వాల్ పోస్టరును సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ దశాబ్దం క్రమంగా ఆందోళన, నిరాశ పెరుగుతున్న కష్టాలకు దారితీసిందని, ఎన్నికల సందర్భంగా బిజెపి అభివృద్ధి ఉపాధి సంక్షేమం సుపరిపాలన, మెరుగైన భవిష్యత్తును అందిస్తామని వాగ్దానం చేసిందని, కానీ దానికి బదులుగా దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం భరించలేని ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల) విస్తరిస్తున్న అసమానతలు బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుచించుకుపోతున్న ప్రజాస్వామ్యం ,పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తతలను ఎదుర్కొంటోందన్నారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం నుండి ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలని కోరినప్పుడల్లా ఈ చర్చను ఇతర అంశాల వైపులనకు మళ్లిస్తున్నారని, సామాన్య పౌరుల రోజువారీ సమస్యలను పరిష్కరించడానికి బదులుగా బిజెపి , ఆరెస్సెస్ పదేపదే మతపరమైన విషయాలపై ప్రజల దృష్టి మళ్లిస్తుందని, జవాబుదారీతనం నుండి తప్పించుకోవడానికి మతాన్ని వాడుకుంటున్నారు. వైఫల్యాలను దాచడానికి ద్వేషాన్ని ప్రోత్సహిస్తున్నారని, ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన సమస్యల నుండి దృష్టిని మరలిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా రైతులు సుదీర్ఘ పోరాటాలు చేసినప్పటికీ, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన హామీ కల్పించాలనే డిమాండ్ ఇంకా పరిష్కారం కాలేదని, దేశవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 14 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు, సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టి రామ్ లీలా మైదానంలో జరగబోయే బద్లావ్ జారూరి హై ర్యాలీలో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, లక్ష్మణ్ , బద్రి, అక్బర్‌పాషా, నాయకులు జన్ను రాజు, శ్రీనివాస్, జగదీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ వైభవానికి కేంద్రం పెద్దపీట వేయాలి

**ఎంపి డాక్టర్ కడియం కావ్య**



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి అంశాన్ని లోక్ సభ వేదికగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బలంగా ప్రశ్నించారు. కాకతీయుల చరిత్ర, సంస్కృతి, కళా వైభవం కేవలం తెలంగాణకే కాకుండా దేశానికి గర్వకారణమని, అలాంటి వారసత్వ సంపదకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రధానంగా వరంగల్‌కు చరిత్రక గుర్తింపుగా నిలిచిన కాకతీయ కట్టడాలు, సంప్రదాయ కళలు, చేనేత–హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాలు, పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకుందో వివరించాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమాధానం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పరిధిలో 9 రక్షిత కట్టడాలు ఉన్నాయని, వాటిలో వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయ వారసత్వ కట్టడాలు కూడా ఉన్నాయని తెలిపారు. అవసరాలు, నిధుల లభ్యత మేరకు వాటి పరిరక్షణ, నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, కాకతీయ కళా సంపద, చేనేత, హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాల అభివృద్ధికి ఇంకా విస్తృత స్థాయిలో చర్యలు అవసరమని అన్నారు. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వద్ద ప్రపంచ స్థాయి పర్యాటక సదుపాయాలు కల్పిస్తే వేలాది మంది దేశ, విదేశీ పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రసాద్ పథకం కింద రామప్ప దేవాలయ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, కాకతీయ వారసత్వానికి సంబంధించిన అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కేంద్రం రూపొందించాలన్నారు. కాకతీయుల వారసత్వం తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఈ సంపదను పరిరక్షించడం, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. వరంగల్ అభివృద్ధి, కాకతీయ వైభవ పునరుద్ధరణ కోసం పార్లమెంట్‌లోనూ, కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ నిరంతరం తాను పోరాడుతాను అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

## ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్టు

**28 మోటార్ సైకిళ్ల స్వాధీనం, విలువ రూ. 25 లక్షలు: సిపి**



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల చోరీలపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదుకాగా బైక్ చోరీలు చైన్ స్నాచింగ్ కేసులకు కూడా దారి తీస్తునందుకు సెంట్రల్ జోన్ డిసిపి కవిత ఆధ్వర్యంలో స్పెషల్ టీంలను నియమించినట్లు వరంగల్ సిపి ఎన్. శ్వేత తెలిపారు. సోమవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సిపి మాట్లాడుతూ చోరీల పై సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగిందని, గత కొద్ది కాలంగా జరిగిన నేరాలను విశ్లేషణ చేయగా సోమవారం ఇద్దరు అనుమానితులను అదుపులోనికి తీసుకోని విచారణ చేయగా బైక్ చోరీలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. మంచిర్యాల కు చెందిన దొంతుల ప్రశాంత్ కుమార్ (20), దుర్గం సాయి కార్తీక్ (21) సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. వాహన తనిఖీల సందర్భంగా నిందితులు ప్రయాణిస్తున్న అనుమానాస్పద పల్సర్ మోటార్ సైకిల్ నెం. ఏపి 36 ఏవై 4700 గలదాన్ని పోలీస్ టీం స్వాధీనం చేసుకుని విచారించగా, వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టిన వాహనాల గురించి సమాచారం అందించారని, వారి చూపిన మేరకు కేయూసి పిఎస్ మునిపల్లి గ్రామ శివారు, ఎల్కతుర్తి సమీపంలోని ప్రాంతాల నుండి మొత్తం 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అవి వరంగల్ కమీషనరేట్ లో 8, కరీంనగర్ కమీషనరేట్‌లో 9, రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి లో 3, సిద్దిపేట కమీషనరేట్‌లో 2 హైదరాబాద్ కమీషనరేట్ లో3, రాచకొండ కమీషనరేట్ లో 1, భూపాలపల్లి జిల్లాలో 2 మొత్తం 28 మోటార్ సైకిల్ల దొంగతనాలు చేశారని, వీటికి సంబంధించిన కేసులను ఆయా పోలీస్ స్టేషన్లతో అనుసంధానం చేస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఈ సమావేశంలో హన్మకొండ, సిసిఎస్ ఏసీపీ లు నర్సింహారావు, సదయ్య పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాల సాధన

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. సోమవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలంలోని లింగాల ఎంజేపీ పాఠశాలను గౌరవ భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సందర్శించారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహార నాణ్యత,పరిశుభ్రత తదితర అంశాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి భోజనం రుచిగా ఉందా, మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తదుపరి విద్యార్థులతో ఎమ్మెల్యే భోజనం చేశారు. రోజువారీ మెనూ గురించి అడిగి తెలుసుకుంటూ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఎంపీడీవో, తహసీల్దార్ పాఠశాల ఉపాధ్యాయులు, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పి.ఎ.సి.ఎస్ చైర్మన్ విజన్ రావు పాల్గొన్నారు.

## వెల్ నెస్ సెంటర్‌లో మెరుగైన వైద్య సేవలు: రవి



**ప్రజాపక్షం/హనుమకొండ :** వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు.సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల పక్కన ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లకు వైద్య సేవలను అందించే వెల్ నెస్ సెంటర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ నెస్ సెంటర్ లోని జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెంటల్, కంటి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, ఓపీ విభాగాలను పరిశీలించారు. ఎంతమంది వైద్యులు, సిబ్బంది విధులకు హాజరయ్యారని అదనపు కలెక్టర్ వెల్ నెస్ సెంటర్ ఇన్ ఛార్జీ డాక్టర్ సుష్మితను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. అక్కడికి వైద్య సేవల నిమిత్తం వచ్చిన పేషంట్లతోనూ మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉంటున్నాయని అడిగారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ వెల్ నెస్ సెంటర్ కు వచ్చే పేషంట్లకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు.వెల్ నెస్ సెంటర్ వద్ద పరిసరాలు బాగుండాలన్నారు. ప్రత్యేక విభాగాల వైద్య నిపుణుల చేత కూడా వైద్య సేవలను పేషంట్లకు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ల్యాబ్ ద్వారా పేషంట్లకు అవసరమయ్యే వివిధ పరీక్షలని నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వైద్యులు పాల్గొన్నారు.


**केनरा बैंक Canara Bank** | సిండికేట్ Syndicate
**నాగార్జునసాగర్ శాఖ (1192) సర్వే నెం. 51/13, సాగర్‌రోడ్, అనుముల సబర్బ్స్, హాలియా, నల్గొండ- 508377**
**డిమాండ్ నోటీసు**

**2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలులోని నిబంధన 3తో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టంలోని సెక్షను 13(2) క్రింద ఇవ్వబడింది.**

దిగువ వివరించిన రుణగ్రస్తులు, సహ-రుణగ్రస్తులు & గ్యారంటీదారులకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా వారు బ్యాంకు నుంచి తీసుకొన్న రుణాలకు సంబంధించిన అసలు మరియు వడ్డీ మొత్తాలను చెల్లించలేదు. మరియు సదరు రుణాలు అమలులో లేని ఆస్తి ఖాతాలుగా వర్గీకరించబడినది. వారికి 2002 సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద నోటీసులు వారి చివరిగా తెల్పిన చిరునామాలకు పంపబడినవి మరియు బట్వాడా కాకుండా వాపసు అయినవి మరియు అందువల్ల ఈ బహిరంగ ప్రకటన రూపంలో వారికి ఇందుమూలంగా తెలుపడమైనది.

| రుణగ్రస్తుడు/ గ్యారంటీదారుని పేరు/ NPA తేది | స్థిరాస్తుల వివరాలు | బకాయియున్న మొత్తం |
|---|---|---|
| **రుణగ్రస్తుడు: శ్రీ కనగంటి శ్రీశైలం,** తండ్రి: పరమేష, ఇ.నెం. 2-121 నందికొండ వారి గూడెం, నిడమనూర్, నల్గొండ- 508278 **NPA తేది: 29-07-2026** | నివాసగృహం మొత్తం డో.నెం. 5-585/1తో విస్తీర్ణం 298 చ.గ.లు, స.నెం. 24, 24/4లో **ఉన్నచోటు:** బ్లాకు నెం. 05, అంగడిబజార్, నివాస ప్రాంతం, హాలియా మున్సిపాలిటీ అనుమల రెవెన్యూ గ్రామం, అనుమల మండలం, నల్గొండ జిల్లా. ప్లింత్ ఏరియా గ్రౌండ్‌ఫ్లోర్ 1417 చ.అ.లు &amp. మొత్తం అంతస్తు 1417 చ.అ.లు, కె.శ్రీశైలం పేరిట యున్నది. మరియు **హద్దులు: ఉత్తరం:** కుందూరు జోగిరెడ్డి & ఇతరుల బహిరంగ స్థలం, **దక్షిణం:** 24అ.ల రోడ్, **తూర్పు:** కుక్కల రాంరెడ్డి గారి గృహం, **పడమర:** కుందూరు లింగారెడ్డి గారి బహిరంగ స్థలం. | రూ. 3,52,007.94/- (రూపాయలు మూడు లక్షల యాభై రెండు వేల ఏడు మరియు పైసలు తొంభై నాలుగు మాత్రమే)లతో పాటు తదుపరి వడ్డీ మరియు సంభవించు ఖర్చులు మరియు కాస్టులు |

నోటీసు తరుణోపాయ సేవలకు చర్యలు తీసుకోబడినవి. పై రుణగ్రస్తుడు(లు) మరియు వారి గ్యారంటీదారు(లు) (వర్తించే విధంగా) లకు ఇందుమూలంగా కోరడమేమనగా బకాయియున్న మొత్తాలను ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుంచి గల 60 రోజులలోగా చెల్లించవలెను. అటుల చెల్లించనిచో 2002 సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టంలోని సెక్షన్ 13లోని ఉపసెక్షన్ (4) క్రింద ఈ నోటీసు ఇచ్చిన తేదీ నుంచి గల 60 రోజులు ముగిసిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోబడును.

**తేది: 01-08-2026 స్థలం: నాగార్జునసాగర్** | **సం/- అధీకృత అధికారి**

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
04-08-2026
www.prajapaksham.in

'బలగం' చిత్రం తర్వాత, జాతీయ అవార్డు గ్రహీత వేణు యెల్దండి అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ' సినిమా చేస్తున్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు సమర్పణలో, శిరీష్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం, బలమైన భావో-ద్వేగాలను, సాంస్కృతిక నేపథ్యాన్ని మిళితం చేస్తూ సాగుతుంది.

# రీల్

## రొమాంటిక్ థ్రిల్లర్‌గా 'అదే నీవు అదే నేను'

*దర్శకుడు కొండల్



'కమిటీ కుర్రోళ్లు' మూవీ ఫేమ్ త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, 'సిద్దార్థ్ రాయ్' సినిమా ఫేమ్ తన్వీ నేగి, సవార్ కృష్ణన్ హీరో హీరోయిన్స్‌గా నటించిన సినిమా 'అదే నీవు అదే నేను'. ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ వీరభద్ర క్రియేషన్స్ బ్యానర్ పై గోవింద కాంట్రేగుల నిర్మించారు. రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో యువ దర్శకుడు కొండల్ రూపొందించారు. 'అదే నీవు అదే నేను' సినిమా రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దర్శకుడు కొండల్ మాట్లాడుతూ మా 'అదే నీవు అదే నేను' సినిమా 31న విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మా మూవీ రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులకు విపరీతంగా నచ్చింది. రొటీన్ చిత్రాలకు భిన్నంగా ఉందని, ఇలాంటి స్క్రీన్ ప్లే తాము చూడలేదని ప్రేక్షకులు చెబుతుండటం సంతోషంగా ఉంది. సినిమా ఫస్టాఫ్ లో మనకు కలిగే అపోహలు తొలగిపోయేలా సెకండాఫ్ లో మన వివాహ వ్యవస్థ గొప్పదనం చెప్పడం ఫ్యామిలీ ఆడియెన్స్ కు రూపొందించిన చిత్రమిది. ఒక్క పోలీస్ పాత్ర లేకుండా రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్ అన్నారు.

## 'యాలాలో యాలాలో' సాంగ్ రిలీజ్



శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం, తన భక్తి గీతమైన మొదటి పాట 'ఇరుముడి కట్టు'తో ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. అదే జోరును కొనసాగిస్తూ, కుటుంబ బంధాలలోని ఆప్యాయతను అందంగా చాటిచెప్పే రెండవ పాట 'యాలాలో యాలాలో'ను చిత్ర బృందం విడుదల చేసింది. జీవీ ప్రకాష్ కుమార్ స్వరపరిచిన ఈ పాటకు ఆయన అందించిన సోల్ ఫుల్ మెలోడీ, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంత శ్రీరామ్ రాసిన ఈ సాహిత్యం మధ్యతరగతి కుటుంబంలోని ప్రేమ, అనుబంధాలు, ఆప్యాయతలే అసలైన సంపద అనే భావాన్ని హృదయానికి హత్తుకునేలా చెబుతుంది. హెషామ్ అబ్దుల్ వహాబ్, సాధికా కెఆర్ ఆలపించిన తీరు పాటకు మరింత భావోద్వేగాన్ని జోడించింది. ఈ పాట ద్వారా సినిమా ఎమోషనల్ కోర్‌ను కూడా మేకర్స్ చూపించారు. రవితేజ కుటుంబాన్ని ప్రాణంగా ప్రేమించే ఓ ఆటో డ్రైవర్‌గా కనిపిస్తారు. మద్యానికి బానిసైనప్పటికీ కుటుంబం కోసం తపించే తండ్రి పాత్రలో ఆయన సహజమైన నటన ఆకట్టుకుంటోంది. ప్రియ భవాని శంకర్ కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకునే భార్య పాత్రలో మెప్పించగా, బేబీ నక్షత్ర తండ్రితో విడదీయలేని అనుబంధం ఉన్న కూతురిగా మనసుని తాకింది. పాటలోని ప్రతి విజువల్, ప్రతి ఎమోషన్ సాహిత్యానికి అద్భుతంగా తోడై కుటుంబ బంధాలను ఎంతో సహజంగా చూపించింది. ఈ పాట విడుదలైన వెంటనే ప్రేక్షకులకు ఫేవరేట్ గా మారింది. నవీన్ ఏర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## డిఫరెంట్ లవ్ స్టోరీగా 'మాయాలేడి'



యంగ్ టాలెంటెడ్ హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా 'మాయాలేడి'. ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు 'మాయాలేడి'తో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశాంత్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్ గా నటిస్తోంది. త్వరలోనే 'మాయాలేడి' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 'మాయాలేడి' సినిమా గ్లింప్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ ఎలా ఉందో చూస్తే - 'హీరోయిన్ గురించి తెలుసుకున్న కొద్దీ ఆమె పట్ల హీరోలో మరింత ఆసక్తి పెరుగుతుంటుంది. ఆ అమ్మాయి గురించి తెలిసే కొద్దీ ఇంకా ఎక్కువగా ఇష్టపడతాడు. ఈ జంట లవ్ ప్రపోజ్ చేసుకుని సంతోషంగా ఉన్న సమయంలో హీరోయిన్ గురించి కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటాడు హీరో. 'తమ మధ్యకు ఎవరైనా వస్తే ఊరుకోనంటూ..' హీరోయిన్ యాక్షన్‌తో సత్తా చూపిస్తుంది. గ్లింప్స్ చివరలో హీరో చెప్పిన 'ఇప్పుడు నా లవ్ స్టోరీలో విలన్ ఎవరో తెలుస్తోంది..' లవ్ సీన్స్, యాక్షన్ సీక్వెన్స్‌ల్లో ఆయన పర్ఫార్మెన్స్ తో ఇంప్రెస్ చేశారు. విశాల్ చంద్రశేఖర్ కంపోజ్ చేసిన 'నిన్ను చూసినాక ఈ క్షణం..' పాట గ్లింప్స్ ఫీల్ ను మరింత పెంచింది. మొత్తంగా ఒక ఇంట్రెస్టింగ్ బ్యాక్ డ్రాప్ తో సాగే లవ్ స్టోరీని థియేటర్స్ లో చూడబోతున్న ఫీల్ ను గ్లింప్స్ క్రియేట్ చేసింది.

## 'ఎల్లమ్మ'లో పర్షిగా దేవి శ్రీ ప్రసాద్



'బలగం' చిత్రం తర్వాత, జాతీయ అవార్డు గ్రహీత వేణు యెల్దండి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ' సినిమా చేస్తున్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు సమర్పణలో, శిరీష్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం, బలమైన భావోద్వేగాలను, సాంస్కృతిక నేపథ్యాన్ని మిళితం చేస్తూ సాగుతుంది. 'రాక్‌స్టార్' దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందించడంతో పాటు హీరోగా పరిచయమౌతున్నారు. ఇది డిఎస్పీ రీర్‌లో ఒక మైలురాయిగా నిలవనుంది. ఈ ఫస్ట్ లుక్ ప్రత్యేకత సింప్లీసిటీ. ఈ మధ్యకాలంలో పోస్టర్లు, ఓవర్ ది టాప్ ప్రెజెంటేషన్లు ఎక్కువగా కనిపిస్తున్న సమయంలో... 'ఎల్లమ్మ' టీమ్ మాత్రం పూర్తిగా భిన్నంగా ప్రజెంట్ చేసింది. సింపుల్ డ్రెస్‌లో, చేతిలో కిరీటాన్ని పట్టుకుని ఎంతో సహజంగా నిలబడ్డ డీఎస్పీ లుక్‌లో అమాయకత్వం, నిజాయితీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో డిఎస్పి కేవలం హీరోగానే కాకుండా సంగీత దర్శకుడిగానూ తన దైన ముద్ర వేయనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా తన డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'ఎల్లమ్మ'ను మలిచిన వేణు, 'బలగం' తర్వాత మరోసారి ప్రేక్షకులను మనసులని తాకే కథతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

## 'అగధ' ట్రైలర్ లాంచ్ చేసిన ఎంఎస్ రాజు



శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కెఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్‌కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని 14న భారీ ఎత్తున విడుదల చేబోతోన్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ట్రైలర్‌ను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు డా. కెవిఎల్ఎన్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ 'అగధ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ అజయ్ , కాశీ విశాలాక్షి ఈ ప్రయాణంలో నాకెంతో సపోర్ట్ చేశారు. 'ఆరిజిన్ ఆఫ్ 'అగధ' కూడా చాలా వైరల్ అయింది. మున్ముందు ఈవెంట్లలో టీం అందరికీ గురించి చెబుతాను. 14న 'అగధ' రిలీజ్ కాబోతోంది. అది నాకు మంచి డేట్ అనిపిస్తోంది. ఆ డేట్‌కి వచ్చే ప్రతీ సినిమా హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. మంచి కంటెంట్‌తో వచ్చే ప్రతీ చిత్రాన్ని ఆడియెన్స్ ఆదరిస్తారు. 'అగధ' సినిమాని అంత సులభంగా తెరకెక్కించలేరు. వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్ వంటివి ఎక్కువగా ఉన్న ఈ మూవీని ఏడాదిలోనే పూర్తి చేశాం. రాకేష్ ఈ మూవీకి అద్భుతమైన స్కోర్ ఇచ్చారు. పూర్తిగా భక్తిరస చిత్రాన్ని తీసినా కష్టమే అవుతుంది. యూత్, జెన్ జీ ఆడియెన్స్‌ని ఆకట్టుకునే అన్ని రకాల అంశాల్ని ఇందులో పొందుపర్చాం. నాకు రిటైర్ అవ్వడం అనేది ఇష్టం ఉండదు. నా శ్వాస ఉన్నంత వరకు సినిమాలు తీస్తూనే ఉంటాను. చిన్నప్పుడు నాకు గాలి సోకిందని కొన్ని రోజులు స్కూల్ కూడా మాన్పించారు. ఆ సంఘటన నా మదిలో అలా ఉండిపోయింది. అది కూడా ఈ 'అగధ' చేయడానికి ఒక కారణం. అందరూ మా సినిమాను ఆదరిస్తారని ఆశిస్తున్నాను. కామాక్షి భాస్కర్ల శ్రవణ్ రెడ్డి ,కాశీ విశాలాక్షి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## 'ఎల్‌జిబిటిలో నటించడం గర్వంగా ఉంది

### ప్రముఖ నటుడు ఎల్ బి శ్రీరామ్




సామాజిక అంశాన్ని హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'ఎల్‌జిబిటి – ఏ లీగల్ బ్యాటిల్' చిత్రం విజయవంతంగా 50 రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర యూనిట్ ఘనంగా విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు పలువురు ప్రముఖులు హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ . ఈ సమాజంలో ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా గౌరవప్రదమైన జీవితం ఉండాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన అని అన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రాధాన్యం కల్పిస్తోందని తెలిపారు. సమాజంలో అందరితో సమాన హక్కులు, అవకాశాలతో వారు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే ఈ చిత్రం సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తోందని కొనియాడుతూ, 'ఎల్‌జిబిటి – ఏ లీగల్ బ్యాటిల్ పార్ట్–2' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా దర్శకుడు పి. సునీల్ కుమార్ రెడ్డి , ఎల్‌బి శ్రీరామ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ చక్రపాణి నటి హిమ, నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు , మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదాల రవి , సోనా రాథోడ్ విష్ణు తేజ రమణ, టివి రామన్, వంశీ , సాంకేతిక నిపుణులు ప్రతాప్ రెడ్డి, నాగరాజు, తేజ , సాయి ప్రసాద్, కోటి, డిస్ట్రిబ్యూటర్ బి బాపిరాజు పాల్గొన్నారు.

## మొక్కజొన్న అమ్మకాల్లో మార్క్‌ఫెడ్ రికార్డు

### ఇ-వేలంలో మెట్రిక్ టన్నుకు సగటున రూ.25,370 ధర
### మంత్రి తుమ్మల నిర్ణయాలతో ప్రభుత్వానికి భారీ లాభం



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మొక్కజొన్న విక్రయాల్లో చరిత్ర సృష్టించింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సంప్రదాయ ఈటెండర్ విధానం స్థానంలో పారదర్శకమైన ఈవేలం విధానాన్ని అమలు చేయడంతో మొక్కజొన్నకు రికార్డు స్థాయిలో ధర లభించింది. ఈ వేలాల్లో మెట్రిక్ టన్నుకు గరిష్టంగా రూ.26,500, కనిష్టంగా రూ.24,100, సగటున రూ.25,370 ధర నమోదైంది. కొనుగోలు ధరతో పోలిస్తే టన్నుకు సుమారు రూ.1,500 లాభం రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరనుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాదిన్నర కాలంలో మార్క్‌ఫెడ్‌కు నష్టాలు తగ్గించేందుకు అనేక చర్యలు తీసుకున్నారు. అనంతరం సంస్థను లాభాల బాట పట్టించేలా తీసుకున్న సంస్కరణల్లో భాగంగానే ఈటెండర్ విధానానికి బదులుగా పోటీని పెంచే ఈవేలం విధానాన్ని అమలు చేశారు. ఈ నిర్ణయం వల్ల మార్కెట్‌లో పోటీ పెరిగి రైతులు, ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరే విధంగా అత్యుత్తమ ధర లభించింది. యాసంగి 202526 సీజన్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14.60 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడం రాష్ట్రంలో ఇప్పటివరకు ఇంత భారీ స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు జరగడం ఇదే తొలిసారి. ఇంత పెద్ద మొత్తంలో మొక్కజొన్నను నిల్వ చేసేందుకు తగినన్ని గిడ్డంగులు అందుబాటులో లేకపోవడంతో జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓపెన్ షెడ్లు, కాటన్ జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లులు తదితర తాత్కాలిక గిడ్డంగుల్లో నిల్వ చేయాల్సి వచ్చింది. వీటిలో సుమారు 3.80 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న వర్షాలకు తడిచిపోయే ప్రమాదం ఉన్న పరిస్థితుల్లో ఉండటంతో, ఆ స్టాక్‌ను 30 రోజుల్లో లిఫ్టింగ్ పూర్తి చేయాలనే నిబంధనతో ప్రత్యేక ఈవేలం ద్వారా మెట్రిక్ టన్నుకు రూ.22 వేల ధరకు త్వరితగతిన విక్రయించారు. దీంతో వర్షాల కారణంగా మొక్కజొన్న దెబ్బతిని ప్రభుత్వానికి సంభవించే భారీ నష్టాన్ని పూర్తిగా నివారించడం సాధ్యమైంది.మిగిలిన సుమారు 10.98 లక్షల మెట్రిక్ టన్నుల సురక్షిత గిడ్డంగుల్లో ఉన్న మొక్కజొన్నకు మార్కెట్ పరిస్థితులను విశ్లేషించి బేస్ ప్రైస్‌ను మెట్రిక్ టన్నుకు రూ.24 వేలుగా నిర్ణయించి, జూలై 31, ఆగస్టు 1, ఆగస్టు 3 తేదీల్లో మూడు విడతలుగా ఈవేలాలు నిర్వహించారు. ఇందులో మొదటి గరిష్ట ధర రూ.25,600, కనిష్ట ధర రూ.24,900లు పలుకగా, రెండవ రోజు గరిష్ట ధర రూ.26,500లు కనిష్ట ధర రూ.24,100, మూడవ రోజు ఈవేలంలో గరిష్ట ధర రూ.26వేలు, కనిష్ట ధర రూ.25,200లు పలికింది. మొత్తంగా 10,98,388 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఈవేలం ద్వారా విక్రయించగా, గరిష్ట ధర రూ.26,500, కనిష్ట ధర రూ.24,100, సగటు ధర రూ.25,370 లభించింది. మార్క్‌ఫెడ్ చరిత్రలో ఇంత భారీ పరిమాణంలో మొక్కజొన్నను ఇంత మంచి ధరకు విక్రయించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

## పెరిగిన సరుకు రవాణా.. 9 శాతం వృద్ధి

ప్రజాపక్షం/హైదరాబాద్: భారతీయ రైల్వేలు జూలై నెలలో సరుకు రవాణా, ప్రయాణికుల రవాణా, ఆదాయ వృద్ధిలో గణనీయమైన పురోగతి సాధించాయి. గత ఏడాది జూలైతో పోలిస్తే ఈ ఏడాది జూలైలో సరుకు రవాణా 9 శాతం పెరిగి 141.3 మిలియన్ టన్నులకు చేరింది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక రంగం, వ్యవసాయం, ఇంధన భద్రతకు రైల్వేలు కీలక మద్దతు అందిస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. జూలై 2025లో 129.7 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసిన రైల్వేలు, ఈ ఏడాది అదే నెలలో 141.3 మిలియన్ టన్నుల సరుకును లోడ్ చేసి కొత్త రికార్డు నమోదు చేశాయి. సరుకు రవాణాలో ప్రధాన వస్తువుల లోడింగ్‌లో కూడా విశేష వృద్ధి నమోదైంది. ఇనుప ఖనిజం లోడింగ్ 22.2 శాతం, బొగ్గు 11.5 శాతం, ఆహార ధాన్యాలు 11.5 శాతం, ఎరువులు 12 శాతం, ఇతర వస్తువుల లోడింగ్ 12.1 శాతం పెరిగాయి. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు డిమాండ్ పెరగడంతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు దేశీయ బొగ్గు సరఫరాను రైల్వేలు గత ఏడాది జూలైతో పోలిస్తే 20 శాతం పెంచాయి. సరుకు రవాణా పెరగడంతో రైల్వేలకు ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. గత ఏడాది జూలైతో పోలిస్తే రూ.1,137 కోట్ల అదనపు సరుకు రవాణా ఆదాయం లభించింది. ఇది 8 శాతం వృద్ధిని సూచిస్తోంది. సరుకు రవాణా ఆదాయంలో ఈస్ట్ సెంట్రల్ రైల్వే, ఈస్టర్న్ రైల్వే తలా 33 శాతం, వెస్ట్ సెంట్రల్ రైల్వే 23 శాతం, సౌత్ ఈస్టర్న్ రైల్వే 10.33 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ప్రయాణికుల రవాణాలో కూడా రైల్వేలు పురోగతి సాధించాయి. ఈ ఏడాది జూలైలో 63.35 కోట్ల మంది ప్రయాణికులు రైల్వే సేవలను వినియోగించుకోగా, 2025 జూలైలో ఈ సంఖ్య 62.19 కోట్లుగా ఉంది. సబర్బన్, నాన్‌సబర్బన్ సేవల్లో ప్రయాణికుల సంఖ్య పెరగడం దేశవ్యాప్తంగా రైలు ప్రయాణానికి పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా నిలిచింది. సరుకు రవాణా సామర్థ్యాన్ని మరింత పెంచడం, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, ఆధునిక రైల్వే మౌలిక సదుపాయాలను విస్తరించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధి, ఇంధన భద్రత, కోట్లాది మంది ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణా అందించేందుకు భారతీయ రైల్వేలు కట్టుబడి ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## ఆర్టీసీ డ్రైవర్, శ్రామిక్ పోస్టుల తుది ఎంపిక జాబితా విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్: టిజిఎస్ ఆర్టీసీలో 1,743 డ్రైవర్, శ్రామిక్ పోస్టుల భర్తీకి సంబంధించి తుది ఎంపిక జాబితాను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి (టిఎస్ఎల్‌పిఆర్‌బి) సోమవారం విడుదల చేసింది. మొత్తం 1,604 మంది అభ్యర్థులు ఎంపిక కాగా, అర్హుల కొరతతో 139 పోస్టులు ఖాళీగా మిగిలాయి.ఎంపికైన అభ్యర్థుల వివరాలు, కటాఫ్ మార్కులు టిఎస్ఎల్‌పిఆర్‌బి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

అభ్యర్థులు ఆగస్టు 7 నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో అటెస్టేషన్ ఫారం పూర్తి చేసి, అవసరమైన పత్రాలతో ఆగస్టు 17న సంబంధిత పోలీసు కార్యాలయాల్లో సమర్పించాలని బోర్డు సూచించింది. నియామకం క్యారెక్టర్ వెరిఫికేషన్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల్లో అర్హత సాధించడంపై ఆధారపడి ఉంటుందని తెలిపింది.

## 'ఆయుష్ నిధుల దుర్వినియోగం'పై విచారణ...

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆయుష్ విభాగంలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగినట్టు వచ్చిన ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. తెలంగాణ ఫోరం ఫర్ గుడ్ గవర్‌నెన్స్ చేసిన ఫిర్యాదు,ముఖ్యమంత్రి కార్యాలయం ఎండార్స్‌మెంట్ ఆధారంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మెమో నం.2653/ఇ1/2025ను జారీ చేసింది. నిబంధనల ప్రకారం ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయుష్ డైరెక్టర్‌ను ప్రభుత్వం సూచించింది. నేషనల్ ఆయుష్ మిషన్ (ఎన్ఎఎం) నిధులతో సుమారు రూ 3.50 కోట్ల విలువైన ముడి, సంయోగ ఔషధాలను టెండర్ నోటిఫికేషన్ లేకుండా, నిపుణుల టెండర్ కమిటీ అనుమతి పొందకుండా రెండు సంస్థల నుంచి నేరుగా కొనుగోలు చేసినట్లు తెలంగాణ ఫోరం ఫర్ గుడ్ గవర్‌నెన్స్ తన ఫిర్యాదులో ఆరోపించింది. ప్రభుత్వం ఇప్పటికే జి.ఒఆర్.టి. నంబర్.288 (2024,జూలై 19న ) ద్వారా టెండర్ కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, ఆ నిబంధనలను పాటించలేదని పేర్కొంది.

కొనుగోలు చేసిన మందుల్లో సుమారు రూ 70 లక్షల విలువైన 'కర్పూర తైలం' నాణ్యత లేనిదిగా, అందులో 90 శాతం కొబ్బరి నూనె మాత్రమే ఉన్నట్టు ఆ ఫిర్యాదులో తెలిపారు. మందులను సరఫరా చేయని కొన్ని సంస్థలకు బిల్లులను చెల్లించారని ఆరోపించింది. ఈ వ్యవహారంలో అప్పటి అదనపు డైరెక్టర్ (ఆయుర్వేద) డాక్టర్ ఎ.పరమేశ్వర్ నాయక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ వి. బాలకృష్ణ కీలక పాత్ర పోషించారని, వారు అప్పటి డైరెక్టర్‌ను తప్పుదోవ పట్టించి రూ 1.20 కోట్ల లంచం తీసుకున్నట్లు ఫోరం తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదుపైన స్పందించిన ప్రభుత్వం, 2024, మార్చి,ఏప్రిల్‌లో జరిగిన ఔషధాల కొనుగోలు ఫైళ్లను పరిశీలించి,దీనిపైన సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆయుష్ డైరెక్టర్‌ను ఆదేశించింది. అయితే సదరు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపైన గతం లో ఉన్న ఆరోపణల పైన విజిలెన్స్ దర్యాప్తు పూర్తి చేసి, ఆ నివేదికను ప్రభుత్వానికి అందజేసినట్లుగా తెలుస్తోంది.

## కంచుకోట బద్దలు

(మొదటి పేజీ తరువాయి)

సాధించారు. తొలిసారి ఎన్నికల్లో గెలిచి చరిత్ర సృష్టించారు. అలాగే ఆయన పార్టీకి తొలి ఎన్నికల విజయాన్ని సొంతం చేశారు. ప్రశాంత్ కిషోర్ 64,151 ఓట్లు సాధించారు. 44,700 ఓట్లు పొందిన బిజెపి అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాను 19324 ఓట్ల తేడాతో ఓడించారు. ఆర్‌జెడి అభ్యర్థి రేఖా గుప్తా 14,085 ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు. కాగా, తొలి ఎన్నికల పోటీలో గెలిచిన తర్వాత ప్రశాంత్ కిషోర్ మీడియాతో మాట్లాడారు. బంకీపూర్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన తక్షణ ప్రాధాన్యత అని తెలిపారు. తీర్పు బిజెపి నాయకత్వానికి ఒక రాజకీయ సందేశాన్ని ఇచ్చిందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. బిహార్ ముఖ్యమంత్రిపై నేరచరిత్ర ఉందని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గాన్ని బిజెపి కైవసం చేసుకున్నది. వడోదర జిల్లాలో ఉన్న ఆ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థి సతీశ్ పటేల్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి బికాబాయి రాబరిపై సుమారు 30 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎన్నికల సంఘం డేటా ప్రకారం.. సతీశ్ పటేల్‌కు 55481 ఓట్లు పోలయ్యాయి. ఇక రాబరికి 24,851 ఓట్లు పడ్డాయి. 20 రౌండ్ల కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు పటేల్‌కు 30,630 ఓట్ల మెజారిటీ దక్కింది. జులై 30వ తేదీన ఉప ఎన్నిక జరిగింది. సీనియర్ బిజెపి ఎమ్మెల్యే, మాజీ మంత్రి యోగేశ్ పటేల్ జూన్ 2వ తేదీన మృతిచెందడంతో ఆ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. మంజల్‌పుర్ ఎన్నికలో కేవలం రెండు పార్టీలు మాత్రం ముఖాముఖిగా పోటీపడ్డాయి. కాంగ్రెస్, బిజెపి మాత్రమే పోటీలో నిలిచాయి. ఈ సీటు గెలుపుతో గుజరాత్ అసెంబ్లీలో బిజెపి సంఖ్య 162కు పెరిగింది. ఆ రాష్ట్రంలో మొత్తం 182 స్థానాలు ఉన్నాయి. కాంగ్రెస్‌కు 12, ఆమ్ ఆద్మీకి 5 సీట్లు ఉన్నాయి. ఇక మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గం కోసం జరిగిన ఉప ఎన్నిక హోరాహోరీగా సాగింది. ఆ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ విజయం సాధించారు. ఆయనకు 66757 ఓట్లు పోలయ్యాయి. బిజెపి అభ్యర్థి ఆశుతోష్ తివారిపై ఘన్‌శ్యామ్ గెలిచారు. సుమారు 6016 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించినట్లు ఎన్నికల సంఘం డేటా ద్వారా తెలుస్తోంది. ఆజాద్ సమాజ్‌పార్టీకి చెందిన దామోదర్ యాదవ్‌కు సుమారు 22 వేల ఓట్లు పోలయ్యాయి.

## కచ్చితత్వమే ప్రామాణికం

(మొదటి పేజీ తరువాయి)

వాసం వెంకశ్వర్ రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు, డిజిటైజేషన్ పురోగతి, గైర్హాజరు, నివాసం మార్చుకున్న (షిఫ్టెడ్, మరణించిన (డెడ్, నకిలీ (డూప్లికేట్) ఓటర్ల (ఏఎస్‌డి) జాబితాల పునఃపరిశీలన, 'నో మ్యాపింగ్' కేసులను సమీక్షించారు. ఓటరు జాబితాను క్షేత్రస్థాయిలో మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏఎస్‌డి కేసులను తుది నిర్ణయానికి ముందు పునఃసమీక్షించి సరైన వర్గీకరణ చేయాలని ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, అనర్హులు జాబితాలో కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైతే 'రోల్‌బ్యాక్' సదుపాయాన్ని వినియోగించి, రికార్డులను మళ్లీ పరిశీలించి సవరణలు చేపట్టాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారుల ద్వారా క్షేత్రస్థాయి ధృవీకరణను మరింత బలోపేతం చేయాలని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బిఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశాల మినిట్స్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్‌ల సంతకాలతో వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. 85 ఏళ్లు దాటిన ఓటర్ల వివరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జిహెచ్ఎంసి కమిషనర్‌తో పాటు పట్టణ జిల్లాల ఎన్నికల అధికారుల పనితీరును సమీక్షించిన సిఈఓ, 'నో మ్యాపింగ్' కేసులు, ఏఎస్‌డి జాబితాలు, అసంగతతలు, సేకరించని ఎన్యూమరేషన్ ఫారాలు తదితర పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించి దోషరహిత ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సాధారణ పరిపాలన (ఎన్నికలు) శాఖ అదనపు కార్యదర్శి ఎన్.శంకర్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసి) జి.ఎస్. చారి, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, అన్ని జిల్లాల డిఈఓలు, ఈఆర్ఓలు, నోడల్ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్ (ఐటి) తదితరులు పాల్గొన్నారు.

## ఉపసంహరించుకోవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపిస్తూ, 'నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను కొనసాగించకూడదనే విషయంలో కేంద్రం పూర్తి నిబద్ధతతో ఉంది. అయితే తీవ్రమైన, హేయమైన నేర చరిత్ర ఉన్న 2,700 మందికిపైగా వ్యక్తులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేది లేదు' అని అన్నారు. మరోవైపు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ తన వాదనలు వినిపిస్తూ, నిరసనల సమయంలో న్యాయవాదుల పిల్లలను కూడా పోలీసులు కొట్టారని అన్నారు. 'ఆ వీడియోలు చాలా దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. మేము కోర్టుకు 300 వీడియోలను ఇచ్చాం. ఉన్నతాధికాల నుంచి ఆదేశాలు వచ్చినందున, పోలీస్ కమిషనర్ వీటన్నింటినీ పరిశీలించాలి. విద్యార్థులపై దురాగతాలకు పాల్పడిన యూనిఫామ్ లేని వ్యక్తులను మేము గుర్తించాం. పోలీసులు పెల్లెట్ గన్‌లు మొదలైనవి ఎందుకు ఉపయోగించారనే దానిపై పోలీస్ కమిషనర్, ఆర్‌పిఎఫ్ డైరెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలి' అని న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, కేవలం ఆందోళన జరుగుతుందనే కారణంతో పోలీసుల దురాగతాలను లేదా లాఠీ ఛార్జిని సమర్థించలేమని స్పష్టం చేసింది. శాంతియుత నిరసన తెలిపే హక్కు అందరికీ సంపూర్ణంగా ఉంటుందని నొక్కి చెప్పింది. తదుపరి విచారణను ఆగస్టు 18కి వాయిదా వేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com